

ఫాదర్ డామియన్

ఫాదర్ డామియన్

అది బెల్జియం దేశం, 'వాటర్లూ నగరానికి దూరంగా ''డైల్'' నది ప్రవహిస్తుంది. వాయవ్యదిశలో 25 మైళ్ళ దూరంగా ''ట్రెమెటో'' అనే ఊరుంది. 1840 సంవత్సరంలో పరిసర గ్రామాలను పదింటిని కలిపి ట్రెమెటొనుపట్టణం చేశారు. అప్పుడు దాని జనాభా 1600 మాత్రమే.

ఆ సమీపాన ''లోవైను'' ఒక కుగ్రామం. అటూ ఇటూ మైదానం. అందులో నిస్సారమైన ఇసుక తిన్నెలు, అక్కడక్కడ గడ్డి తుప్పలు.

ఫ్రాంకోయిన్ డివాస్టర్ ఆ ఊరిలోని ఒక మధ్యతరగతి రైతు, ఆయన భార్య కేథరిన్. 1840 సంవత్సరము జనవరి మూడో తేదీన ఈ దంపతులకు ఆరోబిడ్డ జన్మించాడు. అతనికి జోసెఫ్ అని పేరు పెట్టారు. (ఈయనే మన కథానాయకుడు డామియన్) వాళ్లది ఒక ఇటుకల ఇల్లు, పెద్ద దొడ్డిలో ఒక ప్రక్క కోళ్ల పాక వుండేది.

ఆ ప్రాంతపు గ్రామీణ ప్రజలు మతబోధకుడిని ఎక్కువగా గౌరవించేవాళ్లు. వందల సంవత్సరాలనుంచి కష్టపడి సంపాదిస్తూ, నిరాడంబర జీవితాలు గడుపుతూ సంతృప్తిగా ఉంటున్నారు. పెద్దల నుంచి పొందిన ఆస్తిపాస్తులను అనుభవిస్తూ వాటిని తమ పిల్లలకు అప్పగిస్తూ కాలం గడిపే వాళ్లు. క్రైస్తమ మతాన్ని త్రికరణశుద్ధిగా అనుసరిస్తూ తోటివారికి హాని చేయకుండా జీవనం సాగించటమే వారి ఆదర్శం, ధర్మం.

జోసెఫ్ పెరిగి పెద్దవాడవుతున్నాడు. ఐదేళ్ళపుడు ఆ ఊరిలో తిరునాల్లు జరుగుతుంది. పెద్దలు అంతా సరదాగా తింటూ తిరుగుతున్నారు. పిల్లలు కేరింతలు కొడుతూ ఆడుకుంటున్నారు. ఆ జాతరలో జోసెఫ్ ఎటో జారుకున్నాడు. అంతా వెతగ్గా చర్చిలో పూజామందిరం దగ్గర ఆ చిన్నారి పాదాలు తారాడుతూ కనిపించాయి.

ఆరేళ్ళ వాడయాడు. పరిసరాలలో తాను గమనిస్తున్న విషయాలు జ్ఞాపకాలుగా; అనుభవాలుగా అతని మస్తిష్కంలో నిలిచిపోతున్నాయి. జోసెఫ్ ను

వాళ్ల దగ్గర బంధువొకాయన సామాను చేరవేసే బండిమీద మొదటి సారిగా పొరుగూరికి తీసుకువెళ్ళాడు. ఆ ఊరిలో మతగురువు చనిపోతే అంత్యక్రియలు జరుగుతున్నాయి. మత బోధకులు, రాజకుమారులు మోకరిల్లి ప్రార్థనలు చేస్తున్నారు. ఆ దృశ్యం బాలుని మనోఫలకంపై హత్తుకు పోయింది.

జోసెఫ్ విద్యారంభం తన తల్లి వద్దనే జరిగింది. వాళ్ల ఇంట్లో ఫ్లేమిష్ భాషలోని మతపరమైన పురాతన గ్రంథాలు కొన్ని ఉన్నాయి. ప్రతి సాయంత్రం అతను తన చిన్న అన్న, చిన్న అక్క, అమ్మతో కలిసి వంటింటిలోనే ప్రార్థనలు చేసేవాడు. వాళ్ల అమ్మపనులు అయ్యాక వాళ్ల నాన్న, అన్నలు ఇంటికి రాకముందే వాళ్లకు కాస్త ప్రశాంతత దొరికేది. అప్పుడు యోధుల కథలు, మహనీయుల త్యాగాలు వింటుండేవారు. ఆ ప్రభావం వల్లనే కావచ్చు, ఈ ముగ్గురు పిల్లలూ తమ జీవితాలను మతబోధకే అంకితం చేశారు.

ఏడో ఏడు వచ్చింది, రెండుమైళ్లు నడచి పొరుగూరు వెళ్ళి బడిలో చదవడం మొదలుపెట్టాడు. వానలో, ఎండలో మైనపు పట్టసంచి మెడకు తగిలించుకొని, చేతిలో టిఫిన్ క్యారియరు పట్టుకొని పిల్లలతో కలసి వెళ్లెవాడు. చదువులో చురుగ్గా ఉండేవాడు.

ఆ గ్రామంలో ఉన్న దాదాపు వందమంది పిల్లల్లో జోసెఫ్ ఎంతో అల్లరివాడుగా వుండేవాడు. గుర్రపు బండి వెళుతుంటే ఆ గుర్రానికి రాళ్లు విసిరేవాడు. అది బెదిరిపోయి స్వారీ తీస్తుంటే ఆనందించేవాడు. ఒకసారి ఇలా చేస్తే బండివాడు కొరడాతో కొట్టాడుకూడా, భయంవేసి వెళ్లి చర్చిలో కూర్చున్నాడు. పెద్దలు వెదకుతూ వెళ్ళి బుజ్జగించి తీసుకువచ్చారు.

మరోసారి ఒక బిచ్చగాడు కనిపించాడు. అతను మూడు రోజుల నుంచి అన్నం తినలేదని తెలిసి జోసెఫ్ బాధపడ్డాడు. వాళ్ళ ఇంట్లో ఆరోజు మాంసంకూర వండారు. కాని ఇంకా ఎవరూతినలేదు. జోసెఫ్ ఆబిచ్చగానికి వాళ్ళ ఇంట్లోని మాంసంకూరను గిన్నెతో సహా ఇచ్చేశాడు. పెద్దలు ఇందుకు

కోపడ్డారు. దైవ ప్రసాద స్వీకారం ఏడో ఏడు ఒక పవిత్ర ఆదివారం నాడు జరిపించారు.

13ఏళ్లు వచ్చేసరికి అక్కడ చదువు అయిపోయింది. పుస్తకాలు, సంచీ మూలనపడేసి పలుగూ, పార చేతబట్టి పొలం పనుల్లో తండ్రికి సాయంచేయసాగాడు. పశువులను చూసుకుంటూ, గొర్రెలను మేపుకుంటూ ఇంటిపని చేసేవాడు. పనిచేయడమే అతనికి సరదా, దుక్కిదున్ని నాట్లు వేశాడు. కోతలు కోసి కుప్పలు వేశాడు. ఎరువు మట్టి ఎత్తిపోశాడు.

ఎత్తుగా బలంగా పెరగసాగాడు. త్వరలోనే అన్నకంటే పొడవయ్యాడు. క్వింటాల్ బస్తాను లెక్కలేకుండా సునాయాసంగా ఎత్తగల్గేవాడు ''మా జోసెఫ్ నల్గురు పిల్లల పెట్టురా'' అని చెప్పుకొని మురిసి పోయేవాడు వాళ్ళనాన్న.

ఆపదలో ఉన్నవాళ్ళకు చేతనయిన సాయం చేసేవాడు. ఆ ఊరిలో ఒక ముసలమ్మకు ఉన్న ఏకైక ఆస్తి ఒక అవు, అది జబ్బున పడింది పశువైద్యుడు ఆవు బ్రతికే ఆశలేదన్నాడు. కసాయివాడొచ్చి కాపలా కాస్తున్నాడు ప్రేమగా, ప్రాణాలు ఎప్పుడు పోతాయా అని, అపుడు జోసెఫ్ కసాయివాడిని ఇంటికి పంపివేసి, ఆ రాత్రంతా అక్కడే వుండి సేవచేస్తే మరునాటికి ఆవు గండం గడిచి బయటపడింది.

జోసెఫ్ ఎక్కువగా మాట్లాడేవాడు కాదు. అందుకని తోటి పిల్లలు ''మౌన జోసెఫ్'' అని ఎగతాళి చేసేవారు. కాని ఆటపాటల్లో బాగా పాల్గొనేవాడు. మంచుపైన జారే స్కేటింగ్ ఆటలో ఆ ప్రాంతంలో ప్రముఖుడిగా ఉండేవాడు. అతనికి కమ్మరి పనిచేసే స్నేహితుడు ఒకడు ఉన్నాడు. అక్కడకు వెళ్లి కాలిన ఇనుప ముక్కలను సమ్మెట దెబ్బలతో వంచేవాడు. అంతేకాక స్నేహితుడు ఊరిలో శవాలను పూడ్చడానికి గోతులు త్రవ్వేవాడు. జోసెఫ్ ఈ పనిలో గూడా సహాయం చేసేవాడు. అతనికి తెలియకుండానే ముున్ముందు చేయవలసిన పనులను నేర్చుకోవడం జరిగిందేమో !

చదువుకోసం పొరుగూరు :

ఆనంద దాయకమైన బాల్యం గడచిపోతుంది. తల్లి దండ్రులు కుమారుని భవిష్యత్తు గూర్చి తీవ్రంగా ఆలోచిస్తున్నారు. పెద్దపిల్లలు వ్యవసాయం చేస్తున్నారు. చిన్నన్న, చిన్నక్క మత బోధలలో దేవుని సేవలో జీవితాలు గడపదలచుకున్నారు. అందుకు పెద్దలు ఆటంకం చెప్పదలచుకొలేదు. ఆ కాలంలో ఆ గ్రామీణ ట్రెమెలు ప్రాంతంలో ప్రతి కుటుంబములోను పెత్తనము తండ్రిదే.

రైతుపని మొరటుపని, విసుగులేకుండా ఏడాది పొడుగునా ఏదో ఒక పనిచేయాలి, శలవులు లేవు. ఇంత చేసినా కృతజ్ఞతలేని భూమాత అప్పుడప్పుడు ఆగ్రహం చూపుతుంటుంది. ప్రకృతి వైపరీత్యాలు, ఊహించలేని ఋతుమార్పులు తట్టుకొని భూమినుంచి రైతు పంటలు పండించాలి. ముళ్ళను పెంచి యిచ్చిన నేలతల్లే గులాబీ పూలను కూడా ఇస్తుందని ఆశతో ఎదురు చూసుకుంటూ వ్యవసాయం సాగిస్తారు రైతులు.

మారుతున్న కాలపరిస్థితులను బట్టి జోసెఫ్ ను వ్యాపారిగా చేయాలనుకున్నాడు తండ్రి. వ్యాపారానికి చదువు అవసరం కనుక ఆ ఊరి మతబోధకుని సలహాపై హైనాల్ట్ రాష్ట్రంలోని ''బ్రైనిల్-కాంఫ్ట్'' సంస్థకు పంపి ఫ్రెంచి భాషను నేర్పించాలని నిర్ణయించారు. అంతవరకూ ఆ బాలునికి ఫ్లెమిష్ భాష మాత్రమేవచ్చు. ఈ భాషను చాలా కొద్ది ప్రాంతంలో నివసించే ప్రజలే మాట్లాడేవారు.

బెల్జియం రాజ్యం భౌగోళికంగా సమైక్యంగా ఉన్నప్పటికి ఉత్తర ప్రాంతంలో ఉండేవారిని ఫ్లెమింగులు అని, దక్షిణ ప్రాంతీయులను వాలూనులు అనీ పిలిచేవారు. తెగలను బట్టి రెండిటికీ ఎంతో వైవిధ్యము ఉండేది. దాదాపు 2వేల సంవత్సరాలనుంచి కలసి వుంటున్నా, ఒకే చరిత్రను కలిగి వున్నా వారు వేర్వేరు భాషలు మాట్లాడేవారు ఒక జాతివారంటే మరొకరికి ద్వేషమూ, వైరమూ ఉండేవి.

ఈ పరిస్థితులలో ఒక్క ఫ్రెంచి మాటకూడా రాని జోసెఫ్ బంధుమిత్రులను ఇంటిని వదలి కొత్త ప్రాంతాలలో చదవడానికి మొదటకొన్ని నెలలు ఎంతో బాధపడ్డాడు. తోటిపిల్లలంతా హింసించేవారు, అయితే తనది కమ్మరిపనిచేసి గట్టిపడిన శరీరం గనుక వాళ్ళందరినీ ఎదుర్కొగలిగాడు.

తోటి విద్యార్థులంతా నగర ప్రాంతాలనుంచి వచ్చినవారూ, ధనికులూ, వ్యాపారస్తుల పిల్లలు కావడం వల్ల తాను వారితో కలవడానికి ఇష్టపడక ఒంటరిగా వుండేవాడు. తీరిక దొరికితే ఒంటరిగా పల్లెప్రాంతాల వైపు వెళ్లేవాడు. తన చదువుకోసం ఎంతో శ్రమపడుతున్న తల్లిదండ్రులను తృప్తి పరచడానికై కష్టపడి చదివేవాడు. వారికి జీవితాంతమూ ఋణపడి వుంటానని ఇంటికి ఉత్తరం వ్రాశాడు. ఒక రైతు తన కుమారుడిని బయటి ఊళ్లో చదివించాలంటే ఎంత కష్టమో గ్రహించి నడచుకునేవాడు జోసెఫ్, శలవులన్నా ఆసక్తి లేకుండా శ్రద్ధగా చదువులో మునిగిపోయాడు. విజ్ఞాన క్షేత్రంలో నెర్రెలుపూడుస్తూ పెళ్ళలు పగులగొడుతూ పట్టుదలతో ఆయన సాగించిన విద్యా వ్యవసాయం అది.

కుమారుని విద్యాభివృద్ధిని చూసి సంతసించని తండ్రి వుండడు గదా !

ఆ కాలంలో బెల్జియం దేశం మొదట లియొపాల్డ్ సార్వభౌముని పాలనలో అంతర్జాతీయంగా వాణిజ్యరంగంలో అభివృద్ధి చెందుతుంది. అందువల్ల తన నిర్ణయం మంచిదేనని, కుమారుని వ్యాపారస్తునిగా చేయవచ్చునని కలలుగని మురిసిపోయేవాడు జోసెఫ్ తండ్రి.

జీవితాశయ ఎంపిక :

తానొకటి తలచిన దైవమొకటి తలచె నన్నట్లు జోసెఫ్ మాత్రం మతానుసారమైన జీవితం పట్ల ఆకర్షితుడు కాసాగాడు. నగరంలోని చర్చిలో మతబోధకుల ప్రార్థనలు, ప్రసంగాలు, అతని హృదయాంతరాళాల్లో నాటుకుపోయాయి. ఆ బాలునిలో ఆధ్యాత్మిక చింతన ఆరంభమయింది. అతని

జీవితాశయం ఒక్కటే అని నిర్ణయించుకున్నాడు. ఆది ఐశ్వర్యమా? కాదు, పేదరికం, వినయం, కరుణ కలసిన వృత్తి భక్తులకు దారిచూపే ప్రభువు దారే అది.

ఆ రాత్రంతా జోసెఫ్ కు నిద్రపట్టలేదు. ప్రార్ధన చేసుకుంటూ దివ్య సందేశం కొరకు, సహాయం కొరకు నిరీక్షించసాగాడు. తల్లి దండ్రులకు ఈ విషయం తెలిస్తే ఎంత బాధపడతారో తనకు తెలుసు, తన కుటుంబం తన కొరకు ఎన్ని త్యాగాలు చేసిందో గుర్తుకు వస్తుంటే తనకు బాధ ఎక్కువయింది. ఏమైనా అతని నిర్ణయం తిరుగులేనిది.

మొదట క్రైస్తవ సన్యాసినిగా కొనసాగుతున్న తన అక్కను ఉదహరిస్తూ ఇంటికి లేఖ వ్రాశాడు. ''అక్క ఆనందం ఎంతని చెప్పగలం జీవితానికి సార్ధకతను ఇవ్వగల పనిని ఎన్ని కష్టాలకైనా ఓర్చి సాధించుతుంది. నేను కూడా నా జీవిత పథాన్ని నిర్ణయించుకోవలసిన సమయం వచ్చిందనుకుంటాను, నా అన్నలాగా నేను కూడా జీవితాన్ని మతప్రచారంలో దైవ ప్రార్ధనలో వినియోగించడానికి మీ కేమి అభ్యంతరం ఉండదనుకుంటాను '' అని.

పిడుగువంటి ఈ లేఖ తల్లిదండ్రులను కలవర పర్చింది. తమ బిడ్డభావి జీవితాన్ని గూర్చి వారు కన్న కలలు కల్లలయిపోయాలి. తండ్రి అందుకు కోపంగా, నిరసనగా ఉత్తరం వ్రాయాలనుకున్నాడు. కాని తల్లి సలహావల్ల నిదానించాడు. కుమారుని నిర్ణయపు బాగోగులులను గూర్చి తన మిత్రునితో చర్చించాడు. రహస్యంగా జోసెఫ్ ప్రవర్తన గురించి విచారించారు. ప్రార్ధనాలయాలకు ఎక్కువగా వెళుతున్నట్లు , మత విషయాల పట్ల బాగా ఆసక్తిని చూపుతున్నట్లు తెలుసుకున్నారు.

ఆ ఆసక్తి తాత్కాలికమైనదో కాదో వేచి చూడాలనుకున్నారు. కాని వారాలూ, నెలలూ గడుస్తున్న అతని నిర్ణయంలో మార్పులేదు.

ఆ సమయంలో ఆతని అన్నను పాకస్ నుంచి లోవైన్లోని పిక్ పస్ కార్యాలయానికి బదిలీ చేశారు. జోసెఫ్ ట్రాపిస్టు అనే మతశాఖలో చేరాలనుకున్నాడు. ఆ శాఖలో చాలా కఠోర నియమాలు పాటించాలి.

గంభీరమౌన ప్రార్థనలు, కఠిన శరీర శ్రమ వీరి దినచర్యలు అన్ని లోవైసుకు రమ్మని ఆహ్వానించాడు అన్న:

1858 సంవత్సరము డిశెంబరు రెండవ వారంలో మొదటిసారిగా సన్యాసి ఆశ్రమ సంస్థను దర్శించాడు. అక్కడ వాళ్ళ అన్న పాంఫిలే చెప్పిన విషయాలు విని తాను ''దివ్య హృదయశాఖ''లో చేరడానికి నిర్ణయించుకున్నాడు. క్రిస్టమస్ నాటికి ఆ విషయాన్ని వాళ్ళ ఇంటికి తెలియజేశారు. వాళ్ళకు తెలుసు ఆ రోజున ఏ తండ్రికూడా పిల్లలమాట కాదనలేదని.

మత బోధకునిగా శిక్షణ :

తన 19వ పుట్టినరోజునాటికి జోసెఫ్ బలమైన శరీరముతో ఒక అందమైన యువకునిగా రూపొందాడు. నల్లని ఉంగరాల జుట్టుతో సుందరమైన ఆ యువకుని ముఖం తేజస్సుతో కళకళ లాడుతుంది.

మత గురువు కూడా ఆ యువకునితో సంభాషించిన పిదప అతని వాంఛ ప్రగాఢమైనదని తెలుసుకొని, చర్చి సేవలోకి తీసుకోవడానికి అంగీకరించాడు. అంతా దైవేచ్ఛ అనుకొని తండ్రి మౌనం వహించాడు.

జోసెఫ్, అతని అన్న పాంఫిలే కలసి ఒకే వసతి గృహములో ఉంటూ, నియమబద్ధమైన జీవితాన్ని గడుపుతూ కఠోర నియమాలను పాటిస్తున్నారు. ఒకరోజు పాంఫీలేకు మెలకువ వచ్చి చూడగా, జోసెఫ్ తన మంచంమీద లేడు కటికనేలపై పరుండి ఉన్నాడు. అతనికి కట్టె మంచము కూడా విలాసవస్తువే అనిపించే కాబోలు ! తమ్మునిలేపి, అటువంటి పనులను మఠాధిపతులు అంగీకరించరని చెప్పి మంచముపైకి పంపించాడు.

జోసెఫ్కు గ్రాంధిక భాషలేవీ రానందున, చర్చి నిబంధనల ననుసరించి అతనిని మామలూ బ్రదర్ గానే వుంచవలసివచ్చింది. అతడు మత బోధకుడు కావడానికి అవకాశమేలేదు. కాని మతమంటే అతినకున్న ఆసక్తి వల్ల ఎంతటి ఆదేశాన్నైనా శిరసా వహించేవాడు. అక్కడ ప్రార్థనా మందిరం ఒకదాన్ని నిర్మిస్తున్నారు. అందుకు ఎత్తైన పొగగొట్టం ఒకటి అడ్డువచ్చింది, దాన్ని

పడగొట్టడానికి డైనమైటు ఉపయోగించే వీలులేదు, ఆ ప్రమాదమైన పనికి కూలీలెవరూ రాలేదు, అంతా ఊపిరి బిగబట్టి చూస్తుండగా జోసెఫ్ ఆ చిమ్నీపైకి ఎగబ్రాకి ఒక్కొక్క రాయినీ ఊడదీశాడు.

విశ్రాంతి సమయాల్లో లాటిన్ భాషా వ్యాకరణము నేర్చుకుంటూ, మూడువేళలా ప్రార్థనలు చదువుతూ బోధకుల అభిమానాన్ని చూరగొన్నాడు.

పేరు ఎన్నిక :

కొన్నాళ్ళకు అతిన తల్లిదండ్రులు పెట్టినపేరును వదలి క్రొత్త జీవితంతోపాటు క్రొత్త పేరును గూడా స్వీకరించవలసి వచ్చింది. అందుకు ''డామియన్'' అనేపేరును ఎంచుకున్నాడు. డామియన్ అంటే కీ.శ. 4వ శతాబ్దం ఆఖరులో మానవసేవలో తన జీవితాన్ని గడిపిన సిలీషియా వైద్యుడు.

మత బోధకునిగా శిక్షణపొందటం ముళ్ళపైన నడవటం వంటిదే, డామియన్కు అప్పుడప్పుడూ కోపంవచ్చేది. ఎవరితోనైనా పోట్లాడినా తన తప్పు గ్రహించిన వెంటనే క్షమాపణ చెప్పేవాడు. తాను మతబోధకుడు కావాలంటే తన జీవితం ఆదర్శంగా ఉండాలనుకునేవాడు. ఆయనటేబులుమీద ''మౌనము'', 'ఆత్మావలోకనము', 'ప్రార్థన', అనే మాటలు వ్రాసుకొని, అందుకు అనుగుణంగానే తరువాత ఆకురాలు కాలంవరకు అక్కడేవున్నాడు. అప్పుడు పారిస్ దగ్గర్లోని ఇస్సీ మందిరానికి బదిలీ చేయబడ్డాడు. అక్టోబరులో వర్షము పడుతుండగా తన జీవితాంతమూ పేదరికమూ, వినయమూ, పవిత్రతో కొనసాగుతానని ప్రమాణంచేశాడు.

అన్నాలు తినేదగ్గర మనుషులు ఎక్కువ, బల్లలు తక్కువ అందువల్ల కొందరు రెండో పంక్తివరకు ఆగాల్సివచ్చేది. వెనకవాళ్ళకు అన్ని పదార్థాలు మిగలకపోవచ్చు. వడ్డనశాల గలీజుగాఉండొచ్చు. కాని అవేవి ఎప్పుడూ డామియన్ చేయలేదు. పైగా తనతోటివాళ్ళు ఆకలితో వుంటే తనపదార్థాలు కూడా వాళ్ళకు పెట్టెవాడు. ఇటువంటి తనకు వుంటే తన పదార్థాలుకూడా కొన్ని వాళ్ళకు పెట్టేవాడు. ఇటువంటి తనకు మాలిన ధర్మాలు చేయడం వాళ్ళన్నయ్యకు ఇష్టంవుండక తమ్ముని మందలించేవాడు.

తనకెంతో ప్రేమగా చూసుకొన్న నాయనమ్మ మరణవార్త డామియన్ను దిగుల్లో ముంచింది. అయినా తేరుకొని తానే తల్లిదండ్రులను ఓదారుస్తూ తాత్వికచింతనతో ఒక లేఖ వ్రాశారు ఇలా.....

ఉత్తరాలు :

''మనమందరమూ చనిపోవలసిన వారమే, కావున ఈరోజునుంచే తృప్తిగా, ఆనందంగా చనిపోవడానికి సిద్ధమవటం, ప్రారంభిద్దాం. ఇంకా జీవించవలసిన సమయం ఎంతోవుంది. ఆ కాలాన్ని వృథా చేసుకోరాదు.''

మరోలేఖలో ఇలా వ్రాస్తాడు.

''మీరు నా పారిస్ నగర జీవితాన్ని గురించి తెలుసుకోవాలని ఆసక్తితో వుండవచ్చు. నేను నగరంలోకి వెళ్ళడం చాలా అరుదు. ప్రతి బుధవారం అడవిలోకి కొంతదూరం నడచివెళతాను. ఆ అడవిగురించి చెప్పమంటే చాలా చెప్పగలను, ప్రతిచిన్న అంశాన్ని వివరించగలను. ఆ వనాన్ని ఇంకా సుందరంగా ఉంచడానికి వెయ్యిమంది మనుషులు ఎప్పుడూ శ్రమపడుతుంటారు. నగరవీధులు విషాదాన్ని చిమ్ముతున్నట్లుంటాయి నాకు, అందుకే ఈ వనంలో కాలం గడపడానికి ఇష్టపడతాను.

ఇటీవల ఒక క్రొత్త పీఠాధిపతి వచ్చినందున ''పీఠాధిపతి మహోత్కృష్టపూజ''లో పాల్గొనే అవకాశం కల్గింది. మామూలుగా పూజామందిరం దగ్గరవుండే ఇద్దరు ముగ్గురు మతాచార్యులుకాక ఇరవైమంది దాదాపు వుండి నిర్వహించారు. సాయంకాల ప్రార్థనల తరువాత పీఠాధిపతి చిన్న ప్రసంగం చేశారు. సత్ప్రసాద ఆశీర్వాదం ఇవ్వబడింది.

ఈ పీఠాధిపతి త్వరలో ఓషియానియా ప్రాంతానికి తిరిగి వెళతారు. వెళుతూ తనతోపాటు మాలో కొందరిని తీసుకువెళ్ళవచ్చు. అందులో నేను ఒకడిని అయితే మీరు సంతోషిస్తారుగదా?

ఇట్లు,

ప్రభువుసేవలో మీ కుమారుడు

డామియన్

ఓషియానియా ప్రకృతి సౌందర్యం, ఉష్ణమండల సముద్రతీరమూ, గవ్వలదీవుల, గురించి బిషపుగారి ద్వారా విని వాటన్నిటి అస్పష్ట రూపాలను మదిలో నిలుపుకున్నాడు డామియన్. ఆ దీవులలోని ప్రజలకు సేవ చేయవలసిన అవసరం తెలుసుకొన్నాడు, అంతవరకూ ఆలోచనా మాత్రంగా ఉన్న సేవాభావాలు రూపుదిద్దుకోసాగాయి. డామియన్, అతని సోదరుడూ ఇద్దరూ కలసి ఆ దీవులకు వెళ్ళి సేవ చేయాలని పథకాలు వేసుకునేవారు.

ఇంతలో పారిస్ లో చాలా శ్రమతో కూడిన పనులు నిద్రాహారాలు కూడా లక్ష్యపెట్టకుండా చేయవలసి వచ్చింది. ఎక్కువగా చదవడంవల్ల కంటిచూపు కూడా దెబ్బతిన్నది. ఆ ఎండాకాలం నుంచి డామియన్ లావు కళ్ళద్దాలు ధరించవలసివచ్చింది.

ఆధ్యాత్మిక విద్య :

మళ్ళీ ఆకురాలుకాలం వచ్చింది. ఉన్నత ఆధ్యాత్మిక విద్య పూర్తి చేయడానికి అన్నతో కలసి లోవైను విశ్వవిద్యాలయంలో చేరాడు. అక్కడ ఆర్ట్సు, వేదాంతం, న్యాయ, వైద్య శాస్త్రాలను బోధిస్తారు. అక్కడ అంతా తనకంటె తెలివైనవాళ్ళు ఉండటం చూసి డామియన్ అవమానంతో బాధపడేవాడు. అయితే అక్కడికి తమ ఊరు దగ్గరవటం వల్ల ముఖ్యమైన పండుగలకు ఇంటికి వెళ్ళి బంధు మిత్రులను చూసి వస్తూండేవారు.

తరువాత కొంతకాలానికి తమ తల్లిదండ్రులు పదిమంది బంధువులతో కలసి వచ్చి డామియన్ ప్రార్థనా వేదికపై ప్రమాణం చేయడం చూసారు. తాము కన్నబిడ్డ ఆ ఉన్నతస్థానంలో ఉండటం చూసి వాళ్ళు ఆనందభాష్పాలు విడిచారు.

వేసవి వచ్చింది, మఠం అంతటా పుకారు బయలుదేరింది. చాలా మంది బోధకులను వెంటనే హవాయి దీవులకు పంపుతారని. ఆ అదృష్టవంతులెవరో తెలుసుకోవాలని అంతా ఆతృత చూపుతున్నారు. డామియన్ అతని అన్నకూడా దీర్ఘంగా ప్రార్థనలు చేయసాగారు. జూలై నెలలో ఒక రోజున వార్త తెలిసింది యువబోధకులను పంపుతారని, వారిలో డామియన్ అన్న పాంఫిలే ఒకడు.

డామియన్ ఇంకా బోధకుడుగా అర్హత పొందలేదు. కనుక అతణ్ణి ఎంపిక చేయలేదు. అందుకు డామియన్ ఎంతో విచారించాడు. దాన్ని కప్పిపుచ్చుకుంటూ తన అన్నైనా వెళుతున్నందుకు ఆనందం ప్రకటించేవాడు, ఒకవంక బరువైన హృదయంతోనే తన అన్న అక్టోబరు ప్రయాణానికి ఏర్పాట్లలో సహాయం చేసేవాడు. ఇంతకాలమూ కలసివున్న సోదరులు విడిపోవలసి వస్తుందికదా! మళ్ళీ వాళ్ళు కలుసుకోవడం ఈ జీవితంలోనే జరుగకపోవచ్చు.

ఆకు రాలేకాలం దగ్గరయేకొలదీ దీవులకు తీసుకువెళ్ళవలసిన మందులూ, జపమాలలూ, ఉష్ణమండల దుస్తులూ పెట్టెలలో సర్దటం ప్రారంభించారు. అపుడా ప్రాంతాన్ని టైఫాయిడ్ విషజ్వరం చుట్టు ముట్టి ప్రజలలో భయోత్పాతాలను కలిగించింది. ఈ మహమ్మారి జ్వరపు బారిన పడని యిల్లులేదు. వైద్యులూ, తమ బోధకులూ సేవారంగంలోకి దుమికేరు, శవాలను మోసుకుపోయే శకటాల శబ్దము సాధారణ శబ్దంగా మారిపోయింది. క్రొత్తగా మతబోధకుడైన పాంఫిలే అంత్యక్రియలు, ప్రార్థనలు జరుపవలసి వచ్చింది. మరణశయ్య వెంట మరణశయ్య వద్దకు పరుగులిడుతూ, ఆకలుషిత వాతావరణంలో పదే పదే తిరగడం వల్ల ఆయనకు కూడా విషజ్వరం సోకింది.

జ్వరపు అలల తాకిడికి అతని శరీరం వణికిపోసాగింది. తమ్ముడు డామియన్ మంచం ప్రక్కనేవుండి పరిచర్యలు చేసాడు. జ్వరం తగ్గినా పూర్తిగా కోలుకోవడానికి చాలారోజుల పట్టవచ్చు. ఆ పరిస్థితిలో సుదూర సముద్రయానం వల్ల కలిగే వత్తిడులను అతనిశరీరం తట్టుకోలేదని తేలింది. అందువల్ల అతనిస్థానంలో మరొకరిని దీవులకు పంపవలసి వచ్చింది.

సాహసంతో ఉత్తరం :

అన్నదమ్ము లిరువురూ రకరకాలుగా తమతమ భవిష్యత్తుల గురించి తీవ్రంగా ఆలోచించుకునేవారు. చర్చి నియమ, నిబంధనలకు విరుద్దంగా తన పైవారికి తెలియకుండా డామియన్ పారిస్లోని ప్రధాన పీఠాధిపతికి ఒక లేఖవ్రాస్తూ తన సోదరుని స్థానంలో తనను పంపమని వేడుకున్నాడు.

ఎంతోకాలం నిరీక్షణలో గడచింది. పైవారికి తెలియకుండా ఉత్తరం వ్రాశానన్న బాధ ఒకవంక తన లేఖకు జవాబు ఏం వస్తుందోనని ఆందోళన మరోవంక పీడిస్తుండగా రోజులను బరువుగా గడుపుతున్నాడు డామియన్. ఇదిలాఉండగా పారిస్ నగరంలో ఏంజరుగుతుందో చూద్దాం.

* *　　　* *　　　* *

అది క్రైస్తవమతపు రోమన్ కాథొలిక్ శాఖ అగ్రాధిపతి (సుపీరియర్ జనరల్) కార్యాలయం, ఆ రాత్రి ప్రొద్దుపోయింది. ఈదురుగాలులు వీస్తున్నాయి. సన్నగా వానచినుకులు రాల్తున్నాయి. పెద్దహాలు, గోడల ప్రక్కన పుస్తకాల బీరువాలు, ఎదురుగా ఉన్నతాసనం మీద ఆలంకరించబడ్డ శిలువవుంది. మరో ప్రక్క రెండు కుర్చీలు, ఒక టేబులు ఉన్నాయి. టేబులుపై చాలాముఖ్యమైన కాగితాలు ఆయన నిర్ణయం కొరకు ఎదురు చూస్తున్నాయి. వాటిప్రక్కన భూగోళానికి ప్రతిరూపమైన గ్లోబు వుంది. అగ్రాధిపతి కూర్చుని వ్రాసుకుంటున్నారు.

‘‘అన్నీ దుర్గుణాలే కలవాళ్ళు ఎవరూఉండరు. కాని కొంతమంది వెయ్యిసద్గుణాలను గూడా చూడలేక వాటిచాటునఉన్న ఒక్క దుర్గుణాన్ని వెదికి చూస్తుంటారు మరికొందరు వెయ్యి చెడులక్షణాలు చాటున దాగివున్న మంచినైనా చూడగల్గుతారు. వీరే ధన్యులు....

ఇంతలో ఒకఫాదర్ లోనికివచ్చాడు. అతను కార్యదర్శిగా సహాయం చేస్తుంటాడు, అధికారంలో చిన్నవాడేఅయినా సమవయస్కుడు, చిరకాల మిత్రుడు కావడం వల్ల వారిమధ్య సాన్నిహిత్యం వుంది. పరిపాలనా విషయాలు చర్చిస్తున్నారు వాటిలో ఒకకాగితం తీసి దాన్ని వివరిస్తున్నాడు ఫాదర్.

‘‘చూడండి, ఇది పిక్ పస్ నుంచి డామియన్ అనే తక్కువహోదాగల కుర్రవాడు వచ్చీరాని లాటినుభాషలో వ్రాసిన ఉత్తరం, మతపెద్దలకు తెలియకుండా నేరుగా తమకే వ్రాశాడు అతని అన్నకు బదులుగా హవాయిదీవులకు పంపాలట ఆవేశమేగాని ఆలోచన లేనట్లుంది ఇతనికి.

అతను చేసింది పెద్దనేరం అతన్ని వెంటనే శిక్షించాలి లేకపోతే ప్రతీకుర్రవాడూ ఇలావ్రాస్తే క్రమశిక్షణ ఏమిమిగులుతుంది?'' అన్నాడు కోపంగా

అగ్రాధిపతి మౌనంగా విన్నాడు, ''అంతదూరం పంపమని అడుగుతున్నది సేవచేయడానికే గదా, అదే నేరమనుకుంటేఎలా! ఒకవేళ పొరపాటయినా పోనీలే కుర్రవాడని మన్నించవచ్చు'' అన్నాడు.

''తెలివితక్కువవాళ్ళకే తొందర ఎక్కువ ఏమీచేయలేరు వాళ్ళు అన్నాడు ఫాదర్.

''కావచ్చు, కాని తెలివైనవాళ్ళుకూడా తాత్సారం చేస్తే ఏమీ సాధించలేరుగదా! ఎప్పటి ఆలోచనను అప్పుడే ఆచరణలో పెట్టే వాళ్ళను అదృష్టం వరిస్తుందని సామెతకదా!'' అన్నాడు అగ్రాధిపతి.

ఏమైనా క్రమశిక్షణ లోపించడం ఫాదర్ సహించడు. అయిష్టంగా ముఖంపెట్టి ఇక ఆ విషయం చర్చించడం అనవసరం అన్నట్లుగా వాచిచూసుకున్నాడు. అది గ్రహించిన అగ్రాధిపతి ఓటమిని అంగీకరిస్తూ లేచి నుంచున్నాడు. కొద్ది మౌనం తరువాత ఆయన కళ్ళలో చిన్న వెలుతురు మినుక్కుమంది. ధృఢమైన కంఠస్వరంతో అన్నాడు.

''ఫాదర్, నువ్వు చెప్పిందేనిజం, పిక్ పస్ లోని ఆ తలబిరుసు కుర్రవాణ్ణి శిక్షించితీరాలి శిక్షిద్దాం, అక్కడి పెద్దకు తెలియజేసి ఆకుర్రవాడు జీవితాంతమూ ఒంటరిగా, బానిసగా చాకిరిచేస్తూ బ్రతకాలి. అందుకే అతను దురుసుతనంతో కోరుకున్న వరాన్ని అతనికి ఇస్తున్నాను. దీవులకు వెళ్ళమను''.

ఫాదర్ తీవ్రంగా ముఖంపెట్టి ఆ నిర్ణయాన్ని గుండ్రటి పెద్ద అక్షరాలలో వ్రాసుకున్నాడు.

''డామియన్ ను హవాయి దీవులకు పంపవచ్చు'' ఆకొద్ది అక్షరాలు రోమన్ క్యాథొలిక్ శాఖ చరిత్రలోనేకాదు, నాగరీక ప్రపంచ గాధలోనే ప్రతిధ్వనిని సృష్టించాయి.

* *   * *   * *

ఒకనాడు డామియన్ శిక్షణపొందే బోధకులు ఫలహారం చేస్తున్నారు. విద్యాలయపు పెద్దవచ్చి గంభీరంగా నిలుచున్నాడు. నలుదిశలా పరికించి తీక్షణమైన చూపులతో డామియన్ వైపుగా వస్తున్నాడు. మతబోధకుడుగా తయారవక ముందే దీవులకు వెళ్ళాలనుకోవడంకన్నా తెలివితక్కువతనం లేదు. తనతప్పు తెలిసిన డామియన్ భయంతో వణకి పోతున్నాడు.

''నీవు వెళ్ళవచ్చు'' అన్నాడు పెద్ద. అనుకోని ఈ మాట విన్న డామియన్ కు మిగతా మాటలేవీ గుర్తులేవు. ''నీవు వెళ్ళవచ్చు'' అనేమాట మార్మోగుతుంది. తన ప్రార్థనలు విని తనను కరుణించినందుకు భగవంతునికి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

వెళ్ళటమే తప్ప తిరిగిరాని ప్రయాణం అది, ఆ సమీపంలోని మేరిమాత ఆలయంలో డామియన్ కుటుంబ సభ్యులను చివరిసారిగా కలుసుకున్నాడు బరువెక్కిన హృదయాలతో వీడ్కోలుచెప్పారు. డామియన్ కొంచెం వెనకపడ్డాడు నడకలో. వాళ్ళ అమ్మ త్వరగా నడుస్తుంది ''ఏమిటయ్యా ఎందుకు ఆలస్యం!'' అన్నదామె,

''మళ్ళీరానుకదమ్మా. అమ్మ ఆలయాన్ని తనివితీరా చూడనివ్వు, కళ్ళనిండా ఆలయ అందాలను నింపుకోనివ్వమ్మా'' అన్నాడుః

తల్లి బిడ్డను ఆలింగనం చేసుకుంది. బాధను బయటపడకుండా జాగ్రత్తపడుతుంది అమ్మ. ఇంతలో గుర్రపుబండి వచ్చింది. డామియన్ దాంట్లో ఎక్కాడు.

పారిస్ లో మూడురోజులు ఆగి 29గంటలు రైలు ప్రయాణంచేసి 10మందికి పైగా బృందం సముద్ర తీరానికి చేరారు.

నౌకాయానం :

అది బ్రమెర్ హావెన్ ఓడరేవు, అక్కడ ఒక ఓడలోని ఇరుకు గదిలో ఉన్నాడు డామియన్. మధ్యాహ్నం దాటింది? రేవులో చాలా అపరిచిత శబ్దాలు వినిపిస్తున్నాయి. లంగరు గొలుసుల మోతలు, నావికుల కేకలు నిల్వవుంచిన

మాంసపు వాసనలు మరికొన్ని వింత వింత వాసనలు వస్తున్నాయి. ఆ క్రొత్త వాతావరణంలో వుండి ఉత్తరం వ్రాయసాగాడు ఫాదర్.

''మొదటిసారిగా నౌక కెప్టెన్ తో కలసి భోంచేశాము. అతను మమ్మల్ని అభిమానంతో చూశాడు. పారిస్ నుంచి వచ్చిన ఐదుగురు ఫాదరు మా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు, మూడు సంవత్సరాలకు సరిపోయే బట్టలు మావద్ద ఉన్నాయి. మా నౌక క్యాబిన్ లు చాలా చిన్నవి. అందులో ఒక దానిపై ఒకటి రెండు పడకలున్నాయి, నౌకలోకూడా మా జీవన విధానం ప్రార్థనా మందిరంలో ఉన్నట్లే ఉంటుంది.

మొదట కొన్ని గంటలు ప్రార్థన చదువుకోవడం, ఆటలతో కాలక్షేపం చేస్తాం. శనివారం మధ్యాహ్నం మా నౌక బయలుదేరవచ్చు, గత ఏడెనిమిది ఏళ్ళ నుండి ఈ మార్గంలో ప్రయాణంచేసే గీర్మెన్ నావికుడే మా నౌకను నడుపుతాడట. అతను ప్రొటెస్టెంటు శాఖకు చెందిన క్రైస్తవుడైనా మాతో కలసి భోంచేస్తాడు. మేము కాక మరొక ప్రయాణికుడు మాత్రమే ఉన్నాడు.

మా గురించి మీరేమి విచారించవద్దు, మేము శక్తివంతమైన దేవుని చేతులలో ఉన్నాము. ఆయన మమ్మల్ని రక్షిస్తూంటాడు. నేను మిమ్మల్ని కోరుకునేది ఒక్కటే. మా ప్రయాణం బాగా సాగాలనీ అన్నివేళలా అన్ని చోట్లా మేము చేయవలసిన పనులు నెరవేరడానికి మాకు ధైర్యస్థైర్యాలనివ్వమని ప్రార్థన చేయండి, చాలు, అదే మా జీవితం.

ప్రియమైన తల్లిదండ్రులకు శలవ్, ఇకముందు మనం ఒకరినొకరు చూసుకొని పొందే ఆనందాన్ని పొందలేమేమొ! కాని మన ప్రేమానుబంధం మనలను పెనవేసి ఉంచుతుంది. పరస్పర ప్రార్థనల ద్వారా పరిశుద్ధులయిన మేరీ, యేసుల హృదయాల ద్వారా కలుసుకుందాం.''

సదా మీ ప్రియమైన కుమారుడు
ఫాదర్ డామియన్

ఉత్తరాన్ని ముగించి నౌక గదిలోనుంచి జాగ్రత్తగా పైకి ఎక్కివచ్చాడు. రాబోయే ఐదునెలలు ఆ గదే అతనికి వసతిగృహం.

నౌక బయలుదేరబోయేముందు కొద్దిరోజులు వినిపించే వర్తకుల గోల సరంగుల హంగామాలతో ఓడరేవు మార్మోగుతుంది. మాంసంకోసం నౌకలోకి ఎక్కించబడ్డ జంతువుల అరుపులు వినిపిస్తున్నాయి భీభత్సంగా .

ఆ నౌక లో కొందరు సన్యాసినులు, అతని మిత్రులు కొందరూ ఉన్నారు. క్రొత్తగా చేయబోయే దూరప్రయాణం వల్ల ఆసక్తి, భయాలతో ఉన్నారు. వాళ్ళు సముద్రయానంలో భయాలు చర్చించుకుంటూ, సరదాగా కొంతసేపు గడిపారు. కాని అక్కడ నావికుల పురాతన నమ్మకాన్ని బట్టి మత గురువులు నవ్వితే ఆ నౌకకు దురదృష్టం కలుగుతుందట.

అది నవంబరు నెలలో ఒకనాటి ఉదయం. చలిగావుంది. కొద్దిగా మంచు కురుస్తుంది. నౌక తాళ్ళువదులుచేశారు. ప్రయాణపు తుది ఏర్పాట్లు చేయసాగారు. పెద్ద నౌకను సముద్రంలో కొంతదూరం వరకు లాక్కుపోయి వదలే చిన్న నౌకను ''టగ్గు'' అంటారు. టగ్గు కదిలింది. నౌకకూడా ఒక్క కుదుపుతో కదిలింది.

మంచు తెరల్లోంచి సూర్యుడు దూసుకువచ్చాడు, నౌకంతా మసక వెలుగులో సౌందర్యంగా ప్రకాశిస్తుంది. నౌక వేగం పెరిగింది. అలలను చీల్చుకుంటూ ముందుకుపోతుంది. టగ్ ను దాటి చాలాదూరం వచ్చింది. వీడ్కోలు సూచనగా టగ్ సైరన్ విషాదంగాకూసింది. ప్రయాణీకులకు యూరప్ ఇచ్చిన వీడ్కోలు అది, సాగర తరంగాల వెంట శీతలవాయువులు మెల్లగా వీస్తున్నాయి. భూమి కనిపించకుండా పోయింది.

నావికుల సలహాపై మేజోళ్ళు వేసుకున్నాడు డామియన్. మిగతా వాళ్ళు అంతగా ఆరోగ్యంగా లేరు. వారు పడకలపైననే విశ్రాంతి తీసుకుంటున్నారు.

ఆకాశం అంచులవైపు చూస్తున్నాడు డామియన్, ఆ కనిపించని తీరానికి ఆవల తన కొరకు ఏ గమ్యాన్ని ఏర్పాటు చేసిఉంచాడో ప్రభువు! అది ఏమైనాసరే, తనకు ఓటమి రాకూడదని ప్రార్థన చేశాడు.

సముద్రప్రయాణమూ, క్రొత్త వాతావరణము అలవాటు అయాయి. నౌక ప్రపంచానికి దూరంగా వెళుతుంది. నౌకే ఒక ప్రపంచం అనిపిస్తుంది వారికి, ప్రశాంతమైన రాత్రిళ్ళలో నక్షత్రాలవైపు చూస్తూ కాలం గడుపటం డామియన్ కు ఇష్టం. నావికులతో బాగా పరిచయం అయింది. వారికి కూడా ఆయనంటే గౌరవం ఏర్పడింది. పైకి ఎక్కడం, ప్రాకడం అంటే భయంలేదాతనికి, అవసరమైతే నావికులకు సహాయం చేసేవాడు. నౌకపైన చాలా ఎత్తున నుంచొని సూర్యోదయ తేజస్సును చూస్తూ ఆనందిస్తూండేవాడు.

ప్రయాణంలో వీళ్ళకు చదవడమే కాకుండా ఒక్కొక్కరికి కొన్ని కొన్ని పనులు కేటాయించబడ్డాయి. ప్రార్థన సమయంలో వాడే పవిత్ర పాత్రలను, వస్త్రాలను, ప్రార్థనామండపాన్ని ఏర్పాటు చేయడం, అలంకరించడం డామియన్కు అప్పగించబడింది. వాటిని సక్రమంగా నిర్వహిస్తూ, బైబిలును ఎక్కువగా చదువుతుండేవాడు.

పెనుతుఫాను ప్రమాదం :

చలికాలాన్ని ఉష్ణమండల ప్రాంతాల్లో దాటవేసి ముందుకు సాగుతుంది నౌక. కెప్టెన్ వద్ద తీసుకొన్న 'పోపుల చరిత్ర' అనే పుస్తకం లోని లోతైన విషయాలు అతని యువమస్తిష్కానికి అందడంలేదు. కాని అక్కడక్కడ కొన్ని విషయాలు అతన్ని ఆనంద పరిచాయి.

ఒకరోజు తీవ్రమైన పెనుగాలులు వీచసాగాయి, ఆ గాలులు ఇంకా ఇంకా ఉధృతము అవుతున్నాయి. ప్రయాణీకులను పైకి రావద్దని హెచ్చరించారు. అంతవరకూ సామాన్యంగా ఉన్న తరంగాలు పర్వతాల లాగా ఉవ్వెత్తున లేవసాగాయి. ప్రశాంత సాగరం ప్రళయ నృత్యం చేస్తుందా అనిపించింది. ఆ

పర్వతాల వంటి అలల మధ్య, వాటి నడుమ లోయలలో నౌక చిక్కుకుపోతుంది. గాఢాంధకారం అలముకుంది.

కెప్టెన్ కు దారి తెలియడంలేదు. పెనుగాలులు తుఫానులాగా మారాయి. కేఫ్ హారన్ అనే ఆ ప్రాంతంలో నౌకను చాలా జాగ్రత్తగా నడపాలి. కానీ ఈసారి కెప్టెనుకు విషమపరీక్ష అయింది. నౌక అంతా జలమయం అయిపోయింది. ఆనకట్ట పగిలి ఉప్పెన వస్తున్నట్లు నీరు విజృంభించసాగింది. నౌకను ముంచివేయడమే లక్ష్యమా అన్నట్లు పెచ్చు పెరుగుతుంది తుఫాను. ఆ తాకిళ్ళకు, కుదుపులకు ప్రయాణీకులకు గాయాలు కూడా తగిలాయి. ఆ భయంకర వాతావరణంలో ఎంతకూ మార్పులేదు. ప్రయాణీకులలో నిస్పృహ ఎక్కువయింది. ప్రాణాలతో బయట పడగలమనే నమ్మకం ఎవ్వరికీ లేదు. పదిరోజులపాటు ఆ నౌక పిచ్చివాని చేతిలో ఆట వస్తువులాగా అయిపోయింది.

ఆ పరిస్థితులలో చేయగలిగింది భగద్ధ్యానం తప్ప ఇంకేముంది! అందుకే అదేచేశారు.

ఈ భయానక వాతావరణం ఒక్కరోజో, రెండురోజులోకాదు, తొమ్మిదిరోజులు కొనసాగింది. ఆ తరువాత కొంచెం తగ్గుముఖం పట్టింది ప్రమాదం తప్పిపోయిందని కెప్టెను అన్నాడు. 1864 ఫిబ్రవరి 2వతేదిన వారి నౌక పసిఫిక్ మహా సముద్రంలోకి ప్రవేశించింది. నౌక ఉత్తర దిశగా తిరిగింది తిరిగి వారు పగటి సూర్యుణ్ణి రాత్రి నక్షత్రాలను చూడగలిగారు సముద్రంలో ఎగిరే చేపలను వినోదంగా తిలకించగలిగారు.

అప్పటికి వారి నౌక నేలను విడిచి ఐదునెలలు అయింది. నౌకలో జీవితం విసుగుగానూ, ఇబ్బందిగానూ వుంది. దూరంగా ఒక కొండ కనిపించింది. ప్రయాణీకులంతా సంతోషంగా కేరింతలు కొడుతున్నారు. అది క్రమంగా పెద్దదిగా కనిపించసాగింది. అది ఇంకా దగ్గరయ్యేకొలదీ ఆకు పచ్చగానూ, ఇంకొంతసేపటికి ఎంతో సుందరంగానూ కనిపించింది. సాగర జలాలను ఐదునెలలుగా చూసి చూసి విసుగెత్తిన వారి నేత్రాలకు నేల ఒక మంత్రముగ్ధమైన

ద్వీపంలా కనిపించింది. ఈ విధమైన ప్రయాణంతో 1864 మార్చి 18వ తారీఖున వారి నౌక హవాయి తీరాన్ని చేరింది.

హవాయి దీవులు :

అవి పన్నెండు హవాయిదీవులు. అందులో ఎనిమిది మాత్రమే జనులు నివసించేది. ఇవి ఉత్తర అమెరికా ఖండానికి రెండువేల మైళ్ళు పడమరగా, జపానుకు మూడువేల ఐదువందల మైళ్ళ దూరంలో ఉన్నాయి. ఇవి అగ్నిపర్వతాల కోవకు చెందినవి. 1555 సంవత్సరంలో స్పెయిన్ దేశస్థుడొకడు మొదటిగా కనుగొన్నట్లు చెపుతారు. 1778 సంవత్సరంలో కెప్టెన్ కుక్ చేత తిరిగికనుగొనబడ్డాయి ఈ దీవులు. ఆ దీవిప్రజలు కుక్కు ఎంతో ఆదరంగానే చూశారు. కాని ఎందుకనో అతన్ని మరు సంవత్సరమే చంపి వేశారు.

వాళ్ళు చెట్లకిందనే ఇళ్ళుకట్టుకునేవాళ్ళు. చెట్ల కొమ్మలేదూలాలు. కొమ్మలను తీగెలతో కలపి కట్టేవాళ్ళు. ఎక్కడా మేకు కొట్టే పనిలేదు. తుంగచాపలమీద పడక, ఎముకలతో చేసిన గాలాలు, బల్లెము, విల్లంబు, బాణాలు వారికి ఆయుధాలు. గోడుల గడ్డి తడికలు, సొరకాయ బుర్రలు పాత్రలు. కొబ్బరి చిప్పలు గిన్నెలు. 'టారో' అనే చెట్టువ్రేళ్ళు నలగ గొట్టడానికి ఒకరోలు, గుండ్రాయి ఇంటబయట ఉంటాయి. ఈ పొడితో గంజికాసి తాగుతారు. అందులో వేసిన మాంసం నంజుకుంటారు. చిలగడ దుంపలు, చేపలు, పండ్లు, కాపుసారా అంటే వారికి ప్రాణం లేచివస్తుంది.

రాత్రి భోంచేశాక చుట్టలు కాలుస్తూ, కబుర్లూ, కథలూ చెప్పుకుంటూ వుంటారు విసుగులేకుండా, ఇక పండుగలు వస్తే సరేసరి. పూలదండలు మెడలో, కాళ్ళకు, చేతులకు వేసుకొని అలసియేదాకా ఎగిరేవాళ్ళు 'ఆనందోబ్రహ్మ' అన్నట్లుంటాయి వారి చేష్టలు.

అప్పటికే వారికి వ్యవసాయం చేయడం, పొలాలకు నీరు పెట్టటం బాగా తెలుసు, వారికి ప్రత్యేక సంస్కృతి ఉన్నప్పటికీ ఎన్నో ఆటవిక, అమానుష

ఆచారాలు అమలులో ఉండేవి, నరమాంసం తినేవారట. బహుభార్యాత్వము, బహు భర్తృత్వము కూడా వ్యాప్తిలో ఉన్నాయి. కానీ స్త్రీ పవిత్రతను కాపాడే నెపంతో 1810సంవత్సరం వరకు కూడా ఆడవాళ్ళను అరటిపండ్లు, కొబ్బరికాయలు, తాబేలు మాంసము, కొన్ని రకాల చేపలమాంసం, తిననిచ్చేవారుకారు. అలా ఎవరైనా తింటే వారికి మరణదండ విధించేవారు. ఈ ఆహారనియమాలు ఉన్నప్పటికీ అక్కడ స్త్రీలు లావుగానూ, పెద్ద వయస్సు వాళ్ళు మరీ లావుగా, నడవలెనంతగా ఉండేవారని పూర్వపు నావికులు చెప్పేవారు. యువతులు మాత్రం అందంగా వుండేవారు.

1792లో కెప్టెన్ వాన్ కోవర్ సహాయంతో, అప్పటి హవాయిరాజు యూరపుదేశాల నమూనాలో ఒక నౌకను నిర్మింపజేశాడు. ఆ తరువాత క్రమంగా మరికొన్ని చిన్న నౌకలను నిర్మించి, ఆ దశాబ్దం ఆఖరుకు ఆ దీవులన్నిటినీ తన ఆధిపత్యంలోకి తెచ్చుకున్నాడు. 1820లో ఆ రాజుకు వారసుడుగా నిరాడంబర జీవితాన్ని గడిపే వ్యక్తి వచ్చాడు. అతను మూఢ విశ్వాసాలను వదలి బోస్టన్ నుంచి వచ్చిన మిషనరీల ప్రసంగాలు శ్రద్ధగా విన్నాడు.

వాన్ కోవర్ రాకతో పాటు బ్రాందీలు, మందుగుండు సామాగ్రి , పేక ముక్కలు, యూరోపియన్ బట్టలు, విచ్చలవిడి తిరుగుబోతుతనమూ, భయంకరమైన జబ్బులు కూడా వలస వచ్చాయి. అక్కడ మానవునికి తనకుతాను విధించుకున్నవిగానీ, దేవుని భయంతో అమలు జరిగేవి కానీ ఏ కట్టుబాట్లూలేవు. ఇంగ్లండ్ దేశ మతబోధకుల రాకతో అక్కడ పరిపాలనా నిర్వహణ విధానాలు త్వరితగతిన అమలు పరచబడ్డాయి. 1883లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు అయింది. కాని తరువాత గత్యంతరంలేక 1895 అమెరికా సంయుక్త రాష్ట్రాలలో 50వ రాష్ట్రంగా కలుపబడింది.

మతపరంగా చూస్తే ప్రొటెస్టెంట్లకంటె ఏడు ఏళ్ళవెనుక కాథొలిక్కులు వచ్చారు. ఏ పొరపాటు లేకపోయినా 1831లో కాథొలిక్కులను ఆ దీవులనుండి బహిష్కరించారు. 1836లో ధైర్యంగా, పట్టువిడవకుండా మరలా ప్రవేశించారు.

కాని ఫ్రెంచి యుద్ధనౌక ఆర్టిమిజ్ వచ్చి దీవిపై లంగరు వేసేవరకు, దాదాపు రెండేళ్ళు వారికి ఎంతో గడ్డుకాలం, చాలా క్లిష్టంగా గడిచింది. ఈ నౌక కెప్టెన్ లాప్లేసు ఆయుధసామాగ్రితో నౌకను రేవులో ఆపి దీవులరాజును బెదిరించాడు. ప్రొటెస్టెంటుల లాగా కాథొలిక్కులను కూడా సమంగా ఆదరిస్తానని ఒప్పందం కుదుర్చుకోమని, అలాకాక పోతే ఆ దీవులను సర్వనాశనం చేస్తానని భయపెట్టాడు. ఈ 'తుపాకీ రాజకీయం' బాగా పనిజేసింది. తరువాతి కొన్నేళ్ళలో కాథొలిక్కుశాఖ బాగా వ్రేళ్ళు పాతుకుంది.

దీవులకు ఆహ్వానం :

అక్కడ ఉంటున్న మతప్రతినిధి నౌక వచ్చిందని తెలిసి ఆతృతగా రేవువద్దకు వచ్చాడు. రాత్రి కావస్తుంది. చీకట్లో నౌకను ఒడ్డుకు చేర్చడం ఇష్టంలేక నీళ్ళలోనే ఆపారు. ప్రయాణీకులకు ఆనందోత్సాహాలతో ఆ రాత్రి నిద్ర పట్టలేదు. దూరంగా ఊరిలో దీపాలు మినుకు మినుకుమంటున్నాయి. మసక వెలుతురులో కొంచెంగా కనిపించిన దీవుల ప్రకృతి సౌందర్యం సూర్యోదయంతో ఎన్నోరెట్లు ఎక్కువై హృదయాలను కదలించింది. తెరచాపలు దించబడ్డాయి. నౌక మెల్లగా తీరంవైపు కదిలింది. ప్రయాణీకులను ఎక్కించుకు వెళ్ళడానికి లాంచీ వచ్చింది. అందులో ఆ దీవివాసులు కూడా కొందరు వచ్చారు. వారు డామియన్ ఊహించినంత ఆటవికంగా లేరు, సౌమ్యులుగా, స్నేహశీలురుగా కనిపించారు, వారు శుభాకాంక్షలు చెపుతూ పూలగుత్తులు చల్లారు.

ఆ రేవుకు నౌక వచ్చిన రోజున వారికి పండుగ. ముఖ్యంగా ప్రయాణీకుల నౌకవస్తే, ఇప్పటికి

ఆ దీవుల్లో ఎంతో కోలాహలంగా వుంటుంది. బహుమతులు క్రుమ్మరించారు. అరటిపండ్ల గెలలు, పండిన అనాస పండ్లు, రకరకాల పూలు, పండ్లుతెచ్చి ఇచ్చారు. ఇవన్నీ చూసి మిషనరీలు చికాకుపడ్డారు.

టగ్ వచ్చింది, నౌకను తీరానికి చేర్చే ఏర్పాట్లు చురుకుగాసాగాయి. డామియన్ ఆ దీవి ప్రజలను పరికించడం కెప్టెన్ గమనించాడు. ఆదీవుల ప్రస్తుత

జనాభా ఏభై వేల లోపుగా వుంటుందనీ, కెప్టెన్ కుక్ వచ్చినపుడు నాలుగు లక్షలమంది ఉండేవారనీ చెప్పాడు. తొంభై ఏళ్ళలో జనాభా పెరగడానికి బదులు నాలుగోవంతుకు తగ్గిపోవడానికి ప్రధానంగా మూడు వ్యాధులే కారణం.

అవి క్షయ, సిఫిలిస్, కుష్టు. ఈ మూడు జబ్బులూ తెల్లవారు రాకముందు ఆ దీవుల్లో లేవు. శ్వేతజాతి వాళ్ళు వీరికి చేసిన అన్యాయాలను తెలుసుకొని బాధపడ్డాడు డామియన్.

టగ్ ఎనిమిది గంటలకు నౌకను తీరానికి చేర్చింది. సిబ్బందికి వీడ్కోలు చెప్పి ప్రయాణికులు బయటకు రాసాగారు.

వంకర టింకరగా ఇరుకుగా ఎటుపడితే అటు చీలిపోతూ ఉన్నాయి అక్కడి వీధులు. దారివెంట చెట్లు దట్టంగా పెరిగివున్నాయి. ఆ వీధులగుండా మతబోధకులు ముందుకు సాగి వెల్లుతున్నారు. సముద్రపు ఇసుక దాటాక అందమైన చెట్లు, మందారాలు, రంగురంగుల పూలచెట్లు, వారికి తెలియని మరెన్నో మొక్కలు కన్పిస్తున్నాయి. ఆ వీధులలో కనిపించే ప్రజలు కూడా వింతగా ఉన్నారు. సుందర దృశ్యాలు మారుతున్నాయి. ప్రార్థనామందిరం దగ్గరకు చేరుకున్నారు. ఆ భవనము లోపల మసకవెలుతురు వారికి పరిచయమైన వాతావరణం లాగా వుంది. స్వంత యింటికి వచ్చినట్లుంది. వారి ప్రయాణం సుఖంగా సాగినందుకు కృతజ్ఞతలు చెల్లిస్తూ దేవునికి ప్రార్థనలు చేశారు.

మతగురువు పదవి :

రెండు నెలలు గడిచాయి. డామియన్ మతగురువు కావడానికి అర్హుడని గమనించాడు మతపెద్ద. మరో ఇద్దరితో పాటుగా డామియన్ కూడా మతగురువు కావించబడ్డాడు. కాథొలిక్కుల నమ్మకం ప్రకారం ఇపుడాయన మామూలు మనిషికాదు, ఒక మతబోధకుడు, గురువు. అతనికిపుడు చాలా బాధ్యతలున్నాయి.

ఆ మరుసటి రోజే అతను సామూహిక ప్రార్థన నిర్వహించాడు. అది అయనకు మరపురాని రోజు. ఆనందానికి అవధులు లేవు. ఆరోజు ఆయన వందమందికి పవిత్ర రొట్టెను ఇచ్చాడు.

ఆ తరువాత డామియన్ హవాయిలోని 'హూనో' ప్రాంతంలోని పెద్ద దీవిలో పనిచేయాల్సి వచ్చింది. అక్కడ ఎక్కువమంది జనాభా నివసిస్తున్నారు. ఒక చిన్న స్టీమర్లో మరో మతగురువుతో కలసి ఆ క్రొత్త దీవికి బయలు దేరాడు.

అక్కడి ప్రముఖ మతబోధకుల్లో మైగ్రేట్ ఒకరు. ఆ దీవుల్లో అతడు తిరగని మారుమూల లేదు. సముద్రతీరాల్లో ప్రమాదకరమైన ప్రయాణాలు ఎన్నోసార్లు చేశాడు. ఆ ద్వీపవాసులందరికి అతడు చిరపరిచితుడు. అతన్ని అందరూ గౌరవించేవారు. ఆయనకూ డామియన్ కు స్నేహం కలిసింది. ఇద్దరూ శ్రమించి పనిచేయడానికి సిద్దంగా ఉన్నవారే. తక్కువగా మాట్లాడి ఎక్కువపని చేసే వాళ్ళే కావడం వల్ల స్నేహం బాగా పెంపొందింది. డామియన్ తన భవిష్యత్తు గురించి ఆలోచించుకుంటున్నాడు.

వీరి చిన్న నౌకలోనుంచి చూస్తుంటే, దీవుల ప్రజలు పడవల్లో కన్పిసున్నారు. వాళ్ళు ఉత్సాహంతో పడవల్లో పయనమై పోతుంటే కడలి మీద ఊర్లు కదలిపోతున్నట్లున్నాయి. యువతీ యువకులు వాయిద్యాలు మ్రోగిస్తూ నృత్యాలు చేస్తున్నారు. గర్జనవంటి నవ్వులతో ఆ చోటంతా ప్రతిధ్వనిస్తుంది. వృద్ధులు కబుర్లు చెప్పుకుంటున్నారు. ప్రతివారి మెడలో సువాసనలు వెదజల్లే పూలదండలున్నాయి. శక్తిలేనివారు చాపల మీద పడుకుని వున్నారు. అక్కడ వృక్షాలు దట్టంగా పెరిగి వున్నాయి. అనేకరకా చేపలు దొరుకుతాయి. ఈ స్వర్గసీమవంటి ద్వీపంలోని ప్రజలు కాథొలిక్కు మతం స్వీకరించడంతో అక్కడొక చర్చి నిర్మింపబడింది.

మరో చిన్న ప్రమాదం :

స్థానిక మతబోధకులు వీరికి స్వాగతం చెప్పి, విందు భోజనానికి ఆహ్వానించారు. కొబ్బరిబోండాలు, రాతిపై వేయించిన మాంసం, చేపలతో

వండిన వంటకాలతో కూడిన ఆప్రాంతపు భోజనాన్ని పెద్ద ఆకుల్లో మొదటి సారిగా భుజించాడు డామియన్.

స్థానికులు స్వాగతనృత్యాలు చేశారు. బాకాలు ఊదారు. మతగురువులందరూ వారి వారి దేశాలను గూర్చి చెప్పుకుంటున్నారు. మళ్ళీ తిరిగి వాళ్ళ దేశాలకు వెళ్ళడం జరగదేమో కదా! అంతా ఉత్సాహంతో మునిగి వుండగా ఫాదర్ డామియన్ ఒంటరిగా గ్రామంలోనికి వెళ్ళాడు. ఇరుకు సందులను చీకటి ఇళ్ళను, దట్టమైన చెట్లను చూసి వచ్చాడు. ఉదయం క్రొత్త చర్చిలో ప్రార్థన చేయించాడు. ఇంతలో నౌక సైరను మోగింది, బయలుదేరబోతున్నట్లుగుర్తుగా, ద్వీపవాసులు వీడ్కోలు చెప్పడానికి రేవు దాకవచ్చారు. వారు వేసిన దండలు డామియన్ మెడను నింపివేశాయి. కొద్దిసేపట్లోనే సముద్రాన్ని చేరి నౌకపై గదుల్లోకి వెళ్ళారు.

నౌక కదలి కొంత దూరం వెళ్ళింది. ఉన్నట్లుండి క్రింద గదుల్లో కేకలు, బొబ్బలు, అరుపులు విన్పించసాగాయి. వారిలో భయాందోళనలు కలిగాయి. ఆ నౌక అగ్ని ప్రమాదానికి గురయింది. అలాంటి పరిస్థితుల్లో మంటల వల్ల జరిగే నష్టం కంటే ప్రయాణీకుల త్రొక్కిసలాట వల్లనే ఎక్కువ నష్టం జరుగుతుంది. కాని కెప్టెన్, అతని అనుచరులు నిబ్బరంగా వుండి, ధైర్యంగా వ్యవహరించడంవల్ల మిగతావారు కూడా ప్రశాంతంగా వుండగలిగారు. చెక్కలు ఇంకా కలినట్లయితే నీరు అందులోని వచ్చి నౌక మునిగిపోయేది. ప్రమాదం తప్పినా వారి ప్రయాణం మాత్రం ఆగిపోయింది. తిరిగి ఆ దీవికే వెళ్ళి మరో నౌక వచ్చేవరకు కొన్ని రోజులు ఆగారు. అందుకు డామియన్ బాధపడలేదు. అక్కడి మతబోధకులతో కలసివుండి, వారి అనుభవాలను తెలుసుకోవడం ఆయనకు ఇష్టమే, హవాయి భాష నేర్చుకోవడం ప్రారంభించాడు.

ప్రారంభ కృషి :

అక్కడి వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. అవన్నీ ఎనిమిది దీవులు, నాలుగు పెద్దవీ నాలుగు చిన్నవి. హవాయి అనే ఆ దీవి మిగతా అన్నిటిని కలిపితే

సరిపోయేటంత పెద్దది. దీవిమధ్యలో మూడు అగ్నిపర్వతాలు ఉన్నాయి. అందులో రెండు అదృశ్యమైనట్లే అనుకోవచ్చు. కాని మూడో అగ్నిపర్వతం మాత్రం ఇంకా నిప్పులు చిమ్ముతూనే వుంటుంది. దానికి దగ్గరలోనే డామియన్ ఉండాలి. తన ప్రాంతంలో ఒక చివరినుంచి మరో చివరకు వెళ్ళాలంటే వేడి శిలాద్రవం 'లావా' గుండా నడచి వెళ్ళవలసిందే. అలా వెళ్ళడానికి మూడు రోజులు పూర్తిగా పడుతుంది. అన్ని వైపులా చెల్లాచెదరుగా చిన్నచిన్న గ్రామాలు. గత ఏడెనిమిది సంవత్సరాలుగా అక్కడ మతబోధకుడెవరూ లేరు, చర్చి కూడా లేదు.

కొన్ని నెలలు వీరోచితంగా కృషిచేసి, మండుటెండలను భరించి, తానే వడ్రంగిగి, తాపీ పనివారిగా, వాస్తుశిల్పిగా, రెండు చర్చీలను పూర్తి చేశాడు. సామాగ్రి కొనడానికి డబ్బులేదు. కలప అన్నిచోట్లా దొరికేది కాదు. అతని గొడ్డలి మోత అడవి మానులమధ్య మార్మోగేది. కలప మోసి మోసి అతని కండరాలు కరుకు దేలాయి. ఈయన శ్రమను చూసి స్థానికులు కూడా సహాయం చేయసాగారు.

శక్తిగల మనిషిని పొగడటం అన్ని తెగలవారికి సహజమే. డామియన్ కండబలాన్ని గూర్చి ఆ ప్రాంత వాసులు కథలుగా చెప్పుకోసాగారు. ఆ ద్వీపంలో ఉన్న బలవంతుడు ఆయనే అనుకునేవారు.

ఎక్కడకు వెళ్ళినా సామాగ్రి అంతా వీపుకు తగిలించుకొని వెళుతుండేవాడు. ఆ ఆగ్నిపర్వత ప్రాంతంలో గంధకపు గంధాన్ని పీల్చుకొంటూ దట్టమైన పొదలను కూడా లెక్కచేయకుండా అన్ని ప్రదేశాలు తిరిగాడు. ఆ దీవులు ప్రత్యక్ష నరకంగా ఉండేవి. యువకుడైన డామియన్ కు అక్కడి ప్రజల్లో విస్తృతంగా అమల్లోవున్న స్త్రీ, పురుష సాంగత్యం, విచ్చలవిడి తనం స్వేచ్ఛ నచ్చలేదు. భార్యలను ఒకరినుండి మరొకరు చాలా సులువుగా మార్చుకునేవారు, ఆయన బాగా కృషిచేసి ఈ దురాచారాన్ని కొంత వరకు మాన్పగలిగాడు. అతడేం చేసినా వాళ్ళ మేలుకొరకే చేస్తాడనే విశ్వాసం వారికి కలిగింది.

పీఠాధిపతి ఇచ్చిన కొద్దిమందులు ఆయన వద్దనే ఉన్నాయి. ఆవసరమైన వారికి వీటినందించటానికి ఎంత శ్రమైనా వెనుకాడటంలేదు. ఈ పాటికి ప్రాంతీయభాష పూర్తిగా నేర్చుకున్నాడు. ఫాదర్ డామియన్ ను ఆ భాషలో ''కామియానో'' అని పిలిచేవారు.

ఆ ప్రజల్లో గల అస్థిరత, చపలత్వం తప్ప వారి పద్ధతులన్నీ ఆయనకు నచ్చాయి. వారు సాత్వికులు, సున్నిత హృదయులు, మానవుల్లోని మంచిని మాత్రమే చూడమని మతపెద్ద చెప్పిన మాటలు డామియన్లో అంకురించి పెరుగసాగాయి. ఆ ప్రజల వేషంలో, ఆహారంలో విలాసం కానరాదు. సంపద పోగుచేసుకోవాలనే తపన, ఆరాటం లేదు, నేటిగురించి దిగులు, రేపు గురించి బాధలేదు.

మతం పట్ల, కాథొలిక్ జీవన విధానంలో ఆసక్తి చూపిన వారికి మాత్రమే బాప్తిజము ఇచ్చేవాడు.

గుర్రంమీద స్వారి చేస్తూ, ప్రతి ఉదయం చాలా మైళ్ళు ప్రయాణం చేసి ప్రార్థనలు చెప్పేవాడు. మరికొన్ని ప్రార్థనాలయాలు వెలిశాయి. అందులో కొన్ని పూరిపాకలే. మతబోధనలతోనే సరిపుచ్చుకోక ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తుండేవాడు. తరచుగా అతని చేతిలో గొడ్డలిగాని, పారగాని, సుత్తిగాని ఏదో ఒకటి ఉంటుంది.

క్రిస్టమస్ ఋతువు వచ్చింది. ఆ దీవిలోని ఫాదర్లంతా విందు భోజనం దగ్గర కలసి ఇష్టాగోష్టిగా మాట్లాడుకున్నారు.

ఇపుడు డామియన్కు 25సం..లు. ఆ వయసులో ఆయన శారీరక వాంఛలను అణచుకొని ఎలా ఉన్నాడా అని సందేహం కలుగవచ్చు. ఆ రమణీయ ప్రకృతిలో ఒంటరిగా గడపటం చాలా కష్టమే. అందుకే కావచ్చు ఎప్పుడూ శారీరక శ్రమ విరామం లేకుండా చేస్తుండేవాడు. ఒక లక్ష్యం పూర్తవగానే మరొకటి ఎంచుకుంటూ ఉండేవాడు.

మరో క్రొత్త ప్రాంతానికి :

ఫాదర్ క్లిమెంట్ అనారోగ్యంగా ఉండటంవల్ల ఆయన చూసే కహులే ప్రాంతానికి వెళ్ళడానికి డామియన్ అంగీకరించాడు. అది 180చ.మైళ్ళ విశాలమైంది. ఆ ప్రాంతమంతా తిరిగి పరిచయం చేసుకోవడానికి ఆరువారాలు పట్టింది. మళ్ళీ ఆడవుల్లో ముళ్ళపొదలుదాటుతూ వానల్లో, ఎండల్లో తన ప్రాంతమంతా తిరగసాగాడు. ఒక మంచి గుర్రాన్ని, ఒక కంచగాడిదనూ కొన్నారు. ఇంకా కొన్నిసార్లు పడవమీద, కాలినడకన కూడా వెళ్ళవలసి వస్తుండేది.

సాహసయాత్ర :

అక్కడిక దూరంగా ఒక కుగ్రామంలో కొందరు కాథొలిక్కులు ఉన్నారు. కానీ అక్కడికి వెళ్ళడం చాలకష్టం. ఎత్తైయిన పర్వతాలు సముద్రతీరాలు అడ్డుగా ఉన్నాయని తెలిసింది. ఇది సవాలు అనిపించింది. వర్షాకాలంలో అటువెళ్ళడం మంచిదికాదని ఆ దీవి పెద్ద హెచ్చరించినా వినకుండా బయలుదేరాడు. ఒక పెద్ద కొయ్యమొద్దు ఆధారంచేసుకొని ఆ ప్రాంతంలో ఇద్దరు వీరులను తోడుతీసుకొని డామియన్ ప్రయాణం సాగించాడు. పెద్ద పెద్ద చేపలను తప్పించుకుంటూ, అలలను తప్పుకుంటూ, మొద్దును తెడ్ల సాయంతో ముందుకు నెట్టుకుంటూ వెళ్ళారు. అలా ప్రమాదకరమైన ప్రయాణం చేసి ఒకతీరాన్ని చేరారు. బట్టలు నీటితో తడిసిపోయాయి. ఇక ముందుకు వెళ్ళలేక వెనక్కు వచ్చి కొండదారిని వెళ్ళడానికి నిశ్చయించుకొని నాలుగురోజులు పిదప బయలుదేరాడు.

మొదట కొంతదూరం గుర్రంమీద వెళ్ళాడు. ఇక గుర్రం ఎంత మాత్రం ముందుకువెళ్ళే వీలులేదు. సామాగ్రి వీపుకు కట్టుకొని కాలినడక సాగించాడు. అలా కొంతదూరం పోయాక సముద్రం వచ్చింది. దాంట్లో ఈదుతూ కొంతదూరంవెళ్ళి మరొక కొండ దిగువకు చేరాడు. అదిఎత్తైయిన కొండ దాన్ని ఎక్కడానికి దారిలేదు. రాళ్ళు, రప్పలు, తీగెలు, కొమ్మలు పట్టుకొని ప్రాకుతూ, వంగినడుస్తూ చాలా ప్రమాదమైన ఆకొండ ఎక్కసాగాడు. ఇంతలో వర్షం వచ్చింది. దాన్ని తప్పించుకొని ఏలాగో శిఖరం చేరుకున్నాడు. కనుచూపుమేరలో

ఊరూ, వాడా కానరావడం లేదు. మానవులు తిరిగిన జాడలు కూడా ఎక్కడాలేవు, తానెక్కి వచ్చినంత పెద్దకొండ మరొకటి ఎదురుగావుంది. కాసేపు విశ్రాంతి తీసుకొని, కొన్ని పళ్లుతిని మళ్ళీ ప్రయాణం కొనసాగించాడు. అక్కడనుంచి పైకి ఎక్కుతూ జారినా ప్రమాదమే, వర్షం కురిసినా ప్రయాణం సాగదు. ఆహారంలేక శుష్కించి మరణించవలసిందే

అలాగే శ్రమపడుతూ రెండోపర్వతం ఎక్కాడు. అక్కడ మైదానం కనిపిస్తుంది. అతని చేతులు, కాళ్లు గీసుకుపోయి నెత్తురు ముద్దలయ్యాయి, ఆ మైదానంలో అలాగే దుమ్ములో, ఇసుకలో, మోకాళ్ళలోతు బురదలో నడుస్తూ మూడోకొండపైకి ఎక్కి శ్రమపడుతూ దిగాడు. చీకటి బాగా ముదిరింది. ఇంకెంతమాత్రమూ ముందుకు వెళ్ళలేక అక్కడే నీరసించి పడిపోయాడు.

అతను వెళ్ళవలసినచోటు అక్కడికి దగ్గరలోనేవుంది. మరురోజు ఉదయం ఆప్రాంతంవాళ్ళు అయన్ను చూసి తమ ఇళ్ళకు మోసుకుపోయారు. నీళ్ళతో అతని శరీరాన్ని, పుళ్ళను కడిగారు. ఒక రోజులో అతను తిరిగి నడవకలిగాడు. శరీరం నొప్పులు ఇంకా తగ్గలేదు. కాని చేయవలసిన పని ఎంతో వుంది. సామూహిక ప్రార్థన, మతబోధనలు జేయసాగాడు. ప్రయాణం చేసే ఓపిక వచ్చింది, ఇంత త్వరగా వెళ్ళడం ఇష్టంలేదు.

మరో క్రొత్త ప్రార్థనాలయ నిర్మాణం :

వాళ్ళనొక ప్రార్థనాలయం కట్టమని అడిగాడు వారు అలాగేచేశారు. ఇక్కడ కలప సమృద్ధిగా వున్నా వడ్రంగులులేరు, వాళ్ళను తీసుకురావడం కూడా సాధ్యంకాదు. ఇక తానే సూచనలిస్తూ ప్రార్థనాలయ నిర్మాణం కొనసాగించాడు. చెప్పేవాళ్ళుంటే చేసే సామర్థ్యం వీరికివుంది. కిటికీలకు అద్దాలు లేవు. గంటలేదు, ఒక పెద్దశంఖువు ఊదెవాళ్లు, ఊరిమధ్యలోని ఆప్రార్థనాలయం ఊరికే శోభనిచ్చింది. అక్కడివారిలో ఇద్దరికి ప్రార్థనలు చేయటం గుడి పరిశుభ్రంగా వుంచటం నేర్పి, వారికి అప్పగించి, వారివద్ద వీడ్కోలు తీసుకొని తిరుగుముఖం

పట్టాడు. ఈసారి యిద్దరు యువకులు డామియన్ కు తోడుగా ఇంటివరకూవచ్చి సాగనంపారు.

ఒకరోజు గుర్రంమీద వెళుతూ ఒక చిన్న పడవ సముద్రంలోనికి పోవడం గమనించాడు. అదిస్థానికుల పడవకాదని ప్రమాదంలో చిక్కుకున్నదని గ్రహించాడు. సముద్రంలోకిదూకి షార్కుచేపలను లెక్కచేయకుండా ఈదుకుంటూ వెళ్ళి ఆ చిన్ని పడవను ఒడ్డుకు చేర్చగలిగాడు. అందులో ఎనిమిదిమంది ఉన్నారు, నలుగురు అంగ్లేయులు, ముగ్గురు అమెరికన్లు, ఒకరు డచ్చి దేశీయుడు, వారికి కొబ్బరినీళ్లుఇచ్చి సేదతీర్చి, విశ్రాంతినిచ్చి వారిని కాపాడాడు, వారు ప్రమాదంలో చిక్కుకుపోయి కాలిపోయిన ఒక నౌకకు చెందినవారు ఏడెనిమిది రోజులక్రితం ప్రాణాలు కాపాడే ఈ చిన్నపడవలోకి ఎక్కారు. పడవ నడిపేశక్తి లేక దారీతెన్నూ కానక అలమటిస్తున్నారు, వారు వాళ్ళదేశాలు వెళ్లడానికి నౌక దొరికేవరకు అక్కడే డామియన్కు అతిథులుగా ఉండి సంతోషంగా కాలం గడిపారు.

భూతవైద్యులను ఎదుర్కొనుట :

ఫాదర్ డామియన్ కు ప్రకృతిలో కలిగే అపాయాలేకాక అక్కడి భూతవైద్యులవల్ల కూడా కొన్ని ఇబ్బందులు కలిగాయి. ఆ దీవుల్లో మంత్రాలు, చేతబడులపైన నమ్మకం ఎక్కువ. ఇవి చేసే వాళ్ళుకూడా అక్కడక్కడ ఉన్నారు. కాని వారెవరో బైటకు తెలియనవ్వరు. పూర్వకాలంలో వీళ్ళను ''కాబూనా''లు అనేవారు. ఈ భూతవైద్యులను ప్రజలు ఎంతో ఆరాధించేవారు. వాళ్ళను చూసి భయపడేవారు. రాజులు తర్వాత వీళ్ళంటేనే భయభక్తులు వుండేవి. డామియన్ ఇక్కడకు రావడానికి 50ఏళ్ళపూర్వము వరకూ వీరి ప్రభావము చాలా ఎక్కువగా ఉండేది. ''కాబూనా'' చంపగలడు. బ్రతికించగలడు అని నమ్మేవారు. వీళ్ళ కోపానికి గురిఅయిన వాళ్ళు ఊరు వదలిపోవలసిందే.

ఒకటవ కామహేమ రాజు మరణించాక ఈ భూతవైద్యులు ప్రాబల్యం పలుకుబడి క్రమంగా అంతరించసాగింది. కానీ ఇప్పటికి అక్కడక్కడ ఏదో మారుమూలన ఎవరో ఒకరు ఇంకా చేతబడులు చేస్తూనే ఉంటారు రహస్యంగా.

ఒక సాయంసంధ్యసమయం. డామియన్ ప్రశాంతంగా తన గదిముందు కూర్చొని ఉండగా, దూరంగా డప్పుల మోతలు క్రొత్తవిధంగా విన్పించసాగాయి. పండుగలకు వాయించినట్టుగాక వేగంగా శబ్దాన్ని పెంచుతూ వాయిస్తున్నారు. మధ్యలో వాద్య శబ్దం అగి ఏవో వింత కూతలు వినిపిస్తున్నాయి. అవి మానవులవి కాదు. మళ్ళీ నిశ్శబ్దం. ఆ శబ్దాలు వినికోపంగా లేచి నుంచున్నాడు. ఆ రాత్రిపూట ఆ తతంగం జరిగేచోటికి వెళ్ళేటంత పరిచయంలేదు.

మరునాటి ఉదయం ఆ దిక్కున బాగా వెదికాడు. దట్టమైన కంచెలో మొరటుగా చెక్కబడిన ఒక రాతి బొమ్మం కనిపించింది. నాలుగడుగుల ఎత్తుగా, లావుగా ఉన్నదది. అడుగున పీఠం వుంది. ఒక పూజామండపముంది. దానిపైన నెత్తురు చిక్కగా కరుడుగట్టిన మరకలున్నాయి. రాత్రి అక్కడ జంతుబలి జరిగిందన్నమాట. ఆ విగ్రహాన్ని లాగి అవతల పడేశాడు. పూజామంటపాన్ని ధ్వంసం చేశాడు. రెండు చెట్టుకొమ్మలు నరికి వాటిని శిలువలాగా అమర్చి అక్కడ పాతాడు. ఇదంటా చేసింది ఎవరో తెలియడానికి గుర్తుగా తన టోపీని అక్కడే వదిలివేశాడు.

ఆదివారంనాడు చర్చిలో విగ్రహారాధకులను తీవ్రంగా విమర్శించాడు. అందుకు ఆగ్రహం పొందినవారు డామియన్ ఇంటి వాకిలికి ఒక తాయెత్తు కట్టారు. ఒక గవ్వలో దుర్వాసనవచ్చే బూడిదపోసి దానికి కట్టారు. తాను చేసే ప్రతీ పనినీ ఆ గ్రామస్తులు పరిశీలిస్తుంటారని తెలిసికూడా డామియన్ ఆ తాయెత్తును తీసి ఒక పంది తోకకు కట్టాడు. రోజూలాగానే తోకకున్న అబ్రక దబ్ర గురించి పట్టించుకోకుండా ఆరోజంతా దాని ఆహారాన్వేషణలో గడిపింది. ఆ సాయంత్రానికి దాన్ని చంపి తెచ్చి డామియన్ ఇంటిముందు పడవేశారు. దాని

మాంసం తినడానికి గానీ, దాని వద్దకు రావడానికి గానీ ఎవరూ సాహసించలేదు. అఖరుకు తనవద్ద పనిచేసే సేవకుడు కూడా.

ఆ రాత్రి డామియన్ నిద్రపట్టక ప్రక్కమీద అటూ ఇటూ పొర్లుతున్నాడు. ఈ క్రొత్త విషయం ఆయన పలుకుబడిని క్రమంగా తగ్గిస్తుంది. దూరంనుంచి వినిపించే తప్పెటల మోత ఆలోచనలకు అంతరాయం కలిగించింది. ఇంతో కిటికీవద్ద చిన్న అలికిడి అయింది. ఇదివరలో కుమారునికి జబ్బుచేస్తే మందు తీసుకొన్న ఒక స్త్రీ బెదురుచూపులతో వణుకుతూ అస్పష్టంగా ఒక దానికొకటి సంబంధం లేకుండా కొన్ని మాటలు చెప్పింది. అంతలో ఏదో గుర్తువచ్చి భయంతో క్రీనీడల్లోకి పారిపోయింది. వెంట బూట్లు వేసుకొని బయలుదేరాడు. ఒక గంట ప్రయాణం తర్వాత ఒక చిన్నకొండను ఆనుకొని ఉన్న ఒక స్మశాన గుహను చేరుకున్నాడు.

గుహలో మనుషుల ఎముకల కుప్పలు భరించలేని దుర్గాంధాన్ని వెదజల్లుతున్నాయి. మంత్రాలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి. డప్పుల మోతల మధ్య. డామియన్ గుహపైకి ఎక్కి పడుకొని లోపల జరిగే తతంగం గమనించసాగాడు. నాలుగు పెద్ద కాగడాలు కాంతినీ, పొగనూ చిమ్ముతున్నాయి. 13మంది వేర్వేరు వయస్సుల వాళ్ళున్నారు, ఒక ముసలివాడు మంత్రాలు చదువుతున్నాడు. అతను ఆ దీవిలో పుట్టినవాడుకాదు. నావికుడుగా వచ్చి ఇక్కడ నిలిచిపోయినవాడు. ఒక కుక్క తల నరికి రక్తాన్ని సొరకాయ బుర్రలోకి పట్టాడు. తన్మయంగా ముందుకూ వెనుకకు ఊగుతూ మంత్రాలు ఆపాడు. డప్పులచప్పుళ్ళు ఆగాయి. అతని సైగతో మూడు దీపాలు కూడా ఆర్పివేశారు. అంతా మాంత్రికుని వైపే భయంగా చూస్తున్నారు. ఒక చిన్న కొయ్యబొమ్మను పైకి తీశాడు. దాని మెడలో శిలువవుంది. నడుముకు జపమాల వుంది. ఆ జపమాల గతంలో డామియన్ ఇంటిలో కనిపించనిదే, అంటే ఆ బొమ్మ ఫాదర్కు ప్రతిరూపం అన్నమాట.

డామియన్ ఇక ఓపిక పట్టలేక గుంపుమధ్యకు దూకాడు. అనుకోని ఈ సంఘటనకు అంతా ఉలిక్కిపడ్డారు. భయపడ్డారు. తేరుకొని అంతా ఒక్కసారి పెద్ద కేకవేసి పైకిదూకారు. ఆ బొమ్మను ముక్కలు ముక్కలు చేశాడు. వాళ్ళు నరహంతకులని ఆయనకు తెలుసు ఏ మాత్రం అవకాశం దొరికినా తనను కూడా చంపడానికి వెనుదీయరని తెలుసు కాబట్టి మంత్రగానికి గుణపాఠం చెప్పాలనుకొన్నాడు. ''మీరేమైన చిన్నపిల్లలా!'' కుక్క నెత్తురను, గుడ్డపేలికలను చూసి భయపడుతున్నారు'' అని బొమ్మను కాలితో తొక్కి ''వెళ్ళిపొండి ఇళ్ళకు ఇది నిజాయితీపరులుండే చోటుకాదు'' అని గద్దించి తానుకూడా విజయగర్వంతో ఇంటికివెళ్ళాడు.

ఆ సంఘటన తర్వాత ఆయనకు ఏమి ప్రతిఘటనరాలేదు. బాగా మతవ్యాప్తి చేయాడానికి వీలయింది.

బయటి నుంచి సహాయం :

కొన్ని క్రొత్త ప్రార్ధనాలయాలు నిర్మించారు. క్రొత్త బోధకులకు శిక్షణ ఇచ్చాడు. పాఠశాలలు అవసరమయాయి. అందుకు హోనొలూలు ప్రభుత్వానికి అభ్యర్ధన పంపాడు. ఇంగ్లాండు మత బోధకులచే ప్రభావితమైన ప్రభుత్వంవారు ప్రోటెస్టెంటులద్వారా చదువుచెప్పిస్తే బాగుంటుందనుకున్నారు. కాని యువకుడైన ఫాదర్ డామియన్ నిస్వార్ధసేవలను తెలుసుకొని వెంటనే నలుగురు కాథొలిక్ ఉపాధ్యాయులను పంపాడు. డామియన్ అజ్ఞానుసారంగా నడచుకొమ్మని.

ఆధునిక నమూనాలో ఒకచర్చిని నిర్మించాలనే డామియన్ కోర్కెను తెలుసుకొని మతగురువులు, మదర్ కలిసి కొన్ని చందాలు వసూలుచేసి కలప, పనిముట్లు విగ్రహాలు కొని నౌకద్వారా పంపించారు.

సముద్రానికి 9మైళ్ళ దూరంలో కొండమీద చర్చిని నిర్మించాలి సముద్రతీరాన దారి బాగుండదు. ఖాళీబండి పోవాలంటేనే మూడు జతల ఎద్దులు లాగాలి. అందుకని రాత్రిపూట వచ్చి ఇసుకలోనేపడుకొని ఉదయమే లేచి ఎవరికి చేతనయిన సామాను వారు తీసుకొని వెళ్ళేవారు. పనిని చేస్తూ శ్రమ

తెలియకుండా ఉండటానికి పాటలు పాడేవారు. దూరాన నుంచొని పనులు పురమాయించడమేకాదు, ఎవరికీలేవని ఒక మొద్దును తానే స్వయంగా మోసుకు వెళ్ళాడు డామియన్. చర్చి నిర్మాణానికి ఎప్పటికప్పుడు మరొకటి ఇలాంటి చర్చి నిర్మించాలనుకున్నాడు.

డామియన్ కు 30 ఏళ్ళు నిండబోతున్నాయి. అతనికి పరిపూర్ణమైన ఆరోగ్యం, వ్యాయామం చేసిన శరీరం, కొండలలో, లోయలలో నడచి గుఱ్రపుస్వారీ చేసి ధృడపడినది అది, ఎంతో క్రమశిక్షణతో నియమబద్ధమైన జీవితం గడిపేవాడు. పొగాకు ఒక్కటే ఆయనకున్న (విలాసం) వ్యసనం, దీన్ని కూడా అదుపులో ఉంచడానికి ప్రయత్నించి రోజూ ఒకపైపు మాత్రమే కాల్చేవాడు.

ఆయన ఉత్తరాలు వ్రాయడమూ, అందుకోవడమూ కూడా అరుదుగానే జరుగుతుంది. ఒక సిస్టర్ కు ఆయన హాస్యంగా ఇలా వ్రాశాడు....

''మూడు ఏళ్ళు అయింది నీ వద్దనుండి ఒక పంక్తి కూడాలేదు మరి నీవు ఎక్కడున్నావ్ ప్రియమైన చెల్లాయ్? ఒకవేళ అపుడే స్వర్గానికి వెళ్ళావా ఏమిటి ? ఇంత త్వరంగా వెళ్ళవులే, స్వర్గ కిరీటం నీకు దక్కడానికి ఇంకా సమయం ఉందనుకుంటా, ఇంతకాలమూ మరచిన ఈ పేదసోదరునిపై కనికరం చూపు. నేను త్వరలోనే ఆటవికుల్లో కలసిపోతున్నాను. అవును, నేను వాళ్ళను ప్రేమిస్తున్నాను. త్వరలోనే వాళ్ళు కూడా యూరోపియన్లకంటే నాగరీకులుగా తయారవుతారు. చదవడం నేర్చుకుంటున్నారు.''

డామియన్ వంటి దృఢకాయుడు కూడా తిరగడానికి వీలులేనంత విశాల ప్రాంతం అది. అందువల్ల మరొక బోధకుడిని ఆ దీవికి తీసుకువచ్చి, కొంత ప్రాంతాన్ని అప్పగించి కొద్దిరోజులు వుండి వెళ్ళాడు పీఠాధిపతి, ఆయన డామియన్ పనులనూ, హృదయపూర్వక ప్రార్థననూ చూసి ఎంతో సంతసించారు.

ఫాదర్ ఈ దీవికి వచ్చాక ఇది నాలుగో క్రిష్టమస్

బయట ప్రపంచం :

1870 వచ్చింది. బయట ప్రపంచంలోని కొన్ని ముఖ్య సంఘటనలు డామియన్ దృష్టిని ఆకర్షించాయి. సూయజ్ కాల్వ త్రవ్వబడింది. ప్రపంచ మంతటా ఆ ఘనవిజయాన్ని కీర్తనలుగా పాడుతున్నారు. ఫ్రెంచ్ ఇంజనీరు డి.లెస్సెప్ పట్టుదలను కొనియాడుతున్నారు.

జర్మన్ యుద్ధం జరిగింది. మూడవ నెపోలియన్ కీరీటం ఒకటో విలియం స్వాధీనమయింది.

ఇంగ్లాండులో ఫ్లారెన్స్ నైటింగేలు రోగులకు పరిచర్యలు చేయడాన్ని గురించి ప్రతి ఇంట్లో చెప్పుకుంటున్నారు. ప్రజారోగ్యము, ఆసుపత్రుల నిర్వహణ గురించి దేశ నాయకులు ఆలోచించసాగారు. ఎడిన్ బరో ప్రభువు ‘‘హోనొలూలు’’ దర్శించాడు. ఇదివరకటి రాణిగారి జ్ఞాపకార్థము అక్కడ నిర్మించబడిన క్రొత్త ఆసుపత్రిని చూశాడు.

రోగుల్ని వేరే పంపడం :

అది మంచి భవనం. యూరప్ లోని ఏ గొప్ప ఆసుపత్రికీ తీసిపోదు కాని దురదృష్టవశాత్తు అందులో కుష్టువ్యాధికి చికిత్స సదుపాయాలు లేవు. ఈ వ్యాధి అంటే ఆ దీవిలో ప్రజలు భయపడేవారు. 1853 సం..ములో మొదట ఈ వ్యాధిని గుర్తించారు. ఆ దీవిలో తరువాత పదేళ్ళలోనే ఈ వ్యాధి విస్తారంగా పెరిగిపోయింది. రోగులను ప్రత్యేకంగా వుంచి రోగాన్ని అదుపులో పెట్టవలసి వచ్చింది. మొదట్లో ఇందుకై చేసిన ప్రయత్నాలు చాలా స్వల్పము, హోనొలూలు వద్ద ఈ రోగులను వేరుచేసి ఉంచేవారు. కాని అక్కడి ప్రజలు వీళ్ళను చూసి భయపడటంవల్ల మరోప్రదేశం కావలసివచ్చింది. మొలకాయ్ ద్వీపంలో మూడుప్రక్కల సముద్రం, ఒకప్రక్క కొంచెం నేల వున్న ప్రాంతాన్ని కొని రోగులను అక్కడ ఉంచేవారు. రోగులందరినీ వేరుచేయాలని 3-1-1865న రాజాజ్ఞ జారీ అయింది.

1866లో 14మంది రోగులను అక్కడకు పంపారు. రోగులుగా కాదు, వలస మనుష్యులుగా వాళ్ళకు భూమి ఇచ్చారు. వ్యవసాయ పనిముట్లు ఇచ్చారు. పండించుకొని తిని, బ్రతకమన్నారు. కాని పాపం: ఆ మొండికాళ్ళు, చేతుల్తో, రోగిష్టి శరీరాలతో వాళ్ళేం చేయగలరు? ప్రభుత్వానికి వీళ్ళు భారం కాకుండా ఉండటానికి ఉద్దేశించబడిన ఈ పథకం విఫలమైంది. చాలామంది రోగులు భయంకరమైన చావుకు లోనయారు, కొన్నాళ్ళు అలాగే కొనసాగాయి.

ఇంకా కొందరు రోగుల్ని సరుకులు ఇచ్చి ఆ ప్రాంతానికి తరలించారు. దీంతో వర్ణింప వీలుకానంత దుర్భరంగా తయారయిందా ప్రాంతం. ఆ రోగుల స్థితి, సరుకులు అయిపోసాగాయి. బలవంతులు బలహీనులను దోచుకొని తినడం జరిగింది. ఆర్తనాదాలు, ఆకలిచావులూ మామూలైపోయాయి.

అక్కడ దొరికే చెట్టువ్రేళ్ళతో నాటుసారా కాచుకొని తాగేవారు అది భరించలేని వాసన, కాని నిషాగా వుండేది. త్రాగుడు మితిమీరి పోయింది. వ్యభిచారం కూడా కొనసాగుతుంది. కొట్లాటలు ఆరంభమయ్యాయి. కొందరు రోగులు తప్పించుకొని పోయారు. దాంతో ఇరుగు పొరుగు దీవివాసులకు ఈ భయంకర దీవి గురించి, అక్కడి రోగుల గురించి తెలిసిపోయింది. ''హోనొలూలు''లో చట్టాలు చేశారు. కాని వీటిని అమలుచేసే దెవరు? ఒక సూపరిండెంటును నియమించారు. కానీ అతనికి ఎదురు తిరిగారు రోగులు, కాపలాదారులను పంపారు, వారికి తుపాకులంటే భయంలేదు. కుష్టురోటులంటే మాత్రం తగని భయం రోగులను చూసి పోలీసులు పారిపోయేవారు. ఈ బలహీనతను పసిగట్టిన రోగులు పోలీసుల దగ్గరకు వెళ్ళుతూ, వాళ్ళ పుండ్లను చూపేవారు ఇద్దరు ముగ్గురు రోగులు కలసి కాపలావాళ్ళను కౌగిలించుకుంటామని బెదిరించేవాళ్ళు.

ఇదిలా ఉండగా ఆ ప్రాంతమంతటా విపరీతంగా కుష్టువ్యాధి పెరిగి పోసాగింది. క్రొత్తగా రాజు వచ్చాడు. ఆయన ఈ కాలనీలోనూ, బయటా రోగుల స్థితి బాగుచేయాలని తలచాడు. వ్యాధి వున్న వాళ్ళందరినీ కాలనీలోకి

పంపించసాగారు. కుటుంబ జీవనానికి అలవాటు పడ్డరోగులు కుటుంబాలు వదలి వెళ్ళాలంటే చాలా బాధపడేవాళ్ళు, అందునా ఈ భూలోక నరకంలోకి చూస్తూ చూస్తూ వెళ్ళాలంటే మరీ : పారిపోయే రోగులను పట్టుకోడానికి వేటకుక్కలను వదిలేవాళ్ళు, అవి రోగుల్ని పట్టుకొని చీల్చుకుతినేవి.

కాని ఈసారి అధికారులు చట్టాన్ని తీవ్రంగా అమలు చేస్తున్నారు. కుష్టురోగి ఎక్కడ దొరికినా సరే వెంటాడి పట్టుకుంటున్నారు. దీంతో రోగులు కుటుంబాలతో సహా అడవుల్లోకి, కొండల్లోకి పారిపోసాగారు. క్రమంగా ఇంట్లో నుంచి పారిపోయి అజ్ఞాత జీవితం గడిపేవారి సంఖ్య పెరగ సాగింది.

డామియన్ ఉండే ప్రాంతంలో గూడా ఈ ఇబ్బంది ఉంది. ఒక డాక్టరు, నలుగురు పోలీసులు ఆ గ్రామం వచ్చారు. గ్రామం మధ్యలో ఒక నోటీసు ఉంచారు. కుష్టురోగులందరినీ రెండువారాలలోపుగా ఆరోగ్య అధికార్లకు తెలియపరచాలనీ, వాళ్ళను పరీక్షచేసి మొలకాయ్ దీవులకు పంపుతాము కాబట్టి సిద్ధంగా ఉండాలని.

అది చూసి గ్రామస్థులంతా విషాదంలో మునిగిపోయారు. అన్ని కుటుంబాల వాళ్ళు తల్లినో, భర్తనో, భార్యనో ఆ తెల్లవాళ్ళకు అప్పగించడానికి తీసుకువస్తున్నారు. వాళ్ళంతా చర్చిముందు చాపలు వేసుకొని పడుకొనేవారు. ఆప్తులను, కుటుంబాలలోని మనుష్యులను వదలలేక వదలలేక వాళ్ళు ఏడ్చే ఏడ్పులతో ఆ ప్రాంతం మార్మోగేది. వాళ్ళు చేయని నేరాలకు శిక్ష అనుభవించడమే అది. బ్రతికున్న వాళ్ళే చితిమీదకు నడచి వెళుతున్నట్లుందివారిస్థితి. బరువైన హృదయంతో డామియన్ తనవిధులను నిర్వహించేవాడు.

భార్యను వదలలేని భర్త :

మిగతా కొన్ని దీవుల్లో వలెనే ఇక్కడా స్వచ్ఛందంగా లొంగిపోని రోగులున్నారు. అటువంటి వాళ్లను లొంగదీసుకోవడానికి తీవ్రచర్యలు తీసుకోవాల్సి వచ్చేది.

ఇటువంటిదే ఒక ప్రేమికుని గాధ. అతని భార్యకు వ్యాధి వుంది. అందుకని సమాజానికి దూరంగా సముద్రతీరాన ఒక పాకవేసుకొని ఆమెకు సపర్యలు చేసుకుంటూ కాలం గడుపుతున్నాడు. ప్రభుత్వ చట్టాన్ని విని అతడు భార్యను తీసుకొని కొండల్లోకి వెళ్ళిపోయాడు. ఒక రైఫిలూ, కొన్ని మందుగుండ్లు సంపాదించి, పోలీసులు దగ్గరకు వెళ్ళబోతే కాల్పులు జరిపేవాడు, చంపుతానని బెదిరించేవాడు. ఈసారి పోలీసులు గట్టి బందోబస్తుతో సిద్ధమవుతున్నారు.

అపుడు డామియన్ పోలీసుల అనుమతి తీసుకొని, ధైర్యంగా కొండ ఎక్కి ఆరుగంటలపాటు అక్కడే కూర్చొని ఆ దంపతులకు నచ్చజెప్పాడు. కాలనీ అంటే ఆయనకు ఇష్టం వుండి కాదు. వాళ్ళు వప్పుకోకపోతే పోలీసులు కాల్చేయటం ఖాయం. ఆ ప్రమాదాన్నుంచి తప్పించడానికి ఇంత కృషి చేశాడు. డామియన్ ఎంతకూ తిరిగి రాకపోవడంతో పోలీసులు కొండపైకి బయలుదేరారు. ఫాదర్, రోగి, ఆమె భర్త ఎదురయ్యారు. డామియన్ తెల్పిన షరతులకు పోలీసులు అంగీకరించి అతన్ని ఏమీ శిక్షించకుండా, భార్యతోపాటు కాలనీకి వెళ్లనిస్తామన్నారు.

రోగులందరినీ పడవలోల మొలకాయ్ పంపారు. కొద్దిరోజులకు వాళ్ళను గురించి అందరూ మరచిపోయారు. డామియన్ మాత్రం వాళ్ళ సంక్షేమం కోరి రోజూ ప్రార్థనలు చేసేవాడు.

భార్యాభర్తలలో ఎవరికి జబ్బు వస్తే వాళ్ళను బలవంతంగా వేరుచేసి కాలనీకి లాక్కుపోయేవారు. కాని ఆ శాసనాన్ని మార్పించి రోగితోపాటు భార్యగాని, భర్తగాని ఇష్టమై వెళ్ళదలిస్తే కాలనీకి వెళ్ళి వుండవచ్చునని మార్పించాడు డామియన్.

ఇష్టపూర్వకంగా కోరుకున్న అతికష్టమైన పని :

ఫాదర్ డామియనే కాదు, మిగతా మతగురువులు కూడా అంతటి ఉత్సాహంతోను, పట్టుదలతోను కృషిచేస్తున్నారు. ఫాదర్ లియోనోర్ ''వైలూకు'' అనేచోట ''మాయ్'' దీవిలో క్రొత్త చర్చి నిర్మించాడు. ఆ దీవిలో చెరకు పండిస్తున్నారు. కూలీలు ఎక్కువగా ఉన్నారు. చర్చి ప్రారంభోత్సవం ఘనంగా జరపాలని ఆ ప్రాంతపు మతగురువులందర్నీ ఆహ్వానించారు.

నౌక వచ్చేవరకూ ఆగకుండా డామియన్ చిన్న పడవమీద బయలుదేరి వెళ్ళాడు. చర్చి ప్రారంభపూజలు ఘనంగా జరిగాయి. పీఠాధిపతి బోధకులను ఉద్దేశించి మాట్లాడాడు. వారి సేవలను ప్రశంసించాడు. ఆ సందర్భంలో మొలకాయ్ దీవుల ప్రసక్తి వచ్చింది. బిషప్ కంఠస్వరం గాద్గదికమై బొంగురుపోయింది. ఇంతకుముందు అక్కడకు కొందరు ప్రొటెస్టెంటు, కాథొలిక్కు మతబోధకులు వెళ్ళి కొన్నాళ్ళుండి వచ్చారు. కానీ ప్రస్తుతం చట్టప్రకారం అలా వీల్లేదు. అక్కడికి వెళ్ళినవాళ్ళు జీవితాంతము అక్కడే వుండాల్సిందే. ఆయనకు మాటలు రావడంలేదు. అంతటి త్యాగం ఎవరిని చేయమని అడగగలడు ?

ఆయన అభిప్రాయం గ్రహించి ఆ ప్రసంగం కాగానే డామియన్ తో సహా నల్గురు తమ ఇష్టాన్ని, ఆసక్తిని తెలిపారు. ఈ నలుగురు ముఖాలలోని నిజాయితీ, సేవాభావం చూడగానే ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి. ఆ దీవికి వెళ్ళి అక్కడ ఉండటమంటే వారికి ఆ వ్యాధి వచ్చినట్లే లెక్క, ఆ అందమైన ముఖాలలో ఏ ముఖాన్ని వ్యాధికి గురిచేసి వికృతం చేయడానికి ఆయన మనసొప్పడం లేదు.

ఇది గమనించిన డామియన్ ప్రసుత్తం తాను ఉండే ప్రాంతాన్ని ఏ క్రొత్తవారైనా చూడగలరనీ, కానీ మొలకాయ్ కి మాత్రం అనుభవం కలవారు కావాలనీ చెప్పాడు. పీఠాధిపతి గంభీరంగా తలపంకించి ఆయన చేతిని డామియన్ భుజంపై వుంచాడు.

''ఈ ఉద్యోగానికి నియమించడమంటే మరణశిక్ష విధించినట్లే. అది తెలిసి నాకై నేను ఎవ్వరికి ఇవ్వను ఈ ఉద్యోగం. దీన్ని నీ కోరికమేరకే ఇస్తున్నాను''

అన్నాడు. డామియన్ నిర్ణయం త్యాగంతో కూడినదని తెలుసు అయినా దాన్ని పొగడటం కానీ, ఆర్భాటం చేయటంగానీ జరుగలేదు, మామూలుగా అభినందిస్తూ చప్పట్లు కొట్టడం తప్ప.

బిషప్ 'హోనొలూలు' వెళ్ళడానికి స్టీమరు సిద్ధంగా వుంది. దాంట్లోనే డామియన్ కూడా వెళ్ళాని చెప్పారు. ఆయన నిర్ణయంవల్ల ఒక్క గంటలోనే ఆయన జీవితమార్గమే మారిపోయింది. ఇలాటివి ఆయనకు క్రొత్తకావు. హోనొలూలు వెళ్లేసరికి తెలిసింది. ఆరోజు ఏభైమంది కుష్టురోగులు నౌకపై వస్తున్నారని డామియన్ ఆ రోజే తానుకూడా వెళ్తానని పట్టుబట్టాడు. తనకు కావలసిన సామాగ్రికూడా కొనే వ్యవధిలేదు. వంటి మీద బట్టలు కాక ఒక చొక్కా, దినచర్య వ్రాసుకునే పుస్తకం తప్ప మరేమీలేవు.

'కిలాయుయా' అనే నౌక నిస్పృహకు మారుపేరు. కుష్టురోగులు గుంపులు గుంపులుగా తమ సామాను వేసుకొని వస్తుంటారు. వీళ్ళకు వీడ్కోలు ఇవ్వడానికి అక్కడికి వచ్చేవారిని, రోగుల నిట్టూర్పులతో, వెక్కిళ్ళతో, మార్మోగిపోయింది ఆ చోటంతా, డామియన్ రోగుల్లో ప్రతి ఒక్కరి ముఖాన్ని చూస్తున్నాడు. కొందరి ముఖాల్లో రోగలక్షణాలు ఏమీ లేవు. కొందరి ముఖాలు మాత్రం భయంకరంగా ఉన్నాయి.

వీడ్కోలు విషాదం :

నౌకకు కట్టిన మోకులను వదులుచేశారు. మెల్లగా కదిలి దూగారం సాగిపోంది. ఒక్కసారిగా దుఃఖం వెల్లుబికి కట్టలు తెంచుకున్న ఏరులా పొంగింది. కడసారిగా ఒకరినొకరు చూసుకున్నారు. అందులోనే ఒక పశువులమందను కూడా పంపుతున్నారు. ఆ రాత్రంతా మనుషుల ఆర్తనాదాలు, అరుపులతోబాటు పశువుల రంకెలు అరుపులూ కలసి బీభత్సంగా వుంది. బిషప్ కూ, ఫాదర్ కూ ఆ రాత్రి నిద్రపట్టలేదు. వారు మౌనంగా ఎవరి ఆలోచనల్లో వాళ్లు మునిగి ఒక చిన్నగదిలో చాపమీద ఉన్నారు.

ఇంకో గంటకు తెల్లవారుతుందనగా చలిగా వుంది. రోగులను దించవలసిన దీవి వచ్చింది. ఒక పడవను దించారు, ఫాదర్, బిషప్ దిగారు, రోగులుకూడా దిగారు అందులోకి. ఆ చీకట్లో ఆదీవిలో వివరాలేమీ కానరావడంలేదు.

వేకువచలిలో సాగర తరంగాలు నురగలు గ్రక్కుతున్నాయి. తీరాన దీపాలు మిణుగురు పురుగుల్లా మెరుస్తున్నాయి. పడవ తీరం చేరేసరికి అక్కడ కొందరు జనం గుమిగూడి ఉన్నట్లు కనిపిస్తున్నారు. డామియన్ ఇంతకుముందే ప్రార్థనల సమయంలోనూ, పడవలోనూ కుష్టురోగులను చూశాడు. కాని ఆ దీవి మీద కాలుమోపేవరకు ఆ వ్యాధి తీవ్రత, వికృత రూపాలు అంతపూర్తిగా ఆయన చూడలేదు. వాళ్ళు బ్రతికి ఉన్న శవాలుగా కనిపిస్తున్నారు. మనిషి అవయవాల ఆకారమేమీ తెలియడంలేదు. ఈ భయంకర దృశ్యాలు చూసిన డామియన్ భయపడ్డాడని అనుకున్నాడు బిషప్ ''డామియన్, నీవు మళ్ళీ, బాగా ఆలోచించుకో. నీ నిర్ణయాన్ని మార్చుకో అన్నాడు.

డామియన్ తల అడ్డంగా తిప్పాడు. నిబ్బరంగా చెప్పాడు. తాను అక్కడే వుంటానని, ప్రయాణీకులంతా దిగిపోయారు. బిషప్ ను తిరిగి తీసుకువెళ్ళడానికి పడవ సిద్ధంగా వుంది. బిషప్ ఇబ్బందికరమైన మౌనంలో మునిగి ఉన్నాడు. ఈ యువకుణ్ణి ఆ భయంకర ద్వీపంలో వదిలివెళ్ళడం ఆయనకు బాధగా వుంది. పడవవాళ్ళూ త్వరగా రమ్మని కేక వేస్తున్నారు. రోగులు చుట్టుముట్టారు, వాళ్ళ నుద్దేశించి పీఠాధిపతి.

'ప్రియమైన బిడ్డలారా, ఇంతవరకూ మీరు ఒంటరిగా మిమ్మల్ని పట్టించుకునేవాళ్లూ లేకుండా ఉన్నారు. మీకు ఇపుడొక తండ్రిని తీసుకువచ్చాను. మిమ్మల్ని ప్రేమగా చూసుకుంటాడు ఆయన. మీలో ఒకడై, మీ మంచీ, చెడూ చూసుకుంటూ, మీతో కలసి జీవించి, కలసి మరణించడానికై సిద్ధపడివచ్చాడు ఈయన అని తన చెయ్యి పైకి ఎత్తాడు. మోకరిల్లి వందనం చేశాడు డామియన్, వీడ్కోలు చెప్పి త్వరగా పడవ వద్దకు వెళ్ళాడు బిషప్. దాంతో బయటి ప్రపంచానికి

ఆ దీవికి ఉన్న సంబంధం తెగిపోయింది. ఆ పడవ కనిపంచేవరకూ చూస్తున్నాడు డామియన్, అది నౌకను చేరింది.

సూర్యుడు పైకి వస్తున్నాడు. దూరాన నౌక చిన్నదిగా కనిపిస్తుంది. పెద్ద శబ్దంచేసుకుంటూ నౌక కదిలింది. నౌక హారన్ విషాదంగా, పెద్దగా మోగింది. అది డామియన్ కు నౌకవారు తెల్పిన వీడ్కోలు.

వ్యాధి చరిత్ర :

క్షయ వ్యాధి అంటే 'అసలు చావుకు ముందుగా వచ్చే చావు' అనుకునేవారు ప్రాచీన ఈజిప్టు ప్రజలు, అది సరైన వర్ణనే, శతాబ్దాల తరబడి ప్రపంచప్రజలంతా ఈ వ్యాధి గూర్చి భయపడుతున్నారు. హెబ్రూలు, గ్రీకులు, రోమనులు దీన్ని గురించి వ్రాశారు భయం కలిగేలాగా ఈ రోజుకూ శాస్త్రానికి అంతుబట్టకుండా మానవజాతికి పీడలాగ వుంది.

రమణీయ ప్రకృతి వాతావరణానికి ప్రసిద్ధిగాంచిన నైలులోయలో ఈ వ్యాధి ప్రారంభమై వుంటుంది. ఈ వ్యాధి అతి చల్లని ప్రాంతమైన ఐస్ ల్యాండ్ లోనూ వుంది. భారతదేశపు కొండప్రాంతాలలోనూ వుంది. చేపలు తినని ఆఫ్రికన్ లోనూ వుంది. జనసాంద్రత తక్కువగా వున్న దక్షిణ పసిఫిక్ లోనూ వుంది. దీన్ని గూర్చి, బైబిలులోనూ, తాల్మూద్ అనే మత గ్రంథంలోనూ వుంది. కానీ వాళ్ళూ చికిత్సచేయడానికి కష్టమైన ప్రతి చర్మవ్యాధినీ ఈ పేరుతోనే వ్రాసినట్లు అనిపిస్తుంది.

హెబ్రూలకు మంచి వైద్యులే ఉన్నారు. కాని తీవ్రమైన జబ్బులు దేవుని శాపంవల్ల వస్తాయనుకునేవారు అందుకు నివారణ ప్రార్థనచేయడమేనని, రోగులను మతగురువులవద్దకు పంపేవారు. అప్పట్లో వారు ప్రతి అంటువ్యాధిని అదుపుచేయడానికి, రాకుండా చూసుకోవడానికి ప్రయత్నించేవారు. మాంసంకొరకు వధించే జంతువులను పరిశీలించడం వల్ల శరీర నిర్మాణాన్ని గురించి తెలుసుకునే వీలయింది. పారిశుద్ధ్యము, ప్రజారోగ్యములకు ప్రాధాన్యత ఇచ్చేవాళ్ళు, యూదులు మంచి ఆహార నియమాలు పాటించేవారు.

కుష్టువ్యాధిని నివారించే మార్గాలు బైబిలోని లేవియ కాండములో ఉన్నాయి. ఎవ్వరికైనా ఈ వ్యాధి ఉన్నట్లు తెలిస్తే వాళ్ళను వెలివేసి ఖైదీలకంటే హీనంగా చూసేవారు.

యూరప్ లోకి ఈ వ్యాధి ఎప్పుడు వచ్చిందో, ఎలా వచ్చిందో తెలియదు. భారతదేశంలో క్రీ.పూ.1400 నుంచీ పర్షియాలో క్రీ.పూ.800లోనూ ఉన్నట్లు తెలుసు, రోమనులు ఈజిప్టును ఆక్రమించేవరకు అక్కడ ఈ వ్యాధిలేదు. సైనికులు, నావికులు వ్యాధులను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి చేరవేయడంతో ప్రధానపాత్ర వహిస్తారు. క్రీ.శ 550నాటికి దూరానవున్న బర్ ల్యాండ్కు విస్తరించింది. ఇక ఇంగ్లాండులో కూడా కుష్టురోగులకు వైద్యశాలలు ప్రారంభించవలసి వచ్చింది.

12, 13 శతాబ్దాలలో ప్లేగువ్యాధి తీవ్రంగా, దావానంలా వ్యాపించింది. ఇంగ్లాండులో మరీ ఎక్కువగా వుండేది. అక్కడ పారిశుద్ధ్యము, వ్యక్తిగత పరిశుభ్రము ఎంతో హీనస్థితిలో వుండేవి, క్రిక్కిరిసిన నగరాలు మురికితో నిండివుండేవి. కుళ్ళిపోయిన చేపలు, ఊరబెట్టిన మాంసం తినేవారు. జీవితంలో ఒకసారైనా ఒక్క కూరగాయైనా తిననివాళ్ళు ఎందరో ఉండేవారు. రోజూ ఒకే దుస్తులు, హెబ్రూలు బోధించిన ఆరోగ్య సూత్రాలను అందరూ మర్చిపోయారు. కాని కుష్టురోగుల విషయం మాత్రం వాళ్ళు మరువలేదు.

కుష్టురోగి చింకిబట్టలతో, చింపిరిజుట్టుతో ఉండాలి. నోటికి చెయ్యిఅడ్డం పెట్టుకొని 'అపరిశుద్ధుడు' అని అరుస్తూవెళ్ళాలి. ఒంటరిగా ఊరిబయట నివసించాలి. 'అపరిశుద్ధుడు' అనే విషాదపు అరుపులతో పట్టణాలన్నీ మార్మోగుతుండేవి. క్రమంగా క్రొత్త నిషేదాజ్ఞలు విధించారు. వాళ్ళ జీవితాలను ఇంకా దుర్భరం చేయడానికి. రోగి బహిరంగ ప్రదేశాల్లో తిరగరాదు. గాలి వాలుగావుండి మాట్లాడకూడదు. సాయంత్రంపూట ఇరుకుసందుల్లో నడవగూడదు. కుష్టురోగి అంటే చనిపోయిన వానిక్రింద లెఖ్ఖ, అతనికి కర్మకాండచేసి ఆస్తిని వారసులకు ఇచ్చేవాళ్ళు. ఇద్దరు డాక్టర్లు అనుమానితుణ్ణి

బాగా పరీక్షించి అతని చరిత్ర తెలుసుకొని రోగి అనిగానీ, కాదనిగానీ, అందరికీ తెలయజేస్తూ ప్రకటన అతికించేవారు. అర్ధరాత్రిదాటాక అధికార్లు వచ్చి అతనికి దేవుడు తిరుగులేని శాపం విధించాడని దానికి తిరుగులేదని తెలిపేవారు. పవిత్ర జలం అతని శరీరంపై చిలికేవారు. మతబోధకుడు శిలువ మోసే వానితో కలసి రోగికి ఊరేగింపుగా చర్చివద్దకు తీసుకెళ్ళి అక్కడ ప్రార్థన చేసేవాడు. విషాదసూచకాలైన దుస్తులు ధరించిన బంధుమిత్రులు కన్నీరు మున్నీరుగా ఏడ్చేవాళ్ళు. అతడు బ్రతికివున్నా చనిపోయినట్లే లెఖ్ఖ. కదిలాడే శవంగా పరిగణించేవారు. అతనొక జ్ఞాపకంగా మిగిలిపోయావాడు. స్మశానంలో ఒక గుంటలో రోగి మోకరిల్లేవాడు. మత గురువు ఒక గుప్పెడు మట్టిని అతనిపై చల్లేవాడు. అంటే అతడిని పూడ్చినట్లు లెఖ్ఖ, అపుడతనికి ఒక నీళ్ళడబ్బా, ఒక ముసుగు, చేతికివేసుకోవడానికి ప్రత్యేకమైన గ్లౌజులు, ఒక గిన్నె, ఒక కర్ర ఇచ్చేవారు. ఈకర్రకు చివర గిలక్కాయవంటిది వుండి కర్ర కదిలినప్పుడల్లా శబ్దంచేస్తూ 'అపరిశుద్ధుడు' వస్తున్నట్లు ఇతరులకు తెలియజేస్తుంది. ఈ శబ్దం విని కొందరు పారిపోయేవాళ్ళు. కొందరు రాళ్ళతో కొడుతూ తరిమేవాళ్ళు.

రోగాల విజృంభణ :

రోగుల సంఖ్య అసంఖ్యాకంగా పెరిగిపోవడంతో ఈచట్టాలన్నీ ఆచరణ సాధ్యం కాలేదు. ప్రతిచోటా ఈరోగులే. ధనికుల్లో రోగులు ఏలాగో పోషించబడేవాళ్ళు, పేదకుటుంబాల నుంచి వచ్చిన రోగుల స్థితి మరీ విషమంగా వుండేది.

ఈ సమయంలో మతబోధకులు దీనిగూర్చి శ్రద్ధవహించారు. వీరు చొరవ తీసుకొని కృషి చేసి తమ ఇళ్ళలో రోగులకు నివాసాలు కల్పించారు. ఫ్రాన్సులో 13వ శతాబ్ధంలో ఇలాంటివి రెండు వేల దాకా వుండేవి. ఇంగ్లాండులో 200స్థాపించబడ్డాయి.

అతిథిని దేవుడిలాగా చూడాలనే ఆచారాన్నిబట్టి కుష్టురోగి వచ్చినా ఈ నివాసాలలోకి రానిచ్చి, వాళ్ళను పోషించసాగారు. ఈ నివాసాలను నడపడం

కష్టమైంది. ప్రభువుల సహాయం చేసేవారు. ప్రత్యేక పన్నులు వేసేవారు. కానుకలు ఇచ్చేవారు.

చరిత్రలో మొదటిసారిగా ఈ సత్రాలలోనే ఈ రోగులపట్ల ప్రేమ చూపబడింది. వారికి సరైన తిండి, గుడ్డలు దొరికాయి. నీడలో వుండే వీలు కలిగింది.

ఆ కాలంలో ప్రజలు ఒక చోటనుండి మరోచోటుకు వలసపోతుండేవారు, అవినీతి, అపరిశుభ్రత ప్రబలిపోయాయి. అందువల్ల కుష్టువ్యాధికాక టైఫాయిడ్, కలరా, ఇన్ ఫ్లూయెంజా, దురద, సిఫిలిస్, ప్లేగు కూడా విస్తారంగా వుండేవి. మిగతా జబ్బులు క్రమంగా కొద్ది కొద్ది బాధలను కలిగిస్తే ప్లేగు మాత్రం తీవ్రమైన బాధలకు, సత్వర మరణాన్ని కలిగించేది. ఈ పరిస్థితుల్లో అప్పటికే అనారోగ్యంగా వున్న కుష్టురోగులు ముందుగా ప్లేగువ్యాధికి గురయ్యేవారు.

ప్లేగు వస్తే వెంటనే మరణం తథ్యం. ఇరవై ఐదు వేలమంది మతబోధకులే ఈ వ్యాధివల్ల మరణించి ఉంటారని అంచనా ఈ శవాలను కూడా పూడ్చే వీలయేదికాదు

శవాలు క్రుళ్ళిపోయి వీధులన్నీ దుర్వాసనకొట్టేవి. అయితే ఈ ప్లేగువ్యాధీవల్ల కూడా ఒక మేలు జరిగింది. ఎంత త్వరగా వచ్చిందో అంత త్వరగానే తగ్గింది. చాలామంది కుష్టురోగులు చనిపోయారు. మిగిలిన కొద్దిమందిని జాగ్రత్తగా వేరుగా ఉంచారు. దీనితో 1346 సంవత్సరం నాటికి లండన్ లో ఒక కుష్టురోగి కూడా లేకుండా పోయాడు. స్కాట్ లాండ్ లో కొద్దిమంది ఉన్నా 15వ శతాబ్ది ఆఖరుకు చెల్లా చెదరుగా తప్ప రోగులులేరు.

ఈ రోగికి వైద్యుడు చేయగలిగిందల్లా రోగం నిర్ధారణ చేయడమే అనుకునేవారు. సత్రాలలో మాత్రం రోగుల పుండ్లకు కట్టుకట్టేవారు. శ్రద్ధగా చూసేవారు. దేవుని శాపం కాబట్టి అందుకు విరుద్ధంగా మందు ఇవ్వాలని ఏ డాక్టరూ ప్రయత్నించేవాడు కాదు.

17వ శతాబ్దం మేధావులను సృష్టించింది. షేక్స్పియరు, మిల్టన్, సెర్ వాన్ టన్, బేకన్, న్యూటన్, రెమ్ బ్రాంట్, ర్యాలీ, రెన్ మరి అనేకులు విశ్వ విద్యాలయాలు వైద్య శాస్త్ర పట్టభద్రుల్ని శిక్షణ ఇచ్చి పంపసాగాయి. బూటకపు వైద్యుల ప్రాబల్యం తగ్గసాగింది, గిల్బర్ట్, హార్వే డాక్టర్లు ఇంగ్లాండులో ఉన్నాడు. గణిత, భౌతికసంగీత శాస్త్రజ్ఞుడు, నేత్రవైద్యుడు అయిన కిర్చర్ ఉన్నాడు. ఇలా ఇంకెందరో మేధావులున్న కాలమిది.

కాని బాధ కలిగించే విషయమేమిటంటే , ఆసుపత్రుల నిర్వహణ మాత్రం గత శతాబ్దాల కంటె ఎంతో దిగజారిపోయింది. రోగులకు పోషణలేదు. పరిశుభ్రంలేదు. వైద్యశాస్త్రం పెరుగుతుంది. ఈ అధ్వాన్నస్థితిలో మాత్రం మార్పులేదు. 19వ శతాబ్ది మధ్యవరకూ పేదరోగులు చనిపోయే వరకూ వుంచేవాటినే ఆసుపత్రులు అనుకునేవాళ్ళు.

15వ శతాబ్దం నుంచి డామియన్ కాలంవరకూ కుష్టురోగుల సంక్షేమం కొరకు కృషిచేసిన వాళ్ళులేరు. అంతకు ముందకంటే ఈరోగుల స్థితి దిగజారిపోయింది. రోగులను వేరుచేసి కాలనీలలో వుంచేవారు. ఇవి ప్రత్యక్ష నరక రూపాలు. జైలుశిక్ష అంటే భయపడని అలవాటుపడ్డ ఖైదీలుకూడా కాలనీ పేరువింటే అదిరిపడేవారు. సమాజం వీళ్ళను వెలివేసి, ఎంతత్వరగా చచ్చిపోతే అంతమంచిది అనుకునేది.

1873 సం.. మేనెలలో బెల్జియన్ మతబోధకుడు డామియన్ మొలకాయ్ దీవిలో అడుగు పెట్టేనాటికి ప్రపంచంలోని కుష్టురోగుల స్థితి ఇది.

బాధాకర దృశ్యాలు :

తనచుట్టూ ఉన్న ప్రాణులతో సన్నిహితంగా ఉండటం చాలా కష్టమౌతుంది. కనుక అతడు ఒంటరిగా ఉన్నట్లే వాళ్ళకు ముఖాలే లేవా అనిపిస్తుంది. ఉన్నా అవి వికృతంగా ఉన్నాయి. మానవ ముఖాలలాగా లేవు. కళ్ళు ఉండవలసిన చోట చీము నిండిన గూళ్ళూ, ముక్కులూ, నోరూ అంతే చెవులు చాలా లావయి వ్రేళ్ళాడుతూనో లేక ముడుచుకుపోయో ఉన్నాయి. చేతులకు,

కాళ్ళకు వ్రేళ్ళులేవు. వాళ్ళ పుండ్లు, గాయాలూ నీరు గారుతూ, కట్లు లేకుండాను, ఉన్నా మురికిగుడ్డలు చుట్టబడీ ఉన్నాయి.

చాలా కొద్దిమందికి మాత్రం జబ్బు ఇంకా అంత వికృతం చేయలేదు. డామియన్ వాళ్ళను చూడలేదు. ఆ వికృతపు ముఖాలమాటున దాగివున్న భవిష్యత్తు తలచుకుంటే అది ఎంతో బాధాకరమైనది, వీళ్ళేకాక ఇంకా జబ్బు ఎక్కువైనవాళ్ళు, నడవలేనివాళ్ళూ, చింకిచాపలమీదనో, మంచాలలోనూ ఉన్నవాళ్ళు కూడా ఉన్నారు. కొంతదూరంగా ఇలాటి సమూహం మధ్య ఊరు అని పిలువబడే ఆ చెల్లాచెదరు గుడిసెలమధ్య జీవనం సాగించాడు. పల్లెటూళ్ళలోలాగా ఇళ్ళముందు స్త్రీలూ, పిల్లలూ కూర్చొని కబుర్లు చెప్పుకోవడం లేదక్కడ. పిల్లల ముఖాలు లావయి భూతద్దంలో కనిపిస్తున్నట్లున్నాయి.

పాకలు వాళ్ళకు రక్షణను ఇవ్వలేకపోతున్నాయి. కొమ్మలు ఒకదాని మీద ఒకటి వేసి ఆకులు, గడ్డి కప్పబడి ఉన్నాయి. వాటిమధ్య చింకి చాపలమీద పడుకుంటారు.

కళ్ళకు కనిపించేవి వికృతమైన అవయవాలు, వినిపించేవి బొంగురు పోయిన కీచుగొంతులు, చేతికి తగిలేవి మొండిచేతులు, కాళ్ళూ, నాసికకు సోకేది భరించలేని వాసన. ఆయన ఒక్కొక్క అడుగు వేసేకొలది, క్రొంగొత్త విషాదాలు ఎదురయ్యేవి.

వాళ్ళ శరీరాలేకాదు ఆత్మలు కూడా పుండ్లతో నిండి గాయపడి రోగగ్రస్తమై ఉన్నాయి. స్త్రీ, పురుషులుగా వాళ్ళూ పొందగిలిగే సౌఖ్యం, ఆనందం లేవు గనుక అడవి జంతువులుగా వాళ్ళూ పొందగిలిగినంత ఆనందం పొందుతున్నారు.

ఆ భయంకర ప్రాంతంలో ప్రతిచోటా తిరిగిచూశాడు. మొదటి రోజునే నిరాశ, నిస్పృహలు నాలుగు దిక్కులా చుట్టుముట్టి హృదయ విదారక సన్నివేశాలుగా ఆతనిని సవాలు జేస్తున్నాయి. అది నరకకూపంలా వుండి. ఎతైన కొండగోడగా, నల్లరాళ్ళూ ఒక పెద్ద స్మశానంలో సమాధుల లాగా ఉన్నాయి.

పక్షుల కిలకిలారావాలు, సముద్ర ఘోషతో కలసి చరమ సంగీతాన్ని ఆలపిస్తున్నట్లుంది.

అక్కడ కనిపించిన వాటిలో డామియన్ కు నచ్చినది కొయ్యతో నిర్మించిన ఒక చిన్న ప్రార్ధనామందిరమే. ఏ ప్రభువు సేవలో భాగంగా తానా దీవికి వచ్చాడో ఆ ప్రభువు పూజామందిరం అది. అక్కడ మోకరిల్లి కొంతసేపు ప్రార్ధనచేశాక లేచి ఒక చెట్టుకొమ్మవిరిచి చీపురుగాచేసి అక్కడ ఊడ్చాడు.

కాథొలికు శాఖ రోగి ఒకతను ఒక పండుతెచ్చి ఇచ్చాడు. మధ్యాహ్నబోజనానికి, ఆ అవిటిచేతుల నుంచి దాన్ని అందుకోవడంలో ఏమీ ఏహ్యాభావం కలగలేదాయనకు, మరొకరు పూలు తెచ్చారు. అంతా శుభ్రం చేయడానికి నాలుగు గంటలు పట్టింది. నారింజ, పచ్చమందార, తెల్ల గసగసాల పూలసువాసనలతో నిండిందిమందిరం. బయట గుమిగూడినజనం గుంపుగా తయారయ్యారు. ఒక తెల్లమనిషి అక్కడ మోకరిల్లి ప్రార్ధన చేయడం రోగులు దగ్గరకు వచ్చినా భయపడక పోవడం వాళ్ళకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

అంత్యక్రియల ఆరంభం :

తన నివాసం ఎక్కడో ఇంకా నిర్ణయించుకోలేదు. అపుడే నిన్న చనిపోయిన ఒక రోగికి అంత్యక్రియలు జరపాలని కబురు వచ్చింది.

చావు అక్కడ తరచూ జరిగే ఒక సంఘటన. దాన్ని గురించి ఎవరూ అంతగా పట్టించుకోరు, ఈ భూలోక బాధలు, దుఃఖాలనుంచి రోజు కొక్కరైనా విముక్తి పొందుతుంటారు. అంత్యక్రియలంటే తక్కువ శ్రమతో పూడ్చి పెట్టడమే. శవపేటికలు లేవు పాత చాపముక్కల్లో చుట్టడమే, శవ దహనంలేదు. నేడో రేపో చావబోయే నలుగురు ఒక చచ్చిన వానిని మోసుకుపోతారు. లోతు తక్కువ గుంట ఒకటి త్రవ్వి దాంట్లో పూడ్చేవాళ్ళూ. అప్పట్లో మొలకాయ్ దీవిలోని రోగులు సగటు 3,4 సంవత్సరాలకు మించి జీవించేవారు కారు.

క్రితం రోజు వాన కురిసి స్మశానమంతా బురదగా వుంది. సమాధులపై మట్టి కారిపోయి పూడ్చబడ్డ శవాల మాంసం కుళ్ళి కంపుగొడుతుంది. రాత్రిళ్ళు

నక్కలు శవాలను బయటకు లాగుతుంటాయని చెప్పారు. అంత్యక్రియలు ముగించి తన భవిష్యత్ ప్రణాళికల గురించి ఆలోచిస్తూ గ్రామంలోకి వచ్చాడు ఫాదర్

ఒక ముసలి స్త్రీ వచ్చింది. ఆమె కొడుకు మరణావస్థలో ఉన్నాడని చివరి ప్రార్థన చేయడానికి బోధకుడిని రమ్మని అర్థించింది.

అది పాకకాదు, ఒక దుర్గంధరూపం. ఆచెడువాసన భరించలేక చాలా సార్లు బయటికి వచ్చి ఊపిరి పీల్చుకోవలసివచ్చింది. డామియన్, గిలకలలోతు నీళ్ళు మసక వెలుతురులో మాంసం ముద్దలో, ఎక్కడో పోలేక పోలేక కొట్లాడుతుంది ప్రాణం, బోధకుని చూసి కడసారి ఆనందం పొందాడు ఆ రోగి చేతకి రెండే వ్రేళ్ళున్నాయి, వాటితో పుస్తకాన్ని తాకాడు. తాను నిట్టూరుస్తూనే తల్లిని ఓదారుస్తున్నాడు ఆ రోగి.

పవిత్ర తైలాన్ని రోగి చెవులకు రుద్దాడు డామియన్, కాళ్ళవైపు చూశాడు. అవి పుండ్లతో పురుగులుపడి కుళ్ళిపోయి వున్నాయి. ఇలాటి దృశ్యాలు చూడటం క్రమంగా అలవాటు అయింది. డామియన్ కు అరగంట పైగా గడిచింది. ఫాదర్ ప్రార్థనచేస్తుండగా రోగి ప్రశాంతంగా కన్ను మూశాడు.

కుమారుని చివరి నిమిషాలైనా తృప్తిగా గడవటం గమనించిన తల్లి తాను గూడా మతంలో చేరతానంది. మరురోజు ఆమె బాప్తిసము తీసుకున్నది. కానీ రెండుగంటలకే చనిపోయింది. ఆమె కోరిక ప్రకారం కొడుకు సమాధి ప్రక్కన ఖననం చేయబడింది.

ప్రార్థనాలయం ప్రక్కనున్న పెద్ద చెట్టు క్రింద నేలమీద పడుకునే వాడు డామియన్. అదృష్టవశాత్తు వర్షము కురవలేదు. చెట్టు మొదట్లోని చీమలు, తేళ్ళు దోమలు ఎంతో అసౌకర్యం కలిగించాయి, ఒకవేళ సురక్షిత వాతావరణంలో, సుఖమైన పాన్పుపై పవళించినా పగలు చూసిన దృశ్యాలు గుర్తువస్తే ఎవరికైనా నిద్రకూడా పట్టదు.

చెట్టుకు ఆనుకొని కూర్చొని పైపు కాలుస్తూ ఆలోచిస్తూండేవాడు. గాఢాంధకారం, పిట్టలకూతలు, ఆకుల చప్పుళ్ళు అన్ని భయాన్ని కలిగించేవే.

కనిపించిన క్రమశిక్షణ :

ఆ మొలకాయ్ దీవుల్లో అభివృద్ధి చేయవలసింది చాలా వుంది కాని ఎలా మొదలు పెట్టాలి? ఏం చేయాలి? ఏ అధికారమూ లేకుండా తానొంటరిగా ఏమి చేయగలడు? డాక్టర్లొ, ఇంజనీర్లొ , పోలీసులో వుంటే కొంత పని చేయవచ్చేమో, ఫాదర్కు అవేమి తోడు లేవు అతని విశ్వాసమే అతనికి తోడు. ఆయన ఇక్కడకు వచ్చి వీళ్ళకు సేవలు చేయడం గొప్ప వీరత్వం అనుకునే వాడుకాదు.

సాధారణంగా గ్రామాల్లో రాత్రి పొద్దుపోయేకొలది శబ్దాలు తగ్గుతూ ప్రశాంతత పెరుగుతుంటుంది. కాని ఈ గ్రామంలో అలాలేదు. బాధార్తుల మూలుగులు, భరించలేక వేసే కేకలు, ఏడ్పులు మాత్రమే కాదు. తిరుగు బోతులూ, తాగుబోతులూ చేసే గోల, వెకిలినవ్వులుకూడా వినిపిస్తున్నాయి. డామియన్ ఆశ్చర్యపోయాడు. ఈ గ్రామంలో కూడా ఇవన్నీ ఉన్నాయా అని, అక్కడే నాటుసారాయి కాస్తున్నట్లు, ఆడరోగులు కొందరు వ్యభిచారానికి పాల్పడుతున్నట్లు తెలిసింది. డామియన్ ఒక ఉత్తరంలో ఇలా బాధతో వ్రాశాడు.

''సుఖకాంతులు ఉండాల్సిన చోట వ్యసనాలున్నాయి. ఏ చట్టమూ అమలులో లేదు, దేవుని ఆజ్ఞలను పట్టించుకునే వాళ్ళేలేరు. అందుకు వ్యతిరేకంగా నేను కృషి చేయాలని నిర్ణయించుకున్నాను.

ఇక్కడే ఉండే 'కీ' అనే చెట్టు వ్రేళ్ళనుంచి ఘాటైన సారాతయారు చేస్తారు. దాన్ని శుభ్రంగా చేయకపోవడం వల్ల తాగడానికి బాగుండదు దాన్నే తాగుతూ, ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్ళు ఎగురుతూ, గంతులు వేస్తూ బట్టలు లేకుండా పిచ్చివాళ్ళలా తిరుగుతుంటారు కాగితం మీద వర్ణించలేనంత అధోగతిలో ఉంటాయి వీరి చేష్టలు. నేను పదే పదే తిరుగుతూ, వాళ్ళను భయపెడుతూ మళ్ళీ మళ్ళీ చెపుతూ ఉండడంవల్ల చాలాదృశ్యాల్లో మార్పు వచ్చింది ''త్రాగుడు, వ్యభిచారంలో తప్ప''.

డామియన్ కు ధృడమైన శరీరం, ధృడ సంకల్పమేకాక మంచి నాయకత్వ లక్షణాలు కూడా ఉన్నాయి. ఇంతవరకూ ప్రభుత్వమూ, పోలీసులూ సాధించలేనిది

ఈయన సాధించం ఆ దీవిలో మొదటిసారిగా కొంత క్రమశిక్షణను తీసుకు వచ్చాడు.

కాథొలిక్కులు కాక మిగతా రోగులు అంతా ఆయనను ప్రతిఘటించడమో నిర్లక్ష్యంగా చూడటమో జరిగేది. కుష్టువ్యాధి ఈ దీవుల్లోకి రావడానికి తెల్లవాళ్ళే కారణం అని, పైగా వాళ్ళను ఈ దీవులకు పంపే చట్టాలు కూడా చేశారనరి అనుకునేవాళ్ళు, డామియన్ కూడా తెల్లవాడు కావడం వల్ల అయన్ని వ్యతిరేకించేవాళ్ళు.

అక్కడ క్రమశిక్షణ తీసుకురావాలని ప్రయత్నిస్తే తీవ్రంగా వ్యతిరేకించేవాళ్ళు. ఎన్నోసార్లు వివాదాలు, తగాదాలు జరిగాయి. డామియన్ పై దౌర్జన్యాలు జరపటానికి కూడా ప్రయత్నించారు కాని అతని శరీరబలం ఆత్మధైర్యం వల్ల ఏమీ జరగలేదు. పుండ్లువున్న రోగులు వచ్చి కౌగిలించుకుంటామని బెదిరించి భయపెట్టాలనుకున్నారు. ఇలాటి వాటికి తొణక నన్నాడు డామియన్.

వ్యాధి అంటే భయంలేదు :

రోగుల ప్రేమాభిమానాలు పొందాలంటే వ్యాధి అంటే నిర్భయంగా ఉండాలని ఆయన గ్రహించాడు. వాళ్ళను తాకితే ఏమవుతుందో అనుకోకుండా వాళ్ళు తినే పళ్ళేలలోనే తినేవాడు. తరచుగా తన చొంగ (పైపు) కూడా రోగులకు ఇచ్చేవాడు. డామియన్ పనులు మూర్ఖపు పనులు అనిపించవచ్చు మనకు ఈనాడు. కాని తెల్లజాతి పట్ల వారికున్న ద్వేషం తగ్గాలంటే అపనమ్మకాలు పోవాలంటే, అంతకు మించిన మార్గం లేదేమో! ఆ రోగిష్టి కూపంలో ఉన్న ఆరోగ్యవంతుడు అతడు ఒక్కడే. వారికి మేలు చేయాలంటే, వాళ్ళలో విశ్వాసం పెంచాలంటే అదే మార్గం అనుకొని ఉండవచ్చు ఆయన.

దేవాలయం దగ్గర చెట్టే చాలా వారాలదాకా ఆయనకు ఆశ్రయం ఇచ్చింది. తన వసతి గురించి, దాన్ని అభివృద్ధి చేసుకోవడం గురించి ఆలోచించే తీరికలేదు. పొద్దుపోయే వరకు పనిచేసేవాడు. వేకువజామునే లేచేవాడు.

గునపమూ, పారతో స్మశానం అంతా సరిచేసి హీనస్థితిని మార్చేవాడు. శవాలను పూడ్చడానికి ఆరడుగుల లోతు గుంటలు త్రవ్వేవాడు. పాత సామాన్ల పెట్టెలు ఆతుకులు పెట్టి శవపేటికలు తయారు చేశాడు. వీటితో రోజూ అవసరం వుండేది. ఇలాంటివి రెండువేలపైగా స్వయంగా చేసి ఉంటాడు. అక్కడ ఏ డాక్టరూ లేడు. రోజూ మంచాల్లో వున్న రోగుల వద్దకు వెళ్ళి వాళ్ళ పుండ్లు కడిగి కట్టు కట్టేవావు. మహా భయంకరంగా ఉన్న పుండ్లను కూడా పుష్పాలలాగా పట్టుకొని సున్నితంగా కట్లు కట్టేవాడు తడి పాకలు పుండ్లవాసన రోగులు వదిలే గాలి ఇవన్నీ క్రొత్త వాళ్ళెవరూ భరించలేనంతగా వుంటాయి.

చాలినన్నీ నీళ్ళు :

ఈ దుస్థితులన్నిటికి తగినంత నీరు లేకపోవడమే కారణమని గ్రహించాడు. నీటిని పాతడబ్బాల్తో, సీసాల్తో చాలా దూరాన్నుంచి తెచ్చుకోవాలి. అవిటి రోగులు మిగతా వాళ్ళను బ్రతిమలాడి కాసిని నీళ్ళు తీసుకునేవాళ్ళు. అందువల్ల ప్రతి నీటిచుక్కనూ ఎంతో జాగ్రత్తగా వాడుకునేవారు. కట్టు గుడ్డలు ఉతుక్కోవడానికి నీళ్ళు వృథా చేయరు.

సాధారణంగా కొండ చరియల్లో నీళ్ళు ఉంటాయి. ఇక్కడ కూడా ఉండవచ్చనే నమ్మకంతో ఆప్రాంతమంతా తిరిగి పరిశీలించాడు. ఒక లోయచివరి ఒక కోనేరు కనిపించి ఆయన్ను ఆశ్చర్యపరచింది. అది ఇరవైఐదు గజాల వెడల్పున్న గుండ్రని జలాశయం, ఆరుగజాల లోతుంది. ఎంత ఎండలకు కూడా ఎండిపోని జలరాశి అది.

ఆ కాలనీ రోగుల్లో ఒకడు సూపరింటెండెంటుగా ఉండేవాడు. అది నామమాత్రపు పదవి. బయటి ప్రభుత్వ అధికారులుగాని, దీవిలోని రోగులు కానీ ఎవరూ గౌరవించేవారుకారు, అతనూ, డామియన్ కలసి నీటి సరఫరా కోసం గొట్టాలు, మందులూ, ఒక డాక్టరునూ, భవన నిర్మాణ సామాగ్రిని పంపమని ప్రభుత్వానికి విన్నవించారు, దాన్ని ఎవరు పట్టించుకుంటారు? డామియన్ పట్టు

విడవలేదు. మళ్ళీ మళ్ళీ విజ్ఞప్తులు చేయించాడు. తాను కూడా హెల్త్ బోర్డుకు ఫిర్యాదులు, రిపోర్టులు కురిపించాడు.

ఆ ఫలితంగా కొన్ని నీళ్ళ గొట్టాలు నౌకద్వారా పంపబడ్డాయి. కాని ఇంజనీరు ఏడి? ఐనా లెఖ్ఖచేయకుండా ఇల్లిల్లూ తిరిగి అందర్నీ పోగుచేసి గొట్టాలు బిగించడంలో సహాయం చేయమని అర్థించాడు. రోగం వల్ల అశక్తులు, జడత్వం జీర్ణించుకున్నవాళ్ళు కావడం వల్ల అంతగా పనిలో సహకరించేవాళ్ళూకారు. ఎంతో ఓర్పుగా చెప్పి, వాళ్ళను బుజ్జగించి, వాళ్ళ వాదాలను ఖండిస్తూ, ఒక శ్రామిక బృందాన్ని తయారుచేశాడు.

డామియన్, నౌక కెప్టెన్ కలసి సముద్రపు ఇసుక తిన్నెలనే డ్రాయింగ్ టేబులుగా ప్లానులు గీస్తుంటే, నావికులు ఇనుపగొట్టాలు అందిస్తుంటే, రోగులు మోసూ అమర్చసాగారు. ఎగుడు, దిగుళ్ళూ, మెట్టపల్లాలతో తన సొంతప్లాన్ తో, నిరంతర కృషితో పని పూర్తిచేశాడు.

చల్లనినీరు ఇళ్ళముందుకు రాసాగింది. ప్రతిపాకకూ అందుబాటులో వుండేలాగా కుళాయిలు అమర్చారు. నీరు సమృద్ధిగా వుంది. అన్ని అవసరాలకూ సరిపోతుంది. రోగులు నమ్మలేనంత ఆనందం పొందారు. ఈ కృషిక కారణమైన డామియన్ అంటే అభిమానం పెరిగింది.

చెడు వల్ల మంచి :

రోజూ శవాలను పూడ్చే గోతులు త్రవ్వడం, శవపేటికలను తయారు చేయడం, వైద్యం చేయడం మిగతా చిల్లర మల్లర పనులవల్లా ఆయనకు విశ్రాంతి ఏమీ ఉండేదికాదు. రోగుల్లో ఆయన హోదా ఉన్నతంగా పెరుగుతుంది. కాని రోగుల స్థితిగతులు ఆయనకు తృప్తికరంగాలేవు. 80శాతం మంది రోగులు తీవ్ర అస్వస్థులు. రోగుల ఆహారం, జీవనవిధానం అభివృద్ధిచేస్తే ఈ శాతం తగ్గించవచ్చు. ముఖ్యంగా వాళ్ళ పాకలు ఎట్లా బాగుచేయాలా అని ఆలోచిస్తున్నాడు.

ఒక రోజున ఉన్నట్టుండి పెద్దతుఫాను వచ్చింది. ఆ దీవిలోని నామమాత్రపు పాకలను పూర్తిగా ధ్వంసం చేసింది. రోగులంతా చెట్ల క్రింద తలదాచుకోవాల్సిందే. సహాయం కొరకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాడు.

అంతలో ''హార్ వీర్'' అనే నౌక ఆ దీవికి వచ్చింది. డామియన్ ఆ నౌక కెప్టెన్ కు ఉత్తరం ఇచ్చి, అధికారులకు వివరాలు చెప్పమన్నాడు. కాని కెప్టెన్ సలహామేరకు డామియన్ కూడా అదే నౌకలో బయలుదేరాడు. ఈ ప్రయాణం వల్ల కొన్నాళ్లూ దీవికి దూరంగా ఉండాల్సి వచ్చినా , ఈ సమయంలో కొంత సహాయం పొందవచ్చని అనుకున్నాడు . మరురోజు ఉదయానికి పీఠాధిపతి నివాసానికి చేరుకున్నాడు. తన అవసరాలు తెలిపి సహాయ వాగ్ధానం పొందాడు.

ఇది వరకే హెల్తుబోర్డుకు చాలా ఉత్తరాలు వ్రాసినా జవాబులేదు. వాళ్ళను స్వయంగా కలుసుకోవాలి.

వాళ్ళసలే తలబిరుసు మనుషులు, చిన్న పెద్దఅధికారులు నిర్లక్ష్యంగా చూశారు. చాలాసేపటివరకూ మాట్లాడటానికి అనుమతి ఇవ్వలేదు. వాళ్ళకు ఆయనంటే ఆసూయ. డామియన్ సేవలను పొగుడ్తూ అంతకు ముందే పత్రికల్లో వ్యాసాలు వచ్చినందుకు వాళ్ళకు అతనిపై ఈర్ష్య

బోర్డు డైరెక్టరును కలిశాడు. కానీ ఆయన డామియన్ చెప్పేది వినలేదు. అవన్నీ తనకు అనవసరం అన్నాడు. ఉన్న కాథొలిక్కులకు మత బోధ చేసుకుంటూ, మిగతా వాటిలో జోక్యం కల్గించుకోవద్దని హెచ్చరించాడు. డామియన్ మొలకాయ్ దీవిలోని దుర్భర పరిస్థితులను వర్ణించాడు.

డామియన్ , నీకు గుర్తుంగా? ఆ దీవి నుంచి ఎవరూ బయటకు రాకూడదు'' అన్నాడు గట్టిగా.

''నేరు కుష్టురోగిని కాదుగదా ?''

''కానీ, నీవు అక్కడే నివసిస్తున్నావు. ఇక్కడకు వచ్చి చట్టాన్ని ఉల్లంఘించావు. నీవు వెంటనే వెనక్కు వెళ్ళిపో. మరొక్కసారి ఆ దీవి దాటి

బయటకు వస్తే ఉరి తీస్తాము జాగ్రత్త? ఆ దీవి సరిహద్దులు దాటినా సహించము'' అని గట్టిగా హెచ్చరించాడు.

'' బిషప్తో పని వుంటుంది. మతస్థుల దగ్గరకు వెళ్ళాల్సి వుంటుంది'' అన్నాడు డామియన్ గట్టిగా, డైరెక్టరు ఏమి మాట్లాడకుండా బయటకు వెళ్ళాడు.

దీవికి బెదిరింపు ఉత్తర్వులు వచ్చాయి. రోగలు సంక్షేమం కొరకు, మతస్థుల అవసరాలకు తప్పనిసరయితే బయటికి వెళ్ళక మానినని, ఏ పరిణామాన్నైనా ఎదుర్కొటానికి సిద్ధమేనని క్లుప్తంగా జవాబు వ్రాశాడు డామియన్.

అపుడు బోర్డు క్రొత్తగా కొన్ని నిబంధనలు విధించింది. ఆ దీవి లోని వాళ్ళెవరూ నౌకలో కాలు పెట్టగూడదని నావికులకు కూడా ఆజ్ఞలు జారీచేశారు.

బిషప్ భవన నిర్మాణ సామాగ్రికై పోగుచేయడం మొదలెట్టాడు. ప్రజల కోర్కె మేరకు బోర్డు కూడా కొంత సామాగ్రి పంపింది.

చిగురించిన చైతన్యం :

సుత్తి పట్టుకోవడం చేతనయిన వాడల్లా వడ్రంగి నిపుణుడయ్యాడు. అవిటివాళ్లూ పనివాళ్ళయ్యారు. పిల్లలూ, ఆడవాళ్ళూ ఇళ్ళూ, పరిసరాలూ శుభ్రం చేశారు. సుత్తెలమోత తాళవాద్య సంగీతం లాగా వినిపించసాగింది. క్రొత్త ఇళ్ళ నిర్మాణంలో మునిగి ఉన్నారంతా. అవి తుఫానులను తట్టుకోవాలి, వరుసల్లో కట్టి గోడలకు సున్నం వేశారు. ఈ శ్రమలో వాళ్ళ బాధలనే మరచిపోయారు. నిస్పృహలో మరణానికై ఎదురు చూస్తున్న నాలో జీవించాలనే ఆశలు చిగురించసాగాయి. నవ్వు అంటే ఏమితో మరచిపోయిన వాళ్ళూ మళ్ళీ ఒకరితో ఒకరు పోటీగా ఎవరి ఇల్లు త్వరగా పూర్తవుతుందా అని ఉత్సాహంగా పని చేస్తున్నారు.

ఆ తర్వాత చెట్లు నాటించాడు. ఇళ్ళముందు కూరగాయల విత్తనాలు నాటించాడు. ''కలువ పాప'' అనే మరొక ప్రక్క గ్రామంలో కూడా ఇవన్నీ అమలు చేశాడు. మతబోధకు వెళ్ళేటపుడు తప్ప ఎప్పుడూ రంపంగాని, సుత్తెగాని ఏదో ఒక పనిముట్టు అతని చేతిలో వుండేది. కాలనీలో దాదాపు మూడువందల ఇళ్ళు

కట్టడంలో ఆయన సహాయ పడ్డాడని అంచనా వీటితోపాటు తనకు గూడా ఒక గది ఇల్లు కట్టుకున్నాడు. అదికూడా స్మశానానికి దగ్గరగా ఎంచుకున్నాడు. ఆయనకు ఎక్కువ సమయం అక్కడే పని ఉండటం వల్ల కావచ్చు.

1877 నవంబరులో రెసిడెంటు సూపరింటెండెంటు ఉద్యోగానికి ఖాళి ఏర్పడింది. దానికి డామియన్ ను నియమించాలనుకున్నారు. బోర్డువాళ్ళు ఏటా పదివేల డాలర్లు జీతంగా ఇస్తామన్నారు కానీ.....

ఆయన అందుకు అంగీకరించివుంటే మనం ఇవాళ ఈ గాథ చదువుకోనవసరంలేదు, ఆయన ఇలా జవాబు పంపాడు.

మీరు వందవేలు ఇస్తామన్నా నాకు అవసరం లేదు. డబ్బు సంపాదించడానికయితే ఇక్కడ అయిదు నిమిషాలు కూడా ఉండను. దేవుని మార్గంలో సేవ చేయాలనే సంకల్పమే నన్నిక్కడ వుంచుతుంది. ఇలాటి పనికి డబ్బు తీసుకున్నట్టు తెలిస్తే మా అమ్మ నన్ను కొడుకుగా స్వీకరిస్తుందా'!

అయితే మరోఉద్యోగి వచ్చేవరకు తాత్కాలికంగా ఫిబ్రవరి '78 వరకు ఆ ఉద్యోగం చేశాడు. అందుకు కేవలం 41డాలర్ల గౌరవ వేతనం తీసుకొని తన పర్సులో కూడా పెట్టుకోకుండా రోగులకు ప్రార్థనాలయానికి ఖర్చు చేశాడు.

తరువాత కొన్నాళ్ళకు సామాను చేరవేసే బండిని బాగు చేయించడానికి హోనొలూలుకు పంపాడు డామియన్ ఆ విషయం తెలిసిన బోర్డు ప్రెసిడెంటు ఇలా వ్రాశాడు.

20.11.1882.

గౌరవనీయులయిన ఫాదర్ డామియన్ గార్కి,

ప్రియమైన అయ్యా.

కొన్నాళ్ళక్రితం ఎందుకూ పనికిరాని ఒక పాత బండిని రిపేర్ల కొరకు ఈ ఊరు పంపారుమీరు. కాలనీకి అలాటి బండి అవసరమే. గతంలో మీరు కొంతకాలం బోర్డుకు సహాయం చేసి అక్కడవుండే నిర్భాగ్యుల సౌకర్యం కొరకు సేవలు చేశారు. అందుకు బోర్డువారు మిమ్మల్ని ఎంతగానో అభినందిస్తూ మీకు ఒక క్రొత్త బండిని కొని పంపమని తీర్మానించారు. ఆ ప్రకారమే దానిని పంపుతున్నాను, దయచేసి ఈ బండిని దీనితో పాటు నా ప్రేమాభిమానాలను కూడా స్వీకరించండి. !

అన్నకు ఉత్తరం :

సోదరునికి ఉత్తరం వ్రాసే తీరిక దొరికింది డామియన్ కు, ‘‘కుష్టురోగం బారినపడ్డ దీనులకు సహాయం చేస్తున్నాను. ఈ దీవుల్లో గత పదేళ్ళలో ఈ వ్యాధి బాగా పెరిగింది: తప్పనిసరయి ప్రభుత్వమే రోగులను వేరుచేసి ఇక్కడకు పంపుతుంది. మొలకాయ్ దీవిలో పర్వతాలు, శిఖరాల మధ్య బంధించబడివుంది నా నివాసం.

ఇక్కడకు వచ్చిన రోగులు బయటకు పోయే వీలులేదు, రెండువేల మంది దాకా వస్తే ఇపుడు 800 మంది మాత్రమే బ్రతికి ఉన్నారు. ఇందులో కొందరు కాథలిక్కులు వీళ్ళకు మతబోధకుడు కావాలి. కాని ఒక్కసారి ఇక్కడకు వచ్చిన వాళ్ళు జీవితాంతమూ ఇక్కడే వుండి పోవాలి . మన మత పెద్ద తనకు తానుగా ఎవరినీ ఈ దీవికి వెళ్లమని ఆదేశించలేనన్నాడు. మతబోధ వృత్తిగా ఎంచుకున్ననాడే తెలుసు. ఈ దారి ముళ్ళబాట అనీ, పూలబాట కాదనీ, కాబట్టి ప్రభువు ఇష్టం ఎలావుంటే అలా జరుగుతుందని నేనే వచ్చాను. మే నెల 11న స్టీమర్లో 50మంది హవాయి ప్రాంత రోగులతో కలసి నేనుకూడా ఇక్కడకు వచ్చాను.

ఇక్కడ పవిత్ర ఫిలోమినా పేరుతో ప్రార్థనా మందిరం వుంది. నేను హోనొలోలు లోని తెల్లవాళ్ళ సహాయం వల్ల ఒక ఇల్లు కట్టుకున్నాను. అది 16 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పు ఉన్న పూరిపాక.

నేను వచ్చి ఆరునెలలు కావస్తున్నా నాకు వ్యాధి రాలేదు. దీన్నిబట్టి తెలుస్తుంది. దయామయుడయిన ప్రభువూ, మేరిమాత నన్నెంతగా రక్షిస్తున్నారో, ఈ వ్యాధికి ఇంతవరకు మందులేదు. రక్తము కలుషితము కావడం వల్ల వస్తుందనుకుంటారు. చర్మం మీద మచ్చలు వస్తాయి. ఆమచ్చలు మొద్దుగా ఉంటాయి.

ఈ వాతావరణానికి అలవాటు పడటం చాలా ఇబ్బంది అయింది. చెడు వాసనలు అలవాటయ్యాయి. పురుగులతో లుకలుకలాడే పుండ్లున్న రోగులతో కూడా సన్నిహితంగా ఉండవలసి వస్తుంది రోజూ. నా దినచర్య ఎలా వుంటుందో నీవు ఊహించుకోవచ్చు. ఉదయం ప్రార్థన కాగానే ఆశక్తులయిన రోగులను పాకలకు వెళ్ళి చూస్తాను . కాథోలిక్కులు కాని వారిని తిరస్కరించను. అందరినీ సమానంగా చూస్తాను. అందువల్ల ఏ కొద్దిమందో అనాగరికులు తప్ప చాలామంది క్రమంగా నా పట్ల ప్రేమ చూపుతున్నారు. మత బోధకుడు ఎంత అభివృద్ధి చేయవచ్చునో ఊహించు. ఇక్కడి యువకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరగపడాలని చూసి కూడా నా మాట విని ఆగిపోయారు. నేను వచ్చాక వందమందికి బాప్తిజము ఇచ్చాను. చాలామంది చనిపోయారు. పూడ్చి పెట్టాను సగటున రోజుకు ఒకరయినా చనిపోతుంటారు.

నేను నా కంఠ స్వరాన్ని ఇంటింటికీ మార్చవలసి వస్తుంది. ఒక చోట మృదువుగా ఓదారుస్తూ, మరోచోట కటువుగా వాళ్ళ అంతరాత్మను కదలించేలాగా మాట్లాడాలి, పశ్చాత్తాప పడకుండా పాపాలు కొనసాగించే వాళ్ళను ఒకోసారి మరీ కోపంగా గద్దించవలసి వస్తుంది. ‘‘వెయ్యి ప్రవచాలకంటే ఒక్క ఆచరణ గొప్పది’’.

ఆరు డాలర్ల జీవన భృతి :

రోగులే పంటలు పండించుకొని తినాలన్న ప్రభుత్వ ఆలోచన విఫలం అయింది. హోనొలూలులో చౌకగా దొరికే ఆహార పదార్థాలు కొని పడవలలో పంపుతారు. ఒకోసారి అవి ఇసుకలో దించడం వల్ల, వాతావరణం సరిలేక సముద్రపు అలలకు చెడిపోతుండేవి. డామియన్ వచ్చాక పరిస్థితి మెరుగుపడింది సరుకులు ఎక్కువగా క్రమపద్ధతిలో పంపసాగారు. ఇంకా మంచి ఆహారం సమకూర్చాలని ప్రయత్నించేవాడు.

మిగతా అవసరాలయిన బట్టలు, కట్టుగుడ్డలు, మందులకోసం పదే పదే అడగ్గా ప్రభుత్వం రెండు గ్రామాల్లోనూ నిల్వ ఉంచడానికి సరిపడే కొన్ని మందులు పంపారు. ఒక్కో రోగికి సంవత్సరానికి ఆరు డాలర్లు అలవెన్సు ఇచ్చేవారు. రోగులు కొనుక్కొవాడానికి వీలుగా చౌకరకం బట్టలు లభించేవి. ఎలవెన్సు ఇవ్వడం మొదలయినందుకు సంతోషపడుతూనే దీన్ని పెంచడానికి ప్రయత్నించాడు. బిషపు, సిస్టర్సు పోగుచేసి పంపిన సామానులు రాసాగాయి. వీటితో రోగులు కొంతవరకు బట్టలు వేసుకునే వీలయింది.

మరీ శక్తి హీనులయిన రోగులకోసం, శిధిలావస్తలో పడిపోవడానికి సిద్దంగా ఉన్న ఒక ఆసుపత్రి వుంది. దాన్ని బాగుచేయించి మంచాలు వేయించాడు. అక్కడే రోజూ ఉదయం కట్లుకట్టెవాడు. 1887 వరకు ఈ పనులు చేస్తునే వున్నాడు.

1873 నుంచి 1889 వరకు 3137 మంది రోగులను ఈ కాలనీకి పంపారు. అందులో 2446 మంది చనిపోయారు.

డామియాన్ తానే వడ్రంగిగా, బేలుదారుగా, కూలివానిగా పనిచేస్తూ అక్కడికి రెండు మైళ్ళ దూరానావున్న "కలువపాప" లో ఒక చర్చి నర్మించాడు, ఇంటికి వ్రాసిన ఉత్తరంలో ఇలా అంటాడు, నేను తాపి పనిచేయడానికి, వడ్రంగం చేయడానికి సిగ్గుపడను, దేవుని కొరకు నేను ఏ పనైన చేస్తాను పదేళ్ళనుంచి నేను

ఏటా ఒక చర్చిగాని, ప్రార్థనా మందిరంగాని కడుతున్నాను. ఇంటిదగ్గర అన్ని రకాల పనులూ చేసే అలవాటు ఉండటం ఇక్కడ ఉపయోగపడుతుంది''

అక్కడ మరే ఉత్సవాలూ, తిరునాళ్ళూ లేవు. అందుకే కాథొలిక్కులు కానివారుకూడా ప్రార్థనా సమావేశాలకు హాజరయ్యేవారు. పొరుగూరికి వెళ్ళడం డామియన్ కు ఇబ్బందిగా వుంది. కాబట్టి మరొక మతబోధకుణ్ని నియమించి అక్కడకు పంపారు. ఆ ద్వీప దక్షిణ ప్రాంతంలో ఎత్తయిన గోపురంతో మరొక పెద్ద చర్చిని అందంగా నిర్మించాడు. ఈ నిర్మాణంలో డామియన్ అక్కడి మతస్థుల ఇళ్ళలోనే అతిథిగా వుండేవాడు. నిర్మాణం అయాక తిరిగి కాలనీకి వచ్చాడు.

తెలిసి చేసిన తప్పుడు ఏమైనా వుంటే మతగురువు వద్ద చెప్పుకొని పశ్చాత్తాపపడటం మంచిదని ఫాదర్ డామియన్ విశ్వాసం, దీని వల్ల వ్యక్తికి ఆధ్యాత్మిక సౌఖ్యం లభిస్తుంది. దీన్ని ''ఒప్పుకోలు'' (confession) అంటారు. దీన్ని కాథొలిక్కులు కానివారు ఎగతాళి చేస్తుంటారు. కాని దీనివల్ల మతస్థునిలో పాపభీవి ఏర్పడుతుంది. ఒకవేళ ఏ కారణం వల్లనైన పొరపాటు చేసినా తనలోతాను నిరంతరం కృంగిపోకుండా ఆ ఆవేదనను బోధకునితో చెప్పుకుంటే ఊరట, ప్రశాంతత లభిస్తాయి.

చెప్పే నీతులన్నీ ఇతరులకే కాదు తనకు కూడా వర్తించాలని నమ్మేవాడు డామియన్, అందువల్ల ఆయన జీవితం కూడా మచ్చలేకుండా గడపాలని ప్రయత్నించేవాడు. ఒకసారి కాథొలిక్ మండలాధిపతి ఆ దీవికి రావాలనుకున్నాడు. కాని బోర్డు నిబంధనల ననుసరించ నావ కెప్టెన్ ఆయనను దీవి మీద కాలుపెట్టనీయలేదు. డామియన్ ను నౌకలోనికి ఎక్కనీయలేదు. దాంతో ''ఒప్పుకోలు'' చెప్పుకునే వీలుకాలేదు. తన పడవలో నుంచే మోకరిల్లి చెప్పుకున్నాడు. డామియన్ ఈ విషయం హోనొలూలులో తెలిసింది. నిరసన తెల్పుతూ ఉత్తరాలు వ్రాసి ఈ నిబంధనలను సడలింపచేశారు.

మతస్థులలో మరణం అంటే ఉన్న భయాన్ని తగ్గించడం ఈయన సాధించిన విజయాలలో ఒకటి. బిషప్ కానుకలుగా పంపిన సంగీత వాద్యాలు

ప్రార్థిస్తూ, సిస్టర్సు పంపిన రంగు కాగితాలు, రిబ్బన్లతో అలంకరిస్తూ శవ ఖనన సంస్కారాలలో పాల్గొనేవారు.

హవాయి ద్వీపవాసులకు సంగీతం పట్ల ఆసక్తి ఎక్కువ వాళ్ళతో జీర్ణించుకుపోయిన నైరాశ్యాన్ని తొలగించడానికి దీన్ని ఆసరాగా తీసుకొని వాళ్ళచేత బృందగానాలు చేయించేవాడు. సాయం వేళల్లో చర్చివద్ద ఆబాలగోపాలమూ పోగయేవారు. వారి సున్నిత మైన బాషలో ప్రతి పాటా విషాదాన్నే ధ్వనింప చేస్తుంది.

బిషప్ ఆగమనం :

కలవా చర్చికి ముదురు రంగులు వేయించారు. వీలున్నప్పుడల్లా ఏదో ఊరేగింపు, పండుగ, వనభోజనాల రూపలలో అంతా కలుస్తుండేవారు. ప్రతి ఏటా ''కార్పస్ క్రిష్టి'' అనే పండుగ చాల సంబరంగా జరుపుకుంటారు. ఈ ''క్రీస్తుశరీర రక్తము మహోత్సవము'' ద్వారా వారితో నూతన ఉత్సాహం తీసుకురాగలిగారు. తాము సమాజం నుండి వెలివేయ బడిన వాళ్ళమని మరచిపోనాగారు. ఇందువల్ల కొందరు కాథొలిక్కులుగా మారేవారు. కాని మత నియమాలన్నిటినీ ముందుగా తెలియజెప్పి, అంగీకరించిన పిమ్మటే బాప్తిజము ఇచ్చేవాడు. అతనొక కాథొలిక్ బోధకునిగా ఈ దీవికి వచ్చినా తన సేవలను అందరికీ సమంగా అందించేవాడు. మతస్తులతో క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇచ్చేవాడు, అవసరమైతే వాళ్ళపై కోప్పడేవాడు.

ఆయన వచ్చి మూడేళ్ళు. 8-6-1875న తగిన అనుమతి తీసుకొని పీఠాధిపతి ఆ ద్వీపానికి అధికార పర్యటనకై వచ్చారు. పతకాలతో ఘనంగా ఆహ్వానించారు. అంత పెద్దవారు ఆ దీవికి రావడం అదే మొదట, ఆ దీవి అంతా తిరిగి జరగుతున్న పనుల్ని చూశాడు. ఇంకా చేయవలసిన వాటిని డామియన్ వివరించాడు. రాత్రి రెండుగంటలసేపు వాద్య సంగీతం వినిపించారు అతిథులకు . బిషప్ వెంట వచ్చిన మరొక ఫాదర్ ఈ రోగులనుచూచి భయపడ్డారు, కానీ సంగీతం విని ఆనందించాడు.

బిషప్ వారికి నూతన వస్త్రాలు, మరికొన్ని కానుకలూ తెచ్చాడు. రోగులకు వ్యాధివల్ల కంఠస్వరం మారిపోయి బొంగురుగొంతుతో వారు చేసే సామూహిక ప్రార్ధనలు విని బిషప్ విలపించాడు. ఆరోజు 135 మందికి బాప్తిజము ఇచ్చారు చర్చిని పూలతో, క్రొవ్వులతో ,రంగు రిబ్బన్లతో అలంకరించారు. అది ఒక అనందమైన సమయమే. కాని, కొందరు రోగులు నుదుట బొట్టు పెట్టడానికి సరిపోయే ఆరోగ్యమైన చర్మమైనా లేకపోవడం బాధాకరంగా వుంది. ఐదురోజులుండి ఆయన తిరిగి వెళ్తుంటే అనాధపిల్లలు వీడ్కోలు చెప్పారు. వాళ్ళకు బిషప్ కొన్ని ''పవిత్రప్రతిమ'' బిళ్ళలు ఇచ్చాడు.

ఈ అనాధ పిల్లల గురించ చర్చించి వాళ్ళకు కొంతమేలు చేయాలనుకున్నాడు డామియన్ కానీ పనులవత్తిడివల్ల వీళ్ళ సంగతి పట్టించుకోలేక పోయాడు. ఇపుడు బిషపు ఇచ్చిన కొద్ది ధనంతో ఒక చిన్న అనాధశ్రయాన్ని నిర్మించాడు. ఒక వితంతు రోగిని వంటమనిషిగా, పనిమనిషిగా నియమించాడు. మరీ అధ్వాన్నస్థితిలో వున్న బాలికలకే అందులో వసతి కల్పించారు. వీరికి వారం వారం మాంసం ఇచ్చే ఏర్పాటుచేసిది ప్రభుత్వం . దీనికితోడు ఆయన పండించిన చిలగడదుంపలున్నాయి. ఇవీ కాక సిస్టర్సు పంపే బహుమతులు కొంత సహాయపడేవి. వీటితో త్వరలోనే మగపిల్లలకు కూడా ఒక వసతి గృహం నిర్మించాడు. తరువాత ఈ రెంటినీ పెద్ద వాటినిచేశాడు. చివరకు వీటిలో నర్సులను, ఉపాధ్యాయులను కూడా నియమించాడు. ఈ అభివృద్ధి రావడానికి ఎన్నో ఏళ్ళు పట్టింది. అంతవరకూ స్థానికులే ఆయనకు సహాయం చేసేవాళ్ళు.

ఆనాథ శరణాలయంలో చేర్చడానికి ఒకబాలుణ్ణి తీసుకొని దీవికి వచ్చాడొక ఫాదర్. డామియన్ ఆ అబ్బాయిని అడిగాడు ''బాబూ'' ఇక్కడ మా వసతి గృహములో ఉంటావా? అని.

ఆ కుర్రవాడు ''ఊహూ...ఉండను. అక్కడ జబ్బు చాలా ఎక్కువగా ఉందట'' అన్నాడు. డామియన్ కు కోపంవచ్చింది. చివ్వున లేచి బయటకు

వెళ్ళాడు 20 అడుగుల దూరంవెళ్ళి ఉన్నట్టుండి వెనక్కు తిరిగి ఆ ఫాదర్ దగ్గరకు వచ్చి ''క్షమించండి, నేను కోపపడ్డాను'' అని క్షమాపణ వేడుకున్నాడు.

తరగని ఇబ్బందులు :

రోజులు దొర్లిపోతున్నాయి. కాని ఒకే రకమైన పనితో డామియన్ కు విసుగుపుడుతుంది. అంతటి కార్యశూరుణ్ణికూడా ఒకోసారి నిరాశ, నిస్పృహలు అవరించేయి. తుఫానులో చిక్కుకున్న నౌకనుంచి చెదరిపోయిన ఒంటరివానిలా వుంది తనస్థితి. క్రొత్త ఇబ్బందులు తరంగాల్లా వస్తున్నాయి. నిజమైన సంఘ సేవకుడు బాధితుల పట్ల సానుభూతి చూపాల గాని వాళ్ళతో కలసి ఏడ్వకూడదు.

డామియన్ విశ్వాసం అచంచలమైనది. ధైర్యం అసాధారణమైనది. అందువల్ల కొన్ని పనులు విఫలమైన అయన బాధ పడేవాడుకాదు. ఆయన పట్టుదలేకపోతే అవి ఒక వారంలోనే అంతరించేవి. ఈ నిరంతర పోరాటం వల్ల ఆయనకు విసుగు కలిగేది.

ఆయన జీవితం నిరాడంబరమైనది, రోజుకు రెండుసార్లే భోజనం. పగలంతా తిరుగుతూనే ఉన్నా మధ్యలో ఏమి తీసుకోడు. చీకటి పడ్డాక చదువుకునేవాడు. తనకిష్టమైన వడ్రంగమొ వ్రాయటమొ చేస్తుండేవాడు. ఆయన ఇల్లూ, స్మశానపుతోట, ప్రార్థనా మందిరం అన్నీ ఒక్కచోటే ఉండేవి. రాత్రిళ్ళు సమాధులకు తానే కాపలా. తన ఆధ్యాత్మిక బిడ్డలు విశ్రాంతి తీసుకొంటున్న చోటు అది, అవే అతని ధ్యానమందిరాలు.

డామియన్ తండ్రి చనిపోయాడని వార్త తెలిసింది. చావు అంటే భయం ఎపుడో పోయినది. ఆయనకు ఇహ లోకజీవితం అనంతమైన కాలరేఖలో ఒక భాగమే. అదొక తృటికాలమే, కొంత విచారించాడు. ఇంటికి ఉత్తరం వ్రాశాడు. మనకు కలిగిన నష్టం గొప్పదే కాని నీవిషయం ఏమిటి! భగవంతుడు నీకు చెప్పే పాఠం అర్థమయిందా! ఈలోక సంబంధమైన బంధాలను పెంచుకోవద్దు. ఈలోకంలో మిగిలివున్న వారి కంటే ప్రభువుకొరకు మరణించిన వారే ధన్యులు.

ఆశ కలిగించే పరిశోధనలు :

ఇంటి దగ్గరనుంచి వచ్చే యూరప్ ఖండానికి ఆయనకు సంబంధమే లేదు. అవి కూడ బంధు మిత్రుల సమాచారాలు, ఊళ్లోకబుర్లతో ఉండేవి. ఆ దశాబ్దంలో సరిహద్దులు మారిపోతున్నాయి. ఫ్రాన్సు మూడోసారి రిపబ్లికన్ గా ఉండటానికి నిర్ణయించుకొంది. ఇంగ్లాండు రాణి భారత దేశపు మహారాణిగా ప్రకటించబడింది.

బయట ప్రపంచంలోని ఏ విషయాలు ఆయన పట్టించుకునే వాడు కాడు. ఆయనకు అభినందనలు చెపుతున్నారని తెలిసినాసరే.

ఆ ఏడే నార్వేదేశ వార్తాపత్రికల్లో ఒక వార్త ప్రచురితమైనది. దాన్ని చదివివుంటే తప్పక ఆసక్తి చూపేవాడు. బెర్గెన్లో డాక్టరు ఆర్మోర్ హేన్సన్ శాస్త్రజ్ఞుడు ఎన్నో ఏళ్ళ అతిక్లిష్టమైన పరిశోదనల ద్వారా కుష్టివ్యాధి కారణం ఒక రకం సూక్ష్మక్రిములు Bacteria అని కనిపెట్టాడు. కానీ పాపం హేన్సన్ విజయం పరిపూర్ణ విజయం కాదు. వ్యాధికి కారణమే కనుగొన్నాడు కాని అది ఒకరి నుంచి మరొకరికి ఎలా వస్తుందో తెలుసుకోలేదు. అతి ప్రాచీన కాలపు వారిని వేదించిన ఈ ప్రశ్నే నేటికి వెధిస్తుంది.

హేన్సన్ పరిశోధనా ఫలితాల తర్వాత ఈ క్రిములను సూదిమందు ద్వారా కుందేళ్ళను, పిల్లులకు, కోతులకూ ఇచ్చాడు. అవన్నీ ఆరోగ్యంగానే ఉన్నాయి. కోబ్నర్ అనే శాస్త్రజ్ఞుడు చేపలు, కప్పలు, గినియాపందుల పైన ప్రయోగించాడు. మార్షో, స్టాన్ జియేల్ ప్రొఫెసర్లు విస్తారమైన ప్రయోగాలు చేశారు. అతిసున్నితమైన జంతువుల కళ్ళలోకికూడా ప్రవేశపెట్టారు. నార్వేలో ధైర్యవంతుడైన డాక్టర్ డేనియేల్ సన్, అతని అనుచరులు కుష్టిరోగి పుండ్ల నుండి తీసిన పదార్థాన్ని తమ రక్తంలోకి ఎక్కించుకున్నారు. కొన్ని సెప్టిక్ బొబ్బలు వచ్చాయితప్ప ఇంకేం కాలేదు. ఈ వ్యాధి అంటు వ్యాధి కాని ఎలా ఒకరినుంచి మరొకరికి వ్యాపిస్తుందో తెలియదు.

‘- -

ఈ జబ్బుకు ఏదశలోనయినా చికిత్సచేయడానికి ఇపుడు మంచి మందులున్నాయి.

- -

1915లో సర్ లియొనార్డ్ రోగర్స్ ఒక ఫార్ములా చికిత్స ప్రకటించాడు. ఇది చాలమంది రోగులకు మంచి ఫలితాలనిచ్చింది. హవాయి విశ్వవిద్యాలయం నుంచి నీగ్రో యువతి కుమారి ఎలైన్ బాల్ ''చాల్ ముగ్రా'' అనే నీరుడు విత్తనాలనూనె శుద్ధిచేసి రోగుల చర్మంలోకి ఇంజక్షను చేసే పద్ధతి కనుగొన్నది. ఈ పరిశోధనల్లో విసుగు, విరామంలేకుండా పనిచేసి ఆమె ఆరోగ్యం చెడిపోగా అకాల మరణం పాలయింది. ఆమె సహాద్యాయులు పరిశోధనలు కొనసాగించారు. ఆ ఫలితాలే తరువాత చాలమంది కుష్టురోగులకు విమోచనం కల్గించాయి. ఇంకా ఎందరో పరిశోధనలు కొనసాగిస్తున్నారు. పత్రికల్లో అప్పుడప్పుడు చికిత్స కనుగొన్నట్లు ప్రకటనలు వస్తున్నాయి, కాని ఏదీ నిర్ధారణ కాలేదు.

రోగులంటే భయమెందుకు ? :

సంవత్సరాలు గడుస్తున్నాయి. ఫాదర్ డామియన్ వయస్సు 40సంవత్సరాల లోపే, అయిన కఠోర శరీరశ్రమవల్ల పదేళ్ళు పెద్దవాడిలా కనిపిస్తున్నాడు. శరీరం మృధుత్వం కోల్పోయి మొరటుగా మారింది. తలవెంట్రుకలు తెల్లబడసాగాయి. చూపు కొంచెం తగ్గింది. మామూలు రోగులతో కలసి తీరుగుతుండేవాడు. వాళ్ళంటే భయపడడం కాని, దూరంగా పోవడం కాని చేయడు. తాను లేనపుడు కూడా ఇంటికి తాళం వేయడు. ఎవరైనా వచ్చి ఆయన ప్రక్కమీద పడుకోదలిస్తే అభ్యంతరం లేదు. ఇంత నిర్లక్ష్యంగా ప్రవర్తించడం మంచిది కాదని కొందరు విమర్శించేవారు. కాని ఎన్నాళ్ళు తప్పించుకోగలడు! ఇగ్నేషియస్ లయొలా, అతని అనుచరులు ఫ్రాన్సిస్ గ్జావియర్, సైమన్ రోడ్రిగ్జ్, వాళ్ళందరూ తమ పరుపులమీద కుష్టురోగులు పడుకోవడానికి అనుమతించారు కదా! తాను కూడా వాళ్ళ మార్గాన్నే అనుసరిద్దామనుకున్నాడు.

ఒక ఉత్తరంలో ఫాదర్ జనరల్ కు ఇలా వ్రాశాడు డామియన్, నిద్రలేచిన దగ్గర్నుంచి పరుండే వరకు హృదయాన్ని ముక్కలు చేసే నైతిక, శారీరక విషాదాల మధ్య ఉంటున్నాను. కానీ నిర్భాగ్యులైన
రోగుల్లో మన స్థయిర్యము పెంచడానికై ఎప్పుడూ ఆనందముగా ఉండటానికే నేను ప్రయత్నిస్తాను. మంచి విత్తనాలను నాకన్నీళ్ళలో నానవేసి చల్తున్నాను అవి బాగా మొలకెత్తి మంచి ఫలాలను ఇస్తాయని నా విశ్వాసం.

నేను ఈదీవికి వచ్చేటప్పుడు ఒక్క పైసా కూడాలేదు. ఐనా నా అవసరాలు తీరుతునే ఉన్నాయి. ఇంకా ఇతరులకు కూడా చిన్న చిన్న సహాయాలు చేయగల్గుతున్నాను, అంతా ప్రభువు దయ.

హవాయి రాజ్యం - రాణిగారి యాత్ర :

19వ శతాబ్దం ఆఖరు హవాయి రాజ్యానికి ప్రాధాన్యత పెరిగింది. అగ్రరాజ్యాలు దీనితో సంబంధాలు పెట్టుకోవాడానికి ఆసక్తి చూపసాగాయి. పసిఫిక్ సముద్రం ద్వారా వ్యాపారం పెరగడంతో హోనొలూలును పసిఫిక్ మార్గాలకూడలి అనే వారు. వాణిజ్య దృష్టితోనే కాక ఈ దీవులు నౌకాకేంద్రంగా కూడా కీలకమైనవి కావడం అందుకు కారణం. వేగంగా నడిచేపొగ నౌకలు రావడంతో దీనిపై దృష్టిబాగా పడింది. దౌర్జన్యం చేసికాక మంచితనంతో హోనొలూలును స్వాధీనం చేసుకోవాలని యూరోపియన్నుల రాజుతో సంబంధాలు పెంచుకుంటూ, బహుమతులను ఇస్తుండేవాళ్ళు. నిజానికి అప్పటికే అమెరికను వ్యాపారస్తుల, తోట యజమానుల మాట అక్కడ చలామణి అవుతుంది. వాళ్ళు ప్రొటెస్టెంటు క్రైస్తవులు.

1881లో అప్పటిరాజు కలహోవా ఇద్దరు ఉన్నతాధికార్లతో కలసి ప్రపంచపర్యటన సాగించాడు. ఈ ఉన్నతాధికారులిద్దరూ అమెరికన్లే, వీళ్ళూ వెళ్ళిన చోటల్లా ఘనంగా మర్యాదలు జరిగాయి. అమెరికా, చైనా, జపానులో సైనికవందనాలు చేశారు. ఫిరంగులు మ్రోగించారు. సయామ్ లో జోహార్

సుల్తాన్లో భారతదేశంలో ఆడంబరంగా ఆహ్వానించారు. యూరప్ లో ప్రతి ముఖ్యపట్టణాన్ని దర్శించారు.

రాణి 'కపిమోలాని' రాజప్రసాదం నుంచి బయటకు రావడం ఇష్టం లేక హోనొలూలు లోనే వుండిపోయింది. రాజు గారి చెల్లెలికి ఈ కాలంలో రాజ్యపాలనాధికారం ఇచ్చారు. రాజు దేశం వదలివెళ్ళి విలాసయాత్రలు చేస్తుంటే ఆయన చెల్లెలు ఇక్కడ దేశ సమస్యలను పరిష్కరించుతు, పరిపాలనను అభివృద్ధి చేసే బాధ్యత చేపట్టింది.

మొలక్లాయ్ దీవుల్లోని రోగుల దీన స్థితిగతులు ఆమెదృష్టికీ వచ్చాయి. డామియన్ పేరు హోనొలూలు లోనే కాకుండా చాలా ప్రాంతాలలో చాలామందికి తెలిసింది. అతని ధైర్యసాహసాలు ప్రజలకు ఆశ్చర్యాన్ని కల్గిస్తున్నాయి. కాని ఆయకు ప్రచారమూ ఆర్భాటం ఇష్టముండదు. ఒకసారి డామియన్ వ్రాసిన ఉత్తరాన్ని పత్రికలకు ప్రచురణకు ఇచ్చాడు. ఆయన అన్న అందుకు నిష్ఠూరంగా ఉత్తరం వ్రాశాడు డామియన్.

'నాకు అలా ప్రచారం చేసుకోవడం ఏ మాత్రము ఇష్టం ఉండదు. ప్రపంచానికి నేనెవరో తెలియనవసరం లేదు. నేను వ్రాసిన కొన్ని ఉత్తరాల ద్వారా నన్ను గురించి అమెరికాలో గూడా చెప్పుకుంటున్నట్లు తెలిసింది.

ఫాదర్ కు వచ్చినవి అన్నీ ప్రశంసలే కాదు, అతను ఇంకా హెల్త్ బోర్డుకు ప్రక్కలో ముల్లులాగానే ఉన్నాడు. కొందరు ఇతన్ని ఎప్పుడూ అభివృద్ధి అభివృద్ధి అని అడిగే ఒక అంతులేని తలనొప్పి అనుకునేవారు. ఆర్ధిక పరిమితులు బడ్జెటుల వంటి సంజాయిషీలు చెప్పి ఆయన్ను సమాధాన పరచడానికి యత్నించే వాళ్లు. ప్రభుత్వం ఒక సూపరింటెండెంటును నియమించి ఒక డాక్టరును నియమిస్తామన్నారు. ఐనా ఇంకా మంచి ఆహారం కావాలని, రాబోయే డాక్టరుకు అసిస్టెంటు కావాలనీ కోరేవాడు.

మొలకాయ్ దీవుల్ని సందర్శించాలన్న రాణిగారి ఆసక్తి విని అధికార్లు ఆశ్చర్యపోయారు.

రెండు వారాల తరువాత ఆమె తన బలగంతో సహా బయలుదేరింది. ఆమెకు ఘనంగా వీడ్కోలు చెపుతూ, ఆమె ధైర్య సాహసాలను పొగడుతూ ప్రజలు బారులు తీరి వీధుల్లో నిలుచున్నారు. పరిచారికలు వింజామరలు విసురుతున్నారు. అధికారులు, సేవకులు వాళ్ళ స్థాయి, హోదాలను బట్టి ఉండవలసినంత దూరంలో ఉన్నారు.

డామియన్ ఈ ముఖ్య అతిథికి స్వాగతము పల్కడానికి సముచితమైన ఏర్పాట్లు చేశాడు. అడవి పూలతో స్వాగత తోరణాలు ఆలంకరించారు. పిల్లలు పుష్పదళాలు చల్లుతున్నారు. అంతగా భయంకరంగా కనిపించని రోగులు రెండు వరుసలుగా ఏర్పడి వందనం చేశారు. బ్యాండుమేళాలు మ్రోగుతున్నాయి. ఆమె పేరుతో జేజేలు పలికారు. ఆమె స్వాగత ద్వారం గుండా ప్రత్యేకంగా అమర్చిన వేదిక మీదికి వచ్చింది. ఆమె చాలా పొడవరి. రాజవంశపు ఠీవి కన్పిస్తుంది. ఆమె విగ్రహంలో, నల్లని వస్త్రాలతో మెడలో పూలదండ తప్ప ఏ అలంకారాలు లేకుండా వుంది. నిర్భాగ్య రోగుల దయనీయ స్థితిచూస్తుంటే ఆమె కంఠస్వరం వణికింది. కన్నీళ్ళు కార్చసాగింది. ఆమె మాట్లాడలేక ఆమెకు బదులుగా అధికారిని మాట్లాడమని సైగ చేసింది. ఒక గంటసేపు చూసి వెళదామని వచ్చిన ఆమె రోజంతా అక్కడే వుంది.

డామియన్ తో కలసి దీవి అంతా తిరిగి అన్ని ప్రాంతాలూ చూసింది. బెల్జియం దేశపు రైతుబిడ్డ పోలినేషియా రాజవంశపుబిడ్డ ఒకరి భావాలొకరు తెలుసుకోవడానికి ఎక్కువ మాటలు అవసరం కాలేదు.

వ్యాధి మరీ ముదిరిపోయి భయంకరంగా కనిపించే రోగులు ఆమె దృష్టిలోకి రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కాని ఒక చోట ఆసుపత్రి తలుపులు తెరచి ఉన్నాయి. అక్కడి దృశ్యం చూడలేక కళ్ళు గట్టిగా మూసుకొని, ముఖం ప్రక్కకు తిప్పుకొని ప్రక్కనున్న ఒక స్త్రీని ఆధారంగా చేసుకొని ముందుకు నడిచింది. 'ఎవరైనాసరే కోరుకొని ఈ దీవిలోకి వచ్చి ఉంటున్నారంటే నమ్మలేని విషయం' అన్నది ఆమె.

'అది నా కర్తవ్యం అమ్మా. వీరు నా మతస్తులు' అన్నాడు మెల్లగా, 'అవును నీ మతస్తులు... నాప్రజలు' నెమ్మదిగా అంటూ అక్కడ మూగిన వారిని చూసింది.

రాత్రి అయింది. నౌక తిరుగుముఖం పట్టింది. నిండు పున్నమి వెన్నెలరాత్రి మెరిసే తారలు, ప్రశాంతసాగరం, దివిటీలతో వీడ్కోలు వీటన్నిటిలో పరిపూర్ణత నింపుకుంది ప్రకృతి సౌందర్యం.

రాణి విషాదంగా శలవు తీసుకుంది. నౌకలోకి వెళ్ళాక చేయి అందించింది డామియన్ కు. ఆయన వినమ్రుడై వంగి ఆమె చేయి ముద్దుపెట్టుకున్నాడు నౌక కదలసాగింది. బాణసంచా కాల్చారు. ఆమోను స్తుతిస్తూ కేకలు వేస్తున్నారు. ఆమె గుండె చెరువయింది. పరిసరాలను మరచి, ప్రక్కన ఉన్న మనుషులను సిబ్బందిని, గూడా గమనించికుండా రాణి విలపించ సాగింది. ఆ నౌకలో పత్రికా ప్రతినిధులు కూడా ఉన్నారు. మిగతా యాత్ర పూర్తయే వరకు ఆమె ఎవరితోనూ మాట్లాడలేదు. నౌక రాజధానికి చేరుకున్నది పత్రికలన్నీ రాణిగారిని పొగిడాయి. ప్రతి విషయమూ వివరంగా చిత్రించారు. హెల్త్ బోర్డును తీవ్రంగా నిందించారు ఆ దీవులను నిర్లక్ష్యం చేసినందుకు.

ఇక డామియన్ ను గురించి చెప్పవలసిందేముంది! ఆయన్ను ప్రత్యేక విశ్లేషణల వరదల్లో ముంచేశారు. 24-9-1881న 'కమర్షియల్ అడ్వర్టైజర్' పత్రికా సంపాదకుడు ఇలా వ్రాశాడు.

ప్రశంసల పరంపర :

'యువ బోధకుడైన డామియన్ తన జీవితాన్నే అంకితం చేయడం వల్ల హవాయి ద్వీపవాసులైన కుష్టురోగుల చరిత్రే మెరుగు పడింది. ఆ రోగులతో, ప్రమాదకరమైన వాతావరణంలో జీవితాంతమూ నివసించడం కంటే ఒకేసారి ఏ అడవి మృగం ముందో బలి పడవేయబడటమే మంచిదేమో! క్రీస్తు సైనికుడు డామియన్ వెలివేయబడ్డ రోగుల మధ్య చాలా ఏళ్ళనుంచి ఉంటూ తన సేవలన్నిటినీ వారికే వినియోగిస్తూ, వాళ్ళపుండ్లకు కట్లు కడుతూ, వారి జీవితాలలో

ఆధ్యాత్మిక చింతన కలిగించి, వాళ్ళు చనిపోతే తన చేతులమీదుగానే అంత్య క్రియలు కూడా చేస్తున్నాడు.

తరువాత రాణి రీజంట్ ఒక బిషప్ ద్వారా డామియన్ కు ప్రశంసాపత్రం పంపుతూ ఇలా వ్రాసింది.

''బంధు మిత్రులకు దూరమై, విషాదంలో కుమిలిపోయే రోగులకు మీరు చేస్తున్న విశిష్టమైన, ఉదాత్తమైన శారీరక, ఆధ్యాత్మిక సేవలు చూసి ముగ్ధురాలనయాను. మీ సేవలూ, త్యాగాలు నిర్భాగ్యులకు ఊరట కలిగించ డానికే తప్ప మరెందుకూ కాదని నాకు తెలుసు. దేవుని ఆశీస్సులు తప్ప మీరు మరేమీ కోరటం లేదనీ తెలుసు, కానీ నా తృప్తి కొరకై ఈ రాజముద్రికను గ్రహించవలసిందిగా వేడుకుంటున్నాను.''

డామియన్ సేవలు గుర్తించి ఆయనను సత్కరించిన రాణిగారిని హవాయి పత్రికలు ప్రశంసల బృందగానాలు వినిపించాయి.

మతస్తులలో ఒక శాఖ వారంటే ఇంకొకరికి గిట్టక పోవడం సర్వత్రా ఉన్నదే. దానికి అతీతంగా ప్రొటెస్టెంటు శాఖకు చెందిన రాణి రీజంట్ ఫాదర్ డామియన్ మానవ సేవను గుర్తించి సన్మానించడాన్ని 'గెజిట్' పత్రిక ప్రశంసించింది.

బిషప్ ఆ దీవికి వచ్చి చర్చిలో సన్మాన పత్రం చదివి బంగారు పతకాన్ని డామియన్ మెడలో వేశాడు. డామియన్ దాన్ని వెంటనే తీశాడు . కాని బిషప్ ఆజ్ఞ వల్ల ఆ రోజు మాత్రమే ఉంచి రాత్రికి దాన్ని తీసి పెట్టెలో పెట్టేశాడు. ఆయన జీవించినంతకాలం దాన్ని ఎవరూ చూడలేదు.

ఆయనకు ఆ బంగారు పతకం వల్ల కలిగిన ఆనందం కంటే ప్రభుత్వం ద్వారా ఈ దీవికి ఏం చేయాలా అనే ఆలోచన ఎక్కువయింది. బిషప్ కు చాలా పథకుల, ప్రణాళికలు చెప్పాడు. అవన్నీ ఫలవంతమౌతాయని కలలు కన్నాడు. కానీ అవి అంతగా నెరవేరలేదు, నెలలు సంవత్సరాలు గడచినా.

ఈ విషయమై సోదరునికి ఉత్తరం వ్రాశాడు 'నేను ప్రభువు సేవకుడను, కాబట్టి నాకు ప్రజలు ఇవ్వదలచుకున్న ప్రశంసలు, గౌరవాలు అన్నీ ఆయనకే చెందుతాయి. నేను మాత్రం ఆత్మ విమర్శ చేసుకుంటుండాలి ఎప్పటికప్పుడు. క్రీస్తు, ఆయన ప్రార్థనాలయమే నా సర్వస్వం, విశ్వాసము వినయాలతో అద్భుతమయిన పనులు కూడా నెరవేరుతాయి. అంతే కాదు వ్యతిరేకత ఎదురైనపుడు కూడా మనం నిరాశ చెందము, అందుకే సంతృప్తి, సంతోషం కోరుకుందాం, మానవుల ప్రశంసలకు పొంగిపోకుండా ఉందాం'.

సిస్టర్సు సహాయమూ, తన ఒక్కడి సేవ వల్ల చేసేది ఏం సరిపోతుంది? ఇండియా, చైనా, దక్షిణ అమెరికా మరికొన్ని దేశల్లో ఈ వ్యాధి ఎక్కువవుతున్నట్లు పత్రికల ద్వారా తెలుసుకొని ఆయన బాధపడ్డాడు రోగులు బిచ్చగాళ్ళుగా మారడం, వెలివేయబడటం, కాలనీలలోకి పంపబడటం జరుగుతుందక్కడ.

బయటి వాళ్ళంటే చిరాకు :

ఆయన కలలు కల్లలేనని తెలియసాగింది. దీంతో ఆయనకు దీవి బయటవాళ్ళంటే చిరాకు, కోపం వచ్చేవి. అధికారులంటే అసహ్యం, తోటి బోధకులను కూడా కోపపడేవాడు. ఈ విషయంలో ఈయన చాలా తొందర పడేవాడు.

ఫాదర్ ఆండ్రూ బర్గర్ మన్ ను ఆయనకు తోడుగా పంపారు. కాని ప్రతివాళ్లూ తనలాగే రాత్రింబగళ్ళు కష్టపడాలనడంతో అంత శ్రమ చేయలేక ఆయన కొద్ది రోజుల్లోనే తిరిగి వెళ్ళాడు. తరువాత ఫాదర్ ఆల్బర్స్ మాన్జిటర్ ను పంపారు. ఈయన కూడా రెండు సంవత్సరాలు మాత్రమే ఈ దీవిపై అనుచరుడుగా ఉన్నాడు. మళ్ళీ 1884 నాటికి డామియన్ ఒంటరిగానే మిగిలాడు, ఎవరూ అక్కడ పనిచేయడానికి ముందుకు వచ్చే వారుకాదు.

ఆయన బయటివారపట్ల ఎంతో కోపంగా ఉన్నా, రోగులను ఎప్పటి లాగానే ప్రేమతో చూసేవాడు. తనకెంత కోపం వచ్చినా తన స్వార్థం కొరకుమాత్రం కాదని గుర్తుంచుకోవాలి. తాను ద్వీపంలో కాలుపెట్టినప్పటి నుంచి

అతడొ చేసినా రోగుల కొరకే. అయితే అపుడు తాను యువకుడు, ఏ ఆటంకమూ అతనికి మించిపోయేదికాదు. దాటలేనిది కాదు. ఇపుడు 12 ఏళ్ళు గడిచాయి. త్యాగం, ధైర్యం వున్న ముసలివాడుగా కనిపిస్తున్నాడు. ఆయనలో నిస్పృహ ఆవరించి వుంది. 1885 నాటికి ఆయనకు 45 ఏళ్ళే.

ఆ రోజు రానే వచ్చింది :

ఆ ఏడు జూన్ నెల మొదటి ఆదివారం ఆలయంలో ప్రార్థన జరుగుతుంది మంత్రాలు చదువుతున్నాడు భక్తి నిమగ్నుడై ఏకాగ్రతతో మిగతా వారాలలాగేనే వున్నదారోజున ప్రార్థన కూడా పిల్లలు చేసిన చిన్నపొరపాట్లకు కళ్ళెర్ర చేసి చూడలేదు ఫాదర్. దీన్నిబట్టి ఫాదర్ బాగా ఉత్సాహంగా ఉన్నాడనుకున్నారా పిల్లలు బయట బాగా వేడిగా వుంది. లోపల జనసమ్మర్థంగా వుంది. వికలాంగులూ, ఆశక్తులూ ఉన్నారు వాళ్ళలో ఫాదర్ సందేశమివ్వడం ప్రారంభించాడు. ఈ రోజు ఎప్పటిలాగే ప్రియమైన సోదరులారా! అనకుండా ''కుష్టురోగులమైన మనం'' అని సంబోధించాడు, మెల్లగా, స్పష్టంగా, అంటే ఆయనకు కూడా వ్యాధి సోకిందన్నమాట.

''ఫాదర్ మీరు విశ్రాంతి తీసుకో కూడదూ?'' అని అడిగాడు మతస్థుడొకరు. విశ్రాంతా? అందుకు సమయం ఇది కాదు చేయవలసింది చాలా వుంది కాలం చాలా తక్కువ వుంది అన్నాడు ఫాదర్. ఆయనకు వ్యాధి సోకిందని ప్రకటించడానికి కొన్ని నెలలు ముందు ఒకరోజు ఆయన గడ్డం చేసుకుంటుండగా వేడినీళ్ళు క్రిందపోయి కాలిమీద పడ్డాయి. బొబ్బలొచ్చాయి కాని నొప్పి తెలియలేదు. స్పర్శజ్ఞానం లోపించడం కుష్టువ్యాధికి ప్రారంభ చిహ్నం అని ఆయనకు తెలుసు. ఐనా ఆ విషయం ఎవరికీ చెప్పలేదు.

డామియన్ నూ ఆయన సేవలనూ అభిమానించే జర్మనీ డాక్టరు ఆర్నింగ్ ఒకసారి ఈ దీవికి వచ్చాడు. పరిచయం అయ్యాక నడచి వెళ్తూ డామియన్ చేతి వ్రేళ్ళు వంకరపోయి ఉండడం గమనించాడు డాక్టర్. శ్రద్ధగా పరీక్ష చేశాడు. ఎంతో బాధతో ఫాదర్ కు చెప్పాడు.

''అందుకు నేనేం కృంగిపోవడం లేదు. అది రాక తప్పదని చాలా కాలం క్రితం తెలుసు!'' అన్నాడు తాపీగా.

డాక్టర్ ఆర్నింగ్ రాకపూర్వమే ఒక ఏడాది క్రితం హోనొలూలు నుంచి ఒక వైద్యుడు అక్కడకు వచ్చి డామియన్ ను చూసి ఆతని చర్మము రంగు మారుతున్నట్లు గ్రహించాడు. అయితే అతను చూసింది ఎండకు కమిలిన చర్మమో, వ్యాధిగ్రస్తమైన చర్మమో తెలియదు, కాని చాలాకాలం నుంచే ఆయన శరీరంలో క్రిములున్నాయి. మూడు నెలల్లో ఆయన శరీరంపై వ్యాధి చిహ్నాలు బాగా కనిపించసాగాయి.

అతని పాదం స్పర్శ కోల్పోయి పనిచేయడం మానేసింది. కుడిచెవ్వూ పరిసర చర్మమూ వాచింది. శరీరం వికృతం కావడం మొదలుపెట్టింది. ఆయన భవిష్యత్తు ఎలా వుంటుందో? చావు అంటే భయం లేకపోయినా తాను చనిపోతే ఇన్నాళ్ళూ చేసిన పనులన్నీ, తెచ్చిన సంస్కరణలన్నీ విఫలమయి మళ్ళీ వీళ్ళు ఆటవికులుగా తయారౌతారని భయం. డాక్టర్ ఆర్నింగ్ తో అందుకే అన్నాడు. బయటకు వెళ్ళి నా ఆరోగ్యాన్ని బాగు చేసుకోవడం కన్నా ఇక్కడే రోగిగానే ఉండడం నాకిష్టం.

ఫాదర్ జనరల్ కు తన జబ్బు గురించి ఇలా తెలియజేశాడు. వ్యాధి క్రిములు నా శరీరంలో ప్రవేశించి ఉంటాయని పదేళ్ళ క్రితమే మీకు వ్రాశాను తరువాత కూడా ఇంతవరకూ రోగులతో కలసి జీవించడం వల్ల మీ ఆధ్యాత్మిక బిడ్డడొకడు అలంకరించబడ్డాడు. ఆ నాడు రాజుగారి బంగారు శిలువలోనే గాదు – ఈనాడు అంతకంటే బరువైన, విలువలేని 'కుష్టువ్యాధి' కూడా నా మెడలో వ్రేళ్ళాడుతుంది-నాకు రక్షకుడు అనుమతించి ఇచ్చిన బహుమతి అది.

నా ఆరోగ్యమైన శరీరం పదమూడేళ్ళు జబ్బును ఆపగలిగింది. కాని ఇపుడు క్రమంగా జబ్బు బలం పెరుగుతుంది, నాబలం తగ్గుతుంది..... కొంచెం శ్రమతో పనులన్నీ చేయగలుగుతున్నాను. ఫాదర్ ఆల్బర్ట్ లేనందువల్ల ఇద్దరి పనీ నేనే చేయాల్సి వస్తూంది. విశ్రాంతికి సమయమే దొరకటం లేదు.

మారుతున్న ఆలోచనా సరళి :

ప్రార్థనలు, రోగులందరికీ కట్లు, అంత్యక్రియలు, శవ పేటికలు తయారు చేయడం, గుంటలు త్రవ్వటం చేస్తూ ఉత్సాహంగా ఉండేవాడు. దీవి నుంచి బయటకు వచ్చి ఒక త్యాగశీలిగా సన్మానాలు పొందడం ఆయనకు ఇష్టం లేదు. పైగా వ్యాధి రావడం మంచిదేననిపించింది. ఇంతకు ముందున్న ఒక్కో ఆటంకము కూడా తొలగిపోయింది. ''కుష్టురోగులమైన మనం'' అనే వీలు కలిగింది. ఆ దీవిలో రోగులందరి దృష్టులూ, బయట ప్రపంచంలో చాలామందివి కూడా ఆయనపైనే ఉన్నాయి. అతని మరణం తథ్యం. ఆయన ఆలోచనా సరళిలో మార్పు వచ్చింది. ఇంతవరకూ ఉన్న కోపం, చిరాకు తగ్గాయి. చిరునవ్వుతో వుండేవాడు. అధికార్లతో , పిల్లలతో గూడా. ఇందువల్ల అధికార్లతో సంబంధాలు మెరుగయ్యాయి. పిల్లలు ఆయనతో కలిసి ఆడుకుంటూ, నవ్వుతూ తిరగడం సామాన్య దృశ్యమయింది. ఇంతకు ముందు తీరిక వున్నపుడల్లా ఉలీ, సుత్తెతో ఉపయోగ పడే పనిముట్లు చేస్తుండేవాడు. ఇపుడు ఏదో ఆట బొమ్మలు చేస్తున్నాడు. డామియన్ కు వ్యాధి సోకినట్లు బిషప్ కు తెలిసింది. ఆయనను హోనొలూలు రమ్మని కబురు చేయగా డామియన్ జవాబు....

''నాకు కుష్టువ్యాధి వచ్చిందనే నేను రాలేను... కుడి బుగ్గమీద, చెవి మీద దాని లక్షణాలున్నాయి. త్వరలోనే నేనింకా వికృతంగా అవుతాను. నా వ్యాధి ఏదైనా, ఎలా వున్న నా ప్రజల మధ్య ఆనందంగా, ప్రశాంతంగా ఉన్నాను. ప్రభువు ఇష్ట ప్రకారం జరుగుతుంది'' అని.

ఇది చదివిన బిషప్ డామియన్ ను వెంటనే హోనొలూలు లోని ''కకాకో'' ఆసుపత్రికి రమ్మని ఆజ్ఞాపించాడు. డామియన్ ఎంతగా సంజాయిషీలు చెప్పినా, ఆ ప్రజలను విడిచి రానన్నా బిషప్ అంగీకరించలేదు. తప్పని సరయి, త్వరలోనే తిరిగి వస్తానని మతస్థులకు చెప్పి ప్రయాణపు ఏర్పాట్లు చేసుకున్నాడు.

బిషప్ ఇంతగా వత్తిడి చేయడానికి కారణం వుంది. జపాను డాక్టరు ఒక చిన్న ఆసుపత్రిలో ఈ వ్యాధికి కొత్త చికిత్స చేస్తున్నాడు. ఈ 'గోటో' చికిత్సలో

స్నానాలు, మర్ధనలూ, ఇంజక్షన్ లు ఇస్తారు. ఇందువల్ల కొందరి వ్యాధి తగ్గినట్లు తెలిసింది.

ఈ చికిత్స చేసే ఆసుపత్రి ఒక జైలు వంటిది. రోగులను దీవులకు పంపే ముందు ఇక్కడ వుంచుతారు. ఇది పేరుకు ప్రభుత్వ అజమాయిషీలో ఉన్నా దీన్ని నిర్వహించేది ఫ్రెంచి సిస్టర్సు. వీరికి ఫాదర్ డామియనే ఆదర్శం.

ఆసుపత్రిలో చికిత్స – తిరుగు ప్రయాణం :

1873లో ఆయన మొలకాయ్ వచ్చిన కొద్ది నెలలకే సిస్టర్స్ అవసరం వుందని వ్రాశాడు. కాని అదికార పూర్వ విజ్ఞప్తి లేనిదే బిషప్ ఏమి చేయలలేక మౌనం వహించాడు. పిదప కొందరు ప్రముఖులు రాణీగారిని అభ్యర్థించగా, ఆమె పోప్కు వ్రాసింది మొదట ఏడుగురు సిస్టర్సును పంపాడాయన, వాళ్ళను రాణి ఘనంగా ఆహ్వానించింది. వాళ్ళను దీవులకు పంపడం కంటే ఇక్కడే వుంచి ఆసుపత్రిలో వాళ్ళ సేవలు అందుకోవడం మంచిదని భావించింది. అంతకు ముందు ఆ ఆసుపత్రిలో రోగలను ఖైదీలుగా చూస్తూ, ఏదైనా అడిగితే విడికొట్లలో పడేసి హింసించేవారు. వంట ఇల్లు బయటనే వుండేది పుండ్లున్న చేతులతోనే రోగులే వండుకోవడం. మరుగుదొడ్లు కూడా లేవు భరించలేని ఆ పరిస్థితులు మారాయి ఇపుడు ఈ సిస్టర్సు రాకతో, వీరు అక్కడే నివాసం వుంటూ ఒక్కొక్క భాగాన్ని శుభ్రం చేస్తూ, ఊడుస్తూ, కడుగుతూ, గంధపు పొగ వేస్తూ దానికి ఆసుపత్రి ఆకారం తీసుకు వచ్చారు. డామియన్ ఎదుర్కొన్న సమస్యలన్నిటినీ వీళ్ళూ ఎదుర్కొన్నారు. కాని మదర్ మరియానా చాకచక్యం వల్ల ఏ ఆటంకమూ కలగలేదు.

తరువాత ఎక్కువ మంది సిస్టర్స్ రావడం ప్రభుత్వం గ్రాంటు పెంచటం, ప్రజలు కూడా ఎక్కువ విరాళాలు ఇవ్వడం, పట్టణం నుంచి డాక్టర్లు వచ్చి చూడటం జరుగుతున్నాయి. అందులో ఒక జర్మన్ డాక్టరు రోజూ ఆసుపత్రికి వచ్చి 70 మంది రోగులకు ఈ ప్రత్యేక చికిత్స చేస్తున్నాడు. వీళ్ళకు వేడిమందు నీళ్ళతో స్నానం. రోజుకు రెండుసార్లు భోజనానికి ముందూ, వెనుక మందు ఇచ్చేవాడు.

ఈ మందు బాగా పనిచేయ సాగింది. కొందరు రోగులను త్వరలోనే ఇళ్ళకు పంపించ వచ్చుననుకుంటున్నారు. ఇంతవరకూ చరిత్రలో వినని విషయం ఇది.

చికిత్సకై డామియన్ ఇక్కడకు రావడం అక్కడి సిస్టర్సు జీవితంలో మరుపురాని సంఘటన. ఆయనే వాళ్ళు ఆదర్శ ప్రాయుడు. ఆయన అడుగుజాడల్లో కుష్ఠురోగులకు సేవ చేయడానికి సముద్రాన్ని దాటి ఇంత దూరం వచ్చారు. ఆయన కొరకై ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఒక గదికి సున్నం కొట్టించి, పవిత్ర పటాలు, శిలువ అలంకరించారు. చాలా ఏళ్ళ తరువాత ఆయన మళ్ళీ దుప్పట్లు వేసుకుని పడుకోబోతున్నాడు.

ఆయన ఇక్కడకు వచ్చేసరికి వ్యాధివల్ల ముఖం వికారంగా అయింది. ముక్కు లావయింది. చెవులు ఆకారం మారిపోయాయి. చర్మం రంగు ఎర్రగా మారింది. ఆ రూపంలో ఆయన్ను చూసి సిస్టర్సు ఏడ్చారు. ఆయనకు కావలసినవి శ్రద్ధగా చూస్తూ ఆయనకు వీలయినంత సుఖశాంతులు కల్పించేవాళ్ళు. కాని ఇలా జడంగా వుండి మరొకరి చేత సేవలు చేయించుకోవడం ఆయనకు నచ్చదు. సిస్టర్సు ఎక్కువడా రావడం, పోవడం, తనను ఎంతో శ్రద్ధగా చూడడం ఆయనకు ఇబ్బందిగా వుంది. గంటల తరబడి సోమరిగా కూర్చోవడం, వేడినీళ్ళ స్నానం చేయడం ఆయనకు శిక్షగా అనిపిస్తుంది. మొలకాయ్ దీవుల్లోని వాళ్ళ గురించే ఆలోచించేవాడు. ఆయన కోర్కెను కాదనలేక రెండు వారాల్లోనే తిరుగు ప్రయాణానికి అనుమతి ఇచ్చారు. మదర్ మరియానా వీడ్కోలు చెప్పింది. దీవుల్లోని పిల్లల సంరక్షణకోసం కొందరు నర్సులు అవసరమని ఆమెకు చెప్పాడు. ఆ దేశపు రాజు, ప్రధాని, బిషప్ వచ్చి పరామర్శించి వెళ్ళారు.

ఇష్టం లేకపోయినా బలవంతంగానే కొందరు రోగులను ఆ నౌక లోనే దీవులకు పంపారు. వాళ్ళ ఏడ్పులు, పెడబొబ్బలతో వీడ్కోలు విషాదంగా తయారైంది.

పర్వతాల అంచులు, శిఖరాలు వాటిపైన రంగు రంగుల మేఘాలు ఎగుడు దిగుడుగా, పవిత్రంగా కనిపిస్తున్నాయి. హోనొలూలూ లోని ఆ దృశ్యాలను

ఆయన మళ్ళీ చూసే ఆశలేదు. నౌక సాగిపోతుంది చీకటి పడింది. కిటికీ దగ్గర నిలబడి చీకట్లోకి చూస్తున్నాడు. ఇంజను రొద, రోగుల అరుపులు, వాతావరణాన్ని భీబత్సంగా చేస్తున్నాయి. తెల్లవారే సరికి నౌక తీరాన్ని చేరింది.

చెప్పుకోదగ్గచేదోడు బ్రదర్ డట్టన్ :

తన అనారోగ్యాన్ని గూర్చి ఇంటికి వ్రాయలేదు డామియన్. కానీ హోనొలూలు వెళ్ళి వచ్చాక ప్రపంచమంతటా, వార్తాపత్రికలన్నీ ఆయనను గురించి వ్రాశాయి. ఆ దయనీయమైన వార్త విన్న డామియన్ వృద్ధ మాత కొడుకు పటంవైపే చూస్తూ, చేత్తో జపమాల పట్టుకొని అలాగే ప్రాణాలు విడిచింది. ఆమెకపుడు 82 ఏండ్లు.

డామియన్ అన్న పాంఫిలే మొలకాయ్ దీవులకు రావాలనుకున్నాడు. కాని అనుమతి దొరకలేదు.

డామియన్ కు వ్యాధి సోకిందని తెలుసుకొని అక్కడి రోగులకు సేవ చేయాలని ప్రపంచ వివిధ బాగాలకు చెందిన నల్గురు వ్యక్తులు ఆసక్తి చూపారు. మొదట వచ్చినవారు జోసెపు డట్టన్., ఇతనే డామియన్ కు మిత్రుడైనాడు. అక్కడే ఆ దీవిలోనే 44 సంవత్సరాలు వుండిపోయాడు.

ఇక్కడకు రాకపూర్వం డట్టన్ జీవితం ఎన్నోసాహసాలతో నిండిన శృంగార నవల లాంటిది. అతడొక సైనికుడు, సన్యాసి కూడా. అతడు భగ్న ప్రేమికుడు. ఇంగ్లండు నుండి వచ్చి అమెరికాలో స్థిరపడ్డ సంపన్న కుటుంబీకుడు. చిన్న తనం సరదాగా గడిపాడు. చాలా రకాల చదువులు చదివాడు. జర్నలిజం ప్రయత్నిద్దామనుకుంటుండగా 1861లో సమ్టల్ కోటవద్ద ఫిరంగులు మ్రోగాయి. పౌరయుద్ధం ప్రారంభమయింది. ప్రెసిడెంటు లింకన్ యువకులకు పిలుపునిచ్చాడు. డట్టన్ వెళ్ళి మిలిటరీలో చేరాడు. రెండేళ్ళ పిదప ఆతను లెఫ్టినెంటు అయాడు. ధైర్యసాహసాలు గల అధికారిగా పేరుపొందాడు. తోడి మానవులపై మరొక సోదరుడే చేసే యుద్ధంలోని విషాదపు, వినోదపు లోతుల్ని చూశాడు. గుర్రపు స్వారీలు, శత్రు రంగంలోకి చొచ్చుకొనిపోవడం, 22ఏళ్ల తాను

గుర్రపు దళాన్ని ఆజ్ఞాపించడం, కనుసైగ చేస్తే మారణహోమం జరపడానికి సిద్ధంగా వున్న సైనికులు, వీటితో చావు అంటే భయం లేకుండా పోయింది.

క్రమశిక్షణ బాగా జీర్ణించుకుపోయింది. మొలకాయ్ దీవుల్లో కూడా ఆయన పతాకాన్ని ఎగురవేయించి పతాక వందనం చేసేవాడు క్రమశిక్షణ పాటించని వాళ్ళను మందలించేవాడు.

సైనికుడుగా విశ్రాంతి సమయాల్లో తాగేవాడు, జూదం అడేవాడు. తిరుగుపోతు కాదని కూడా చెప్పలేము. మిత్రుల హెచ్చరికలను త్రోసిపుచ్చి, ఒక యువతిని ప్రేమించాడు. వివాహమాడాడు ఆ చపల చిత్తురాలు నానాబాధలు పెట్టినా ఆమెపై ప్రేమతో భరించాడు. చివరకు విపరీతమైన అప్పులు చేసి, మరొకనితో లేచిపోయింది.

అతనా బాధను మరువలేక తాగుడుకు అలవాటయాడు. అది వ్యసనంగా పెరిగింది. మిలటరీ వదిలేశాడు. పదేళ్ళు గడిచాయి. చిన్నగా కోలుకొని ప్రభుత్వ ఉద్యోగంలో చేరాడు. దక్షిణాన గల మెంఫిన్ పట్టణంలో సంస్కారవంతుల కుటుంబానికి స్నేహితుడయాడు. వారి ద్వారా ఒక మతబోధకుని పరిచయం చేసుకొని తన గత జీవితాన్ని ఆయన ముందుంచి పశ్చాత్తాప పడి, బాప్తిజము పొంది మతంలో చేరాడు. ఇలా ఒక సైనికాధికారి చర్చి గోడల మధ్యకు వచ్చాడు.

కానీ తాను ఎంచుకున్న ట్రాపిస్టు శాఖలో జీవితం చాలా కఠోర నియమ నిబంధనలకు లోబడి వుంటుంది. శారీరక శ్రమ, ఎక్కువ మౌనం, సుదీర్ఘ ప్రార్థనలు, అతని స్వభావానికి నచ్చలేదు. తనకు నచ్చే వ్యాపకం కొరకు అన్వేషిస్తున్నాడు. న్యూ ఆర్లియన్స్ లోని ఒక గ్రంధాలయంలో ఫాదర్ డామియన్ చరిత్ర చదివాడు. ఇంకేమీ ఆలోచించకుండా తన మార్గాన్ని నిర్ణయించుకున్నాడు. ప్రపంచానికి వెన్ను చూపి వచ్చేశాడు మతస్తుల అనుకునే విధంగా ఆయన బ్రదర్ కూడా కాదు. మామూలు వ్యక్తి. అయినా మిత్రులు అభిమానంతో ఫాదర్, బ్రదర్, వెనిరబుల్ వంటి సంభోదనలతో ఉత్తరాలు వ్రాసేవారు. కాని ఆయన జోసెపు డట్టన్ అని క్లుప్తంగా సంతకం చేసేవాడు.

పనుల పంపిణి :

దీవులకు వచ్చే క్రొత్తవాళ్ళకు స్వాగతం చెప్పడం నౌకల్లో వచ్చిన సరుకులను స్వాధీనం చేసుకోవడం, ఉత్తరాలకోసం ఎదురు చూడడం, ఇవీ డామియన్ రెండు రేవుల దగ్గర చేస్తున్న పనులు, పడవలు, నౌకలు, లాంచీలు, స్టీమర్లు గూర్చి చాలా విషయాలు ఆయనకు తెలుసు.

హోనొలూలు నుంచి తిరిగి వచ్చాక ఎక్కువ సమయం సముద్రతీరాన కూర్చొని గడిపేవాడు. కాని తన శారీరక శక్తి అందుకు కూడా అనుమతించడం లేదు. నడవలేక ఒక గుర్రం మీద వస్తున్నాడు ఇక్కడకు

ఒక పొడవాటి మనిషి, కుష్ఠురోగి కానివాడు, నౌకలోనించి పడవలోకి మారడం చూసి డామియన్ కు ఆసక్తి కలిగింది. డట్టన్ తనను పరిచయం చేసుకొని అక్కడే వుండటానికి వచ్చానని జీతమేమీ అవసరం లేదని అడుగుతాడు. బిషప్, హెల్తుబోర్డుల ఆమోద పత్రాలు చూపించాడు. వాటిని కళ్ళకు దగ్గరగా పెట్టుకొని తన లావు అద్దాల లోంచి చూస్తూ మెల్లగా చదివాడు.

ఒక సహాయకుని కొరకు ఎంతగానో ఎదురు చూస్తున్న సమయంలో ఇతను రావడం సంతోషకరమైన విషయమే, కానీ ఈ పెద్ద మనిషి ఈ దీవిలో వుండగలడని నిర్ధారణ ఏమిటి? అందుకు అక్కడి దుర్భర పరిస్థితులు కొన్ని వివరించి ''కనీసం ఒక్క ఏడాది ఐనా నీవు ఇక్కడ వుండగలవా?'' అని ప్రశ్నించాడు. ఔను అన్నాడు డట్టన్. వారిద్దరూ కలిసివెళ్తూ ఒకదానివెంట ఒకటిగా అన్నిచోట్లూ చూశారు. సంభాషణ పిదప డామియన్ ఎంతో సంతృప్తి చెందాడు. తన పనులను కొనసాగించడానికి లభించిన మానవమణి ఇతడు అనుకున్నాడు. ఇద్దరూ మంచి మిత్రులయ్యారు. జోసెపు తన మాట ప్రకారం తరువాత సంవత్సరాల్లో కూడా ప్రభుత్వం ఇస్తానన్న ప్పటికీ ఒక్క పైసా కూడా జీతంగా తీసుకోలేదు.

వ్యాధి బాధవల్ల, పెద్దవయసువల్ల డామియన్ కు మతిమరుపు వుండేది. ఒక పని మొదలుపెట్టి అది ముగియక మునుపే మరొకటి మొదలు పెట్టేవాడు.

ఆయన విడిచిపెట్టిన పనిని డట్టన్ పూర్తి చేసేవాడు. తన మిలటరీ శిక్షణ, సమస్య పరిష్కార మార్గాలు వెదకటం ఇక్కడ బాగా ఉపయోగపెడుతూ ఆఫీసరులాగా, హుందాగా అగుపించెడివాడు. శుభ్రమైన దుస్తులు ధరించేవాడు, ప్రక్కగుడ్డలు తీయడం, చుట్టచుట్టడం, ఎపుడూ పై అధికారులు వస్తారేమో చూస్తారేమో అన్నట్లు తనగదిని శుభ్రంగా వుంచేవాడు.

మొదటిరోజు సంభాషణలతో గడచింది,పథకాలు చర్చించి, పనిని పంచుకున్నారు. డట్టన్ రెండు చర్చీల వద్ద చూసుకోవాలి. డామియన్ చేతులు బాగా వాపుగా ఉన్నందున అలాచేయక తప్పలేదు. క్రమంగా పుండ్లకు కట్లు కట్లడం కూడా చేయలేకున్నారు. ప్రొద్దు క్రుంకింది.

రాత్రికి ఇద్దరూ చర్చిముందు కూర్చున్నారు. డామియన్ పైపు అంటిస్తూ తన ఆశయాలను, ప్రార్థనలనూ చెపుతుంటె డట్టన్ శ్రద్ధాభక్తులతో విన్నాడు. ''నీవే ఇక్కడకు వచ్చిని మొదటి బ్రదర్ వు'' అన్నాడు. చిరునవ్వుతో డామియన్ను అప్పటినుంచి అయన్ను 'బ్రదర్' డట్టన్ అనే పిలిచేవాడు.

నెలలు గడిచే కొలదీ డట్టన్ శక్తి సామర్థ్యాలు తెలియసాగాయి. అన్నివిధాలా తన తరువాత వాడు డట్టన్ అని అతనిపై ఆశలు పెంచుకున్నాడు డామియన్ . ''నీవు మత బోధకుడవయి తీరాలి'' అన్నాడొక సాయంత్రం. డట్టన్ అంగీకరించలేదు. అందుకు కారణం కూడా చెప్పలేదు. డామియన్ ఎంతగా నచ్చ చెప్పాలని ప్రయత్నించినా వినలేదు. చివరకు తన అనుమానాలను ఫాదర్తో చెప్పుకున్నాడు. అవేమిటో తరువాత ఇంకెవరికి చెప్పలేదు. డామియన్ కుడా మళ్ళీ ఆ విషయం ఎత్తలేదు.

ఫాదర్ అడుగుజాడలలో బ్రదర్ :

కాలం గడచిపోతుంది. సాయంత్రరం ఈ శ్రామికులందరూ ఆరోజు చేసిన పనుల గురించి మాట్లాడుకొని, రేపటి పనులగురించి చర్చించుకొనేవారు. రాత్రిళ్ళు కొంతసేపు రోగులు వచ్చి డామియన్ తో కలసి వుండి వెళ్ళేవాళ్ళు. తరువాత ఆయన మసక దీపపు వెలుతురుతో దినచర్య చదువుకునేవాడు. డట్టన్

పాత పత్రికలను చదువుతుండేవాడు. అవి నెలరోజుల నాటివైనా సరే బయటి ప్రపంచంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలనుకునేవాడు.

అమెరికాలో కూడా మొదటి సారిగా కారల్ మార్క్స్ రచనలు చదువనారంభించారు. సమ్మెలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. పోలీసులకు, కార్మికులకు సంఘర్షణలు మొదలయ్యాయి. అమెరికన్ కార్మిక ఫెడరేషను ఏర్పడిందా సంవత్సరమే. అమెరికన్ చేపల పడవలను బ్రిటిష్ వాళ్ళు బంధించారు. వాటిని విడిపించమని ప్రెసిడెంట్ క్లీవ్ ల్యాండ్ సంభాషణలు జరుపుతున్నాడు.

బయటి ప్రపంచంలో జరిగే ముఖ్యమైన సంఘటనలు గురించి ఆసక్తిగల డట్టన్ వీటిని గురించి ఫాదర్ తో చర్చిద్దామంటే ఆయన దీవి విషయాలు తప్ప మరి దేనిలోనూ ఆసక్తి చూపేవాడు కాదు.

ఫాదర్ గ్రెగరీ అనే ఫ్రెంచి దేశస్తునికి కూడా లెప్రసీ వ్యాధి సోకగా ఈ దీవికి వచ్చాడు. అయితే అప్పటికే వ్యాధి ముదిరి పోవడం వలన ఎక్కువ కాలం జీవించలేదు. హాస్పటలు చికిత్స పొందినా ప్రయోజనం లేక వ్యాధికి బలయ్యాడు.

డామియన్ కూడా ఈ పాటికి ఆ స్థితికి చేరవలసినవాడే. కాని ఆయన మొండి వైఖరితో మృత్యువును వెనక్కు నెడుతున్నాడా అనిపిస్తుంది. 'ఇంకా చేయవలసింది ఎంతో వుంది.' అని తపనపడుతుండే వాడు. ఏ మాత్రం సహకరించని తన చేతులతోనే సుత్తెపట్టుకుని ఏదోపని చేస్తుండేవాడు.

దట్టన్ వచ్చాక సాముహిక వంటశాల, గోటో ప్రకృతి చికిత్సలో స్నానాలకు సౌకర్యం, తన చిరకాలపు కోరికైన పిల్లలకు వసతి ఏర్పాటు చేయబడ్డాయి. ఇంకా తృప్తి లేదు. ఎంతో చేయాలి ఎంతో అభివృద్ధికావాలి. కాని....ఓపిక లేదు. ఒక కన్ను కనిపించడం లేదు. ముక్కు చొట్టబడింది. రెండో కంటి చూపు కూడా క్రమంగా తగ్గుతోంది. నడవలేకపోతున్నాడు.

ఆసుపత్రికి క్రొత్తభవనం, మరోప్రార్థనాలయమూ నిర్మించసాగాడు. డట్టన్ ఎంతగా చెప్పినా ఆయన విశ్రాంతి తీసుకునే వాడు కాదు. వ్యాధి శరీరాన్ని

లొంగదీసుకుంటుంది. అన్ని ఇంద్రియాలను వశపరచుకుంటుంది. కంఠస్వరం కూడా జీర పోయింది. రోజులు, వారాలు, నెలలూ భారంగా గడుస్తున్నాయి. మృత్యుమేఘు దట్టమౌతున్నాయి. ఇంకా చేయవలసింది వుంది.

బయటి సహాయం :

1888 సం.. ఆఖరుకు అనుకోకుండా కొద్దినెలలలోనే ఆరగురు సహాయకులు బయటినుంచి వచ్చారు. అందులో ముగ్గురు స్త్రీలు కూడా వున్నారు. ఇంతకాలం ఒంటరిగా కృషిచేసిన డామియన్ కు వీళ్ళరాక 'మంచి సమరేయుల రాక' అనిపించింది. వీరిలో ఫాదర్ ల్యాంబర్ మొదటివాడు. ఆస్ట్రేలియా నుంచి బ్రదర్ జేమ్సు రెండవవాడు. సిడ్నిలో మొలకాయ్ దీవిని గురించి విన్న వెంటనే స్టీమరులో బయలుదేరి వచ్చాడు ఈయన. 3వ వ్యక్తి కాథొలిక్ ఫాదర్ వెండిలిస్ మోయల్లర్స్. నవంబరులో మదర్ మరియాన్నె, మరి ఇద్దరు సిస్టర్సు కూడా వచ్చారు.

ఈ క్రొత్త సహచరులరాక వలన ఆయన చివరిరోజులు కాంతి వంతమయ్యాయి. ఆయన కలలు ఫలించబోతున్నాయని పిస్తుంది. భూగోళం అన్ని భాగాల నుంచి కానుకలు, బహుమతులు అందుతున్నాయి. ఇప్పటికి ప్రపంచం ఈ రోగుల అవసరాలకు గుర్తించిందన్నమాట. ఇంగ్లాండ్ నుంచి ఒక మత బోధకుడు అన్ని తెగలవారి నుంచి పోగుచేసిన మొత్తం దాదాపు వెయ్యి పౌనుల చెక్కు పంపాడు. హోనొలూలులోని వ్యాపారి ఒక బాలికలు స్త్రీల వసతి భవనానికి సరిపడే డబ్బు విరాళం ఇచ్చాడు. ఇలా అలా ఎంతోసహాయం రాసాగింది దశాబ్దాల నిర్లక్ష్యం పిమ్మట.

కలువపాపలో క్రొత్త బాలికల గృహం స్థాపించాలి. సిస్టర్సు పర్యవేక్షణలో మరురోజు నుంచి పనులు ప్రారంభించారు. రోగులకు సున్నితంగా కట్టుకట్టడం. ఇళ్ళకు వెళ్ళి చూడటం మొదలు పెట్టారు., పరిశుభ్రత, పారిశుద్ధ్యం గురించి ఆరోగ్య సూత్రాలు పాటించి జాగ్రత్త వహించేవారు.

చిత్రకారుని యాత్ర :

క్రిస్ట్ మస్ పండుగకు కొద్దిరోజులు ముందుగా ''ఎడ్వర్డ్ క్లిఫర్డ్ అనే అంగ్లేయ చిత్రకారుడు ఈ దీవికి వస్తూ చాలా పెట్టెలు తెచ్చాడు. అందు కొన్ని కానుకలూ, బహుమతులూ, అండమాన్ దీవుల్లో పెరిగే గర్జం చెట్టు తైలం లెప్రసీ వ్యాధి చికిత్సకు పనికి వస్తుందనే ఆశతో తీసుకువచ్చాడు.

అతని దృష్టి సునిశితంగా వుండేది. లెప్రసీ రోగులను చేరవేసే స్టీమరులో రావడానికి నిరాకరించాడు. వాళ్ళను తన సామాను మోయనీయలేదు. ఆయన ప్రొటెస్టెంటు , కాథొలిక్కుల పనులను అనుమానంగా చూసేవాడు. కాని ఆ దీవిలో ఉన్నంతకాలమూ డామియన్ గదిలోనే ఉన్నాడు. తన యాత్రలో ప్రతి విషయాన్ని వ్రాసుకున్న ఈ చిత్రకారుడికి డామియన్ లో ఏలోపము కానరాలేదు. బయట కూర్చొని చిత్రాలు వేసుకునేవాడు. ఆయన రంగులు, కుంచెలు పెన్సిళ్ళు అక్కడి పిల్లలకు వింతగా వుండేవి. పండుగనాడు వినోదాలతో కాలక్షేపంచేశాడు. అవిటిరోగులు వాయిద్యాలు వాయిస్తుంటే తాను పాటలు పాడసాగాడు. ఆ తరువాత వాద్యగాళ్లందరుకూ బహుమతులు పంచాడు. ఆ రాత్రికి ప్రొజెక్టరులో స్లయిడులు వేస్తూ, రోగులకు బయట ప్రపంచంలోని వింతలు చూపుతూ వినోదం కలిగించాడు. డిసెంబరు చివరిరోజున వెళ్ళబోతూ ఫాదర్ ను ఆటోగ్రాపు అడిగాడు. డామియన్ అప్పటికే కలం పట్టుకోవడానికి చాలా శ్రమ పడవలసివస్తుంది. ''నేను జబ్బుతో ఉన్నాను. నీవు నన్ను చూడవచ్చావు'', అని వ్రాసి సంతకం చేశాడు. రోగులందరూ క్లిఫర్డ్ కు వీడ్కోలు ఘనంగా చెప్పారు.

జ్యోతి ఇక లేదు :

డామియన్ 49వ పుట్టినరోజు దాటి పోయింది. ప్రశాంతంగా మరణానికి సిద్ధమవుతున్నాడు. ''నాకు ఏ నీడాలేనపుడు, మొదట్లో ఉన్న చెట్టునీడకే చేర్చ''మని అడిగాడు,

జీవితంలో ఈ చివరి కొద్దినెలలే ఆయనకు, ఆనందంగా వున్నాయి. తాను చేసని పనులన్ని కొనసాగుతాయని నమ్మకం కలిగింది. చివరిక్షణాల కొఱకు

గంభీరంగా, ప్రశాంతంగా, తృప్తిగా వేచియున్నాడు. తనకు వున్న కొద్ది వస్తువులను బిషప్ కు స్వాధీనం చేయమని వీలునామా వ్రాశాడు. 'నాస్వంతం అనేది ఏమిలేకుండా ఒక పేదవాడిలా చనిపోవటం వల్ల చాలా సంతోషంగా ఉంటుంది.' అన్నాడు.

బెల్జియంకు కడసారి ఉత్తరం వ్రాశాడు కుటుంబ సభ్యులనూ, మతస్థులను అడిగినట్లు తెలుపుతూ, 1889 మార్చి మొదటి వరకూ తానే ప్రార్థనలు నిర్వహించేవాడు. ఇక శరీరంలో ఏ మాత్రం శక్తి లేక మానుకోవలసి వచ్చింది. మరణశయ్య మీద వుండి కూడా జడంగా ఉండటానికి ఇష్టపడే వాడు కాదు. ప్రతి ఉదయం చాప బయట వేయించుకొని కొంతసేపు పడుకునేవాడు. రోగులు వచ్చి చూసి పోతుండేవారు. వాళ్ళను నవ్వస్తుండేవాడు. సాయంత్రానికి మళ్ళీ లోనికి పట్టేవాళ్ళు.

గతజ్ఞాపకాలు అప్పుడప్పుడు గుర్తుకు వస్తుండేవి. కాలనీలోని మొదటి రోజుల గురించి చెపుతుండేవాడు. అప్పుడున్న రోగులు ఇప్పుడు లేదు. త్వరలోనే నేను కూడా వాళ్ళను చూడటానికి వెళుతున్నాను అనేవాడు. ట్రెమెలూ గురించి చెప్పేవాడు, ఆయన కావాలని కోరుకుంటే జానపద సంగీతం వినిపించడానికి సిద్ధంగా ఉండేవారు అక్కడి రోగులు.

ఎన్నడు లభించునో, నాకు
ఎప్పుడు లభించునో నాకు
దేవుని సన్నిధి
ఎన్నడో ఎప్పుడో
ఈ వింత భూమిపై ఎన్నాళ్లింకా
బందీగా ఉండాలో, నేను
ఎపుడు వచ్చునో నాకు మోక్షము

• * * *

అనేపాట ఆయన కిష్టము.

'నీ శాలువాను మా కివ్వు ' అని అడిగాడొక యువ బోధకుడు. వ్యక్తి ఆరాధన నచ్చని డామియన్ అది 'నీకెందుకు పనికి వస్తుంది! అది లెప్రసీ వ్యాధితో నిండి పోయింది' అని జవాబు చెప్పాడు.

12-4-1889 పాయ్ ఆదివారంనాడు చివరిసారిగా పరిశుద్ధదైవ ప్రసాదము ఇవ్వబడింది. ఇక ఎంతో సేపు జీవించడనే వార్త తెలిసి, అందరూ ఆత్రుతగా ఇంటి చుట్టు పోగయారు. స్పృహలేదు , కాని కొనఊపిరి వుంది. అపుడపుడు బలవంతంగా, భారంగా కళ్ళు తెరచి చూచేవాడు. కనిపించిన వాళ్ళను చూచి ఎక్కడో గుండెలోతుల నుంచి నవ్వేవాడు. క్రమంగా ఇహలోక వస్తువులు, ప్రాణులు కనిపించడం తగ్గింది. తన పాదాల వద్ద ఏవో రెండు ఆకారాలు ఉన్నాయన్నాడు.

చీకటి పడింది. క్రొవ్వువత్తులు వెలిగించాడు. తెల్లవారు జాముకు ఫాదర్ అంతిమ శ్వాస విడిచాడు. ఏ పోరాటము లేకుండా ప్రశాంతంగా , గాఢ నిద్రలాగా మృత్యువు ఆయనను కబళించింది. బ్రదర్ డట్టన్, ఫాదర్ వెండ్లిస్ లు శోక సముద్రంలో మునిగి విలపించే రోగుల్ని ఓదార్చాలని విఫల యత్నం చేశారు.

అంగీని ధరింప చేసారు. శవపేటికకు లోపల తెల్ల సిల్కుగుడ్డ పరిచారు. పైన నల్ల గుడ్డపై తెల్ల శిలువను కుట్టారు సిస్టర్సు, చల్లని పాండనస్ చెట్టుక్రింద సమాధి త్రవ్వారు. ఎన్నోవందల శవ సంస్కారాలు చేసిన ఆ మహనీయుని భౌతిక కాయాన్ని చూస్తూ చుట్టుముట్టసాగారు విషాదవదనాలతో ఆయన ప్రజలు, వాళ్ళమిత్రుడు, సహచరుడు, 'కామియానో' భౌతికంగా కూడా వారి మధ్యలేడు. సమాధి పూడ్చిన పిదప కూడా వారు ఆ చోటు వదలి వెళ్ళలేక పోతున్నారు. రొమ్ములు బాదుకుంటూ 'ఆ.....ఈ.....' అని రోదించసాగారు.

సంస్మరణ :

ఆయన చనిపోయినా ఆయన చేతులతో కట్టిన, చిన్న ఫిలోమినా చర్చి, గంట మ్రోత ప్రపంచమంతా వినిపించేలాగా ప్రతి ధ్వనించింది. డామియన్, మొలకాయ్ పేర్లు దేశ దేశాలలో మార్మోగాయి. పత్రికలు ప్రజలు సానుభూతితో

సామూహిక విషాద గీతాలు పాడారు. మతము, శాఖ బేధాలు మరచిపోయారు. అన్ని జాతులవారూ, ఏ జాతికానివారు అంతా ఏక కంఠంతో ఆ మ........నికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన అసాధారణ వీరుడు, త్యాగమూర్తి....

ఏదో ఒక కోర్కెతోనో, ఆశయంతోనో ప్రతివారూ చనిపోవడానికి సిద్ధమవుతారు. అది తన స్వంత లాభానికో, ఆనందానికో దేనికొరకో కావచ్చు. యుద్ధ రంగంలో మరణం అంటే వీర సైనికునికి భయంలేకపోవచ్చు. కాని ఉహించవీలులేని, వర్ణించనలవిగాని, దుర్భరమైన దారుణ పరిస్థితులలో శుష్కించి వీలులేని శుష్కించి కుళ్ళి చచ్చిపోవడానికి తనకు తానుగా అంకితం చేసుకోవడం అమర వీరులకు మాత్రమే సాధ్యము అన్నది డైలీ న్యూస్ పత్రిక లండన్ నుంచి.

సుడితిరిగిన ప్రపంచసానుభూతి పత్రికా పత్రికా ప్రశంసలతో ఆగిపోలేదు. డామియన్ చనిపోయినా ప్రపంచంలో ఇంకా ఎన్నో లక్షల మంది లెప్రసీ రోగులు దుర్భరంగా, హీనంగా జీవిస్తూ వున్నారు. ఇండియా, ఆఫ్రికా దేశాలు, చైనాలలో కూడా ఈ వ్యాధి బాగా పెరిగిపోతుంది. మానవతా వాదులు, సంఘ సేవకులు ఎన్నాళ్ళనుంచో ఈ విషయాలను తెలియచేస్తూనే ఉన్నారు. కాని డామియన్ మరణంతో వీరి మాటలు ప్రజలకు వినిపించసాగాయి. ఒక్కసారిగా ప్రజా చైతన్యం పెల్లుబికి ప్రభుత్వాల జడత్వాన్ని పారదోలింది.

కార్యరంగం :

డామియన్ మరణించినా ఆయన కథ ముగియలేదు లెప్రసీ రోగుల జీవితాలను ఆనందమయం చేసేఉద్యమానికి పుట్టుక అయింది ఆయన మరణం. ప్రతి దేశంలో సభలూ, సమావేశాలూ ఏర్పరిచారు. కమిటీలు ఏర్పడ్డాయి. వైద్యశాలలు వెలిశాయి. వైద్యులు వచ్చారు. ఈ రోగులకు సౌకర్యాలు కలిగించడానికి. లండన్ లో ప్రిన్స్ ఆఫ్ వెల్సు (తరువాత ఏడవ ఎడ్వర్డు ప్రభువు) ఒక విశిష్ట సమావేశంలో ఇలా అన్నారు.

"ధైర్య, సాహసాలతో నిండిన ఫాదర్ డామియన్ జీవితమూ, మరణము పట్ల యునైటెడ్ కింగ్ డమ్కు సానుభూతి కలగడమే కాకుండా, మన

సామ్రాజ్యంలో భాగమైన ఇండియాలో మిగతా ప్రాంతాలలో రోగులకు ఆయన అడుగుజాడలలోనే మనం కృషి చేయవలసిన ప్రేరణ కూడా కలిగించింది.

భిన్న రంగాలలో ప్రముఖులయిన శ్రోతలు కరతాళ ధ్వనులు చేశారు. తనసానుభూతి సూచకంగా ఇంగ్లాండు మూడు కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించారు.

1. మొలకాయ్ దీవిలో డామియన్ స్మారక చిహ్నం ఏర్పాటు చేయడం.
2. డామియన్ ఇన్ స్టిట్యూట్ ను స్థాపించి ప్రధానంగా లెప్రసీ వ్యాధిని గురించి అధ్యయనము చేయడం.
3. బ్రిటిషు సామ్రాజ్యంలోని ఇండియాలో , తదితర చోట్ల వున్న లెప్రసీ రోగుల స్థితి గతులను క్షుణ్ణంగా పరిశీలించి ఒక కమీషను ద్వారా అభివృద్ధి పరచే మార్గాలను తెలుసుకోవడం.

తీర్మానాలను వదలివేయక విశ్వసనీయండా వాటిపి కొనసాగించారు. బ్రిటిషు యుద్ధ నౌకద్వారా అందంగా చెక్కి నగిషీలు దిద్దిన ఒక రాతిశిలువను ఆ ఏడేహోనొలూలుకు పంపారు. హవాయి దేశ రాజు మొలకాయ్ వెళ్ళి మదర్ మేరియాన్నె సహాయంతో దానిని ఒక చోట దించి అక్కడ స్థాపించారు. ఈనాటికీ అది అక్కడ వుంది. దాని పీఠంవద్ద తెల్ల చలువరాతి ఫలకం పైన ఇలా చెక్కి వుంది.

''మిత్రుల కొరకై ప్రేమతో ప్రాణాలనే విడిచిన వారిలో ఇంతకు మించిన వారు లేరు.''

* *   * *   * *

క్రీ నీడలు :

ప్రశంసల కాంతికిరణాలే కాదు. విమర్శల క్రీనీడలూ ఉన్నాయి. ఆస్ట్రేలియా నుంచి ఒక మిత్రుడు హోనొలూలు లోని ఛార్లెస్ హైడ్ అనే దైవ సంఘపు పురోహితుడిని ఉత్తరంలో అడిగాడు. ''డామియన్ ఇంత త్వరగా అందరికి తెలయడం ఎందువలన జరిగింది!'' అని.

అందుకు హైడ్ జవాబు

హోనొలూలు,
2 ఆగస్టు, 1889

''పత్రికలవారు ఆయనొక పుణ్య పురుషునిగా, మహనీయునిగా పొగుడుతూ వ్రాసిన అతిశయోక్తులు చూస్తుంటే ఆయనను ఎరిగిన మేము ఆశ్చర్యపోతున్నాము.

అసలు నిజం ఏమిటంటే అతనొక మొరటు, మురికిమనిషి, తలబిరుసువాడు, అనారికుడు, అసలతన్ని మొలకాయ్ పంపలేదు. ఉత్తర్వులు లేకుండా తానే వెళ్ళాడు. అతనికి జబ్బు రాకముందు రోగులతో కలసివుండేవాడు కాదు. ఇష్టంవచ్చినట్లు దీవి అంతా తిరుగుతుండేవాడు. ఈ ద్వీపంలో సగం ప్రాంతంలోనే రోగులుండేవారు. తరచుగా హోనొలూలు వస్తుండేవాడు. దీవిలో జరిగిన సంస్కరణలకుగాని, అభివృద్ధికిగాని అతని కృషి ఏమిలేదు. అదంతా హెల్త్ బోర్డు వారివల్ల జరిగినదే. పైగా అతనుస్త్రీల విషయంలో అంత పవిత్రమైన వాడేమికాదు. అతనికి జబ్బురావడానికి ఈచెడు అలవాట్లు, నిర్లక్ష్యమే కారణాలు అయివుంటాయి. మా మంత్రులు, ప్రభుత్వడాక్టర్లు మొదలయినవారే ఈరోగులకు చాలా సేవ చేశారు.

ఈ ఉత్తరం చదివిన మిత్రుడు దాన్ని సిడ్నిలోని ఒక మతపత్రికకు పంపించాడు. అనుకోకుండా దాన్ని ప్రసిద్ధ ఆంగ్లకవి, రచయిత రాబర్ట్ లూయీ స్టీవెన్ సన్ చూడటం జరిగింది.

హైడ్ డామియన్ ను కలిసిన వ్యక్తి. ఆయన మరణించడానికి నాలుగేళ్ళ ముందుగా ''హవాయిస్ గెజట్'' పత్రికలో డామియన్ గురించి పొగడుతూ'' 1873లో మొలకాయ్ దీవులకు వెళ్ళి కాథొలిక్కు రోగుల ఆధ్యాత్మిక సంక్షేమం కొరకు విజయవంతంగా కృషిచేస్తున్న సహృదయుడు'' అని వ్రాశాడు హైడ్.

మరి ఈ నాలుగేళ్ళో ఏం జరిగింది! అపుడా ప్రశంస! ఇపుడీ నింద!! ఎందువల్ల! డామియన్ వ్యాధిగ్రస్థుడై, అశక్తుడై క్రమంగా శుష్కించి చనిపోయాడుగదా ! మరి ఈ మధ్య కాలంలో ఏం జరిగివుంటుంది!

గతంలో జరిగింది :

డామియన్ చనిపోయిన కొద్ది కాలానికే స్టీవెన్ మొలకాయ్ దీవులకు వెళ్ళి ఎనిమిది రోజులు అక్కడవుండి వచ్చాడు. అందులో ఎక్కువ భాగం కలువపాప గ్రామంలోనే గడిపాడు. అక్కడి సిస్టర్సుతో, సహాయకులతో పరిచయం, స్నేహం, ఏర్పడ్డాయి. క్షయ వ్యాధివల్ల ఆయన ఆరోగ్యం బాగుండేది కాదు. మదర్ మేరియానా ఆయనను హెచ్చరించేది. ఎక్కువ అలసట వచ్చేలాగ శ్రమిస్తే ప్రమాదమని ఆయన నవ్వి ఊరుకునేవాడు రోగుల పిల్లలతో కలసి ఆడుకునేవాడు. వారితో పరిగెత్తి, అలసి పోయి రొప్పుతూ పడిపోయేవాడు. ''చెపితే వినడు. సరయిన వైద్యములేని ఇక్కడ రక్తము వాంతి అయితే మనం ఏం చేయగలం! తన ఆరోగ్యాన్ని కూడా లెఖ్కచేయకుండా తాను వెళ్ళే లోపలే పిల్లలకు ఆటలు నేర్పి వెళ్ళాలని పట్టుదల'' అనేది మదర్.

ప్రజాదరణ పొందిన కథానాయకులను, ప్రముఖులను, ఒక కంట కనిపెట్టి వుండటం స్టీవెన్ సన్ స్వభావం. వెలుగులోకి వచ్చిన డామియన్ ను గురించి నిశితంగా విచారించాడు. కాథొలిక్ సాక్ష్యాలను ప్రమాణాలను లెఖ్కలోనికి తీసుకోలేదు. డామియన్ ను గుడ్డిగా ఆరాధించే వాళ్ళను, సన్నిహితంగా వున్న వాళ్ళను అడగలేదు. ఆయనతో పోట్లాడిన వారిని అభిప్రాయ భేధాలున్న వాళ్ళను ఆయనను వ్యతిరేకించిన ప్రొటెస్టెంట్లను విచారించారు. స్టీవెన్ సన్ కు ప్రాంతీయ భాష తెలియదు. కాని ఆయనకు ఆ దీవిలో ఆతిథ్యం ఇచ్చినవారు, అక్కడకు

రావడానికి వీలు కలిగించిన వారు ఎక్కువమంది డామియన్ కు వ్యతిరేకులే. సంవత్సరాల తరబడి డామియన్ వీరికి శత్రువు. డామియన్ మరణించి హీరో కావడంతో ఆయన శత్రువులంతా విలన్ లు అయారు. వారు చెప్పడానికి కూడా డామియన్ లో అంత చెడు ఏమి లేదు.

అందరూ ఆయనలోని ప్రముఖ లక్షణాలను అంగీకరించారు. కానీ తలబిరుసు వాడనీ అధికారము చలాయించేవాడనీ గొణుగుకునేవారు. డామియన్ మురికి బట్టల గురించి ఫిర్యాదు చేసేవారు ఒక్క విషయం గమనించాలి. ఆయనతో ఒక్కపూట తిరిగి ఆయన చేసే పనిని చూసిన వారికి తెలుస్తుంది. బట్టలు ఎందుకు మురికి అవుతున్నాయెు! 'అమాయకుడు, విద్యావంతుడు కాదు.'

ఆయన పండితుడో, గొప్ప పాఠకుడో కాని మాట నిజమే. ఆయన వృత్తివల్ల, పనులవల్ల ఇది వీలుకాలేదు. అయినా ఆయనను విశ్వ 'విద్యాలయ మనిషి' అనుకోవచ్చు. మాతృభాష ఫ్లెమిష్ కాక లాటిన్, గ్రీకు లలో బాగా పరిచయం వుంది. ఫ్రెంచి, ఇంగ్లీషు, జర్మన్, హవాయియన్ భాషలు ధారాళంగా మాట్లాడేవాడు. ఆయనతో సరితూగ గలవారు చాలా తక్కువ మంది వుంటారు.

స్టీవెన్ సన్ అన్ని శ్రద్ధగా విన్నాడు. అభిమానులు, మతస్థులు చెప్పింది దూరంగా వుంచి తన నిర్ణయం తాను తీసుకొని ఒక అభిప్రాయం ఏర్పరచుకొన్నాడు. ఒకోసారి ఆయన చూసిన దృశ్యాలు ఆయనను ఏడిపించేవి. ముఖ్యంగా వ్యాధి పాలయిన పిల్లలను చూసి ఆయన హృదయం ద్రవించేది. వారికి సేవచేసే వారిని అభిమానించేవాడు.

దీవులు వదలి రాబోయే ముందుగా పిల్లలకు చాలా బహుమతులు ఇచ్చాడు. వారి శరణాలయానికి ఒక పియానో గూడ ఇచ్చాడు. అక్కడి సిస్టర్సు ఆయనను ఆటోగ్రాఫు అడిగారు. ఆయన ఒక గేయమే వ్రాసి ఇచ్చాడు.

గౌరవ సోదరి మరియానా
బిషప్ హోం రక్షకురాలా,
ఇక్కడ, అనంతమైన జాలిని గొలిపే

అవిటి చేతులూ, కాళ్ళూ, వికృత ముఖాలూ,
అమాయకపు బాధితుల ఆఖరి నవ్వులూ
చూస్తుంటే అనిపించిందో వెర్రివాడికి
'భగవంతుడే లేడు' అని.
కాని సరిగా చూస్తే
బాధా తప్త హృదయంలో నుంచి
పెల్లుబుకుతుంది సౌందర్యం
ఈ బాధామయ తీరాలలో
కనిపిస్తారు 'సిస్టర్సు'.
తెలివి తక్కువ వాడు కూడా
మరోమాట అనలేదు.
వారిని అభిమానించడం తప్ప

తరువాత ఏడాది ఆయన ఆస్ట్రేలియా వెళ్ళాడు. అపుడు అక్కడ డామియన్ ను నిందిస్తూ హైడ్ వ్రాసిన ఉత్తరాన్ని ఆయనకు చూపారొకరు.

అది చూడగానే భరించలేనంత కోపం వచ్చిందాయనకు, తలబాదుకుంటూ గదిలోకి వెళ్ళి, తలుపులు మూసుకుని, పెద్దగా గొణుగుతూ, వ్రాసుకోసాగాడు.

ఆయనకు హైడ్ కూడా తెలుసు. అతని ఆతిధ్యం కూడా స్వీకరించాడు స్టీవెన్ సన్. కానీ స్టీవెన్ సన్ మొలకాయ్ కూడా వెళ్ళాడు. ఆయనకు ఇద్దరూ తెలుసు, అందుకే ఒకరిని గూర్చి మరొకరికి వ్రాశాడు ఉత్తరం. ఆనాడు ఆయన వ్రాసిన ఉత్తరం డామియన్ కు ఒక ఉత్తమ స్మారక చిహ్నం. మరే శిలాఫలకమొ మహానిర్మాణమొ, ఇవ్వలేని సాక్ష్యం ఆయన కలంనుండి వెలువడిన అక్షరమాల, అది వాడదు, ఎండదు, సువాసనలను గుభాళిస్తుంది.

సిడ్ని,
25-2-1890

హైడ్ గార్కి,

నేను మీకు గుర్తుండే ఉంటాను, నాకు మీరు చాలా సహాయాలు కూడా చేశారు. అందుకు కృతజ్ఞుడిగా ఉండటానికి నేను సిద్ధంగా ఉన్నాను. కాని కర్తవ్యాలు అందుకు అడ్డుగా వస్తున్నాయి. నేరాలు పరిచితులను, మిత్రులను కూడా దూరం చేస్తాయి.

ప్రపంచమంతటా మానవాళి అభిలషించే నీతివంతమైన జీవితం దృష్ట్యా డామియన్ ను సమర్థించాలి. మిమ్మల్ని, మీ లేఖను వాటి సహజ రంగుల్లో ప్రదర్శించాలి. ప్రజలకు ఎత్తిచూపాలి.

అంతటి మీ అసాధారణ లేఖకు తగురీతిన జవాబు చెప్పాలంటే కొన్ని వ్యక్తిగత విషయాలు ఉదహరించక తప్పదు. నేను మిమ్మల్ని మర్యాదకు అందనివారుగా, అధోగతిలోఉన్న మనిషిగా భావిస్తున్నాను. నా జవాబు మీ మిత్రులకు బాధ కలిగించవచ్చు. కాని నాబాధతో పోలిస్తే వారిది ఎన్నో వంతు! అయినా కుటుంబానికి చెడ్డపేరు వచ్చేది నేరస్థుడి వల్లనే గాని ఉరితీసే వాడివల్లకాదు.

మీ శాఖ మిషనరీలు హవాయి దీవులలో సేవచేయడానికి వచ్చిన అరుదయిన అసాధారణమైన అవకాశాన్ని వుపయోగించుకో లేకపోయారు. మీరు ఎంతవరకు, ఎందుకు విఫలమయ్యారో చర్చించడానికి ఇది వేదిక కాదు, ఒక్క సంగతి మాత్రం సూటిగా చెప్పక తప్పదు. 'సువార్త పిలుపు' పేరున ధనవంతులైనవారు మాత్రం చాలామంది వున్నారు. అందులో మీరొకరు. మిషనరీల భోగలాలస జీవితాల గురించి, సుందరభవనాల గురించి మీ హోనొలూలు వీధులలోనే ఎగతాళి చేస్తుంటారు. అక్కడ నా గుర్రపు బండి వాడు కూడా మీ ఇంటిని విమర్శించాడు. మీరొక విషయం గమనించాలి. వుత్తములను దిగజార్చి మీ స్థాయికి చేర్చాలని ప్రయత్నిస్తున్నారు.

మీరు వాడిన సమాసం నాకు ఎంతో నచ్చింది. అందుకని నేను కూడా దాన్నే వాడుతున్నాను. ''అనుకొని తీరాలి'' మీరు డామియన్ జీవించిన ప్రదేశాన్ని గాని, మరణించిన చోటుగాని చూడలేదని ఒక వేళ మీరు చూసివుంటే, వాటిని గుర్తుకు తెచ్చుకుంటూ, ఆహ్లాదకరమైన మీ ఇంటి గదుల వైపొక సారి చూస్తే చివరకు మీ కలం గూడా వ్రాయలేక ఆగివుండేది.

మీ పూర్వీకులు హోవాయి దీవుల వారికి ఏ చెడూ చేసి వుండకపోవచ్చు, ఐశ్వర్యవంతులయిన మీ శాఖవారూ, దానికి అలంకారప్రాయులైన మీరు అక్కడివారికి సేవచేసే అవకాశం వచ్చింది. కానిమీరు జారవిడుచుకున్నారు. ఆనాటి మీ జడత్వం ఒక వంక, డామియన్ చొరవ, శౌర్యమూ, ధృఢ నిర్ణయమూ మరొకవైపు. పట్టుపరుపులపై పరున్న మీకు గడచిన 'కాలం తిరిగి రాదు' అని అంతరాత్మ చెప్పి వుంటుంది. వైషమ్యం వల్ల కలిగిన ప్రేరణలో, ఈర్ష్యతో ఉత్తరం వ్రాసి ఉంటారు. అవును ఈర్ష్య అంత కంటే మిమ్మల్ని అభినందించలేను.
హైడ్ గారూ,

మనం విఫలమయి, మరొకరు సఫలమయితే, మనం ఉన్న చోటేవుండగా మరొకళ్ళు మనను దాటి ముందుకు వెళితే మనం సుందర భవనాల్లో శరీరాలు పెంచుకుంటూ, కూర్చోగా ఒక సాధారణ రైతు మురికి గుడ్డలున్న ఒక మామూలు వ్యక్తి దేవున కళ్ళ ఎదుట జరిగే పోరాటంలో బాధితులకు సేవలు చేస్తూ, మృత్యు ముఖంలోని వారిని ఓదారుస్తూ చివరకు ఆయన గూడా వ్యాధికి గురయి, వ్యాధితోనే మరణించి-గౌరవం పొందుతుంటే ఆసూయ గానే వుంటుంది. కానీ మీ ఉద్రేకం కోరుకుంటున్నట్లు మళ్ళీ మళ్ళీ వచ్చేపోరాటం కాదది. మీరు చిత్తుగా ఓడిపోయారు. అందుకు గుర్తుగా మీకు మిగిలింది సాధారణ గౌరవం.

'సాధారణ గౌరవం' అంటే ఏదో మంచిపని చేసినందుకు కాదు. ఏ చెడు చేయకుండా ఉన్నందుకు, సోమరిపోతులంతా ఇందుకు అర్హులే, అదే మీకు మిగిలింది.

మనందరం డామియన్ లం కాము. కాలేము. కాని మీరు మౌనంగా ఉంటే బాగుండేది. కాని తీవ్రమైన ఓటమిని పొంది, మీ భోగభాగ్యాల మధ్య విలాసమైన గదిలో కులుకుతూ కూర్చొని అపకీర్తిపాలయి. 'కలావు' పర్వత శిఖరాల క్రింద చెమటోడ్చి కష్టపడి, పందుల గుడిసెలో వుండి క్రుళ్ళిపోయి కృశించి, అభినందనల కీర్తికిరీటం అందుకున్న ఫాదర్ డామియన్ పై వదంతులు పోగుచేసి ప్రచారం చేయాలనుకున్నారు. భూగోళంపై మనిషెవరూ చేయలేని సాహసించలేని నీచమైన పనిని మీరు చేశారు.

'పందుల గుడిసె' అంటే ఎగిరి పడుతున్నారనుకుంటాను. అది కూడా అతిశయోక్తే. అయన నివాసం అంతకంటే ఆధ్వాన్నంగా వుండేది.

ఈ దీవిలో సగం ప్రాంతంలో మాత్రమే లెప్రసీ రోగులుంటారు అన్నారు.

అలాగా! అసలు మీరా దీవిని చూశారా! కాళ్ళు చాపుకొని ఇంట్లో విశ్రాంతిగా కూర్చొన్న మీకు దాని స్వరూపం తెలుసా! అది ఎక్కడవుందో పటంలోనైనా చూపించగలరా! నేను ఆ దీవులకు వెళ్ళాను. చూచాను ఏడు రాత్రుళ్ళు ఎనిమిది పగళ్ళూ అక్కడే వున్నాను. ఆస్థితిగతులు చూసి నిగ్రహించుకోలేక ఏడ్చాను.

మనలాంటి మామూలు మనుషులే రోగులుగా మారి వర్ణించ వీలులేనంత వికారంగా ఉన్నారు. అక్కడి ప్రతి నాలుగు ముఖాలలో ఒకటి వికృతమైనదే. ఆలోచనలు జ్ఞాపకాలు, ఉఛ్వాస, నిశ్వాసాలు వుండి కూడా గుర్తించే విధంగా లేని మాంసపు ముద్దలుగా వున్న మనుషులు అక్కడి ఆసుపత్రిలో ఉన్నారు. మీరు ఆ దీవి చూచినట్లయితే ప్రకృతి మీలో కూడా ప్రవేశించి మీ శిలాహృదయాన్ని ద్రవింపచేసేది. ఏ భయంకర పీడకలలోనో తప్ప అలాటి దృశ్యాలు మీరు చూసి ఉందరు. రోగుల వసతి గృహంలోని జీవితు తలచుకుంటేనే మన నరాలు కుంచించుకు పోతాయి! ఆ దీవి ఈ రోజుకు గూడా నరకమే. వాళ్ళ జబ్బు అంటుకుంటుందని భయం వల్ల కాదు. అక్కడి బాధ జాలి, నిరాశలతో పోలిస్తే

జబ్బు భయం ఏ మూల! ఆ దృశ్యాలు హృదయాన్ని నలగగొట్టేవి. పిండి చేసేవి. రంపపు కోత కోసేవి. నేను చూసిన ప్రాంతాలలో అతి నికృష్టమైనది అది.

అయితే నేను చూసింది కూడా డామియన్ కృషి వల్ల, తరువాత అభివృద్ధి చేయబడిన ప్రాంతం, క్రొత్తఇళ్ళు, ఆసుపత్రి, బిషప్ వసతి గృహం, సిస్టర్సు డాక్టరు, మిషనరీలు అంతా వాళ్ళ వాళ్ళ పనులు చేసుకుంటున్నారు. ఇపుడు ఊహించుకోండి ఫాదర్ డామియన్ వచ్చిన మొదటి రోజున ఆ దీవి ఎలావెండేదో! క్రుళ్ళిపోతున్న సోదర మానవుల మధ్య తాను కట్లు కట్టవలసిన మొండి కాళ్ళూ చేతులను, పుండ్లను తలచుకుంటూ, క్రిమికీటకాలతో కలసి చెట్టు క్రింద పడుకున్న మొదట రోజు.

''ఈ దీవిలోకి క్రొత్తగా వచ్చిన ప్రతిరోగి విషాదరాగాలాపనకు పై మెట్టు అవుతుండగా, మానవ బాధంటా తన చుట్టూ ఒక్క చోటనే కుప్పపోసినట్టుంది: ఏ డాక్టరుగాని: నర్సుగాని సంఘసేవ కుడుగాని, ఇలా విరామం, విశ్రాంతి, వినోదం లేకుండా నరకంలోకి వచ్చి బయటకు వెళ్ళకుండా ఉండిపోగలరా! ప్రపంచంలో మరెవరయినా ఆయనకు సాటి రాగలరా !

డామియన్ యధార్థంగా రైతుబిడ్డ. ముక్కు సూటిగా మాట్లాడేవాడు. అమాయకుడు, మొరటుగా ఉండేవాడు. కాని కల్లాకపటం తెలియని ఉదారస్వభావుడు. త్యాగశీలి, అతని వంటి మీద బట్టనైనా, అతని జీవితాన్నైనా త్యాగం చేయడానికి వెనుకాడలేదు. అధికారం చలాయిస్తూ, పక్షపాతం లేకుండా వుండేవాడు కావటంతో సహచరులకు ఇబ్బందికరంగా ఉండేవాడు.

అతని కతడే దీటయిన అమరవీరుడు. ఇక్కడ వుండి, చూసినవారు మాత్రమే ఆయన గొప్పదనాలను సరిగా వర్ణించగలరు.

ఈ పై వాక్యాలు గతంలో నేను వ్రాసుకున్న నా డైరీ లోనివి. ఆయన సుగుణాలు, జీవితాంశాలు, నాకూ, ప్రపంచానికి సమృద్ధిగానే తెలుసు.

సరే, మీ ఉత్తరంలోని కొన్ని వాక్యాలను నిశితంగా పరిశీలిద్దాం.

''డామియన్ మొరటు మనిషి''

సహజమే, ఆ దీవిలోని రోగులకు డామియన్ వంటి రైతుబిడ్డ మాత్రమే మిత్రునిగా, సంరక్షకునిగా దొరికినందుకు జాలిపడదాం. సానుభూతి చూపుదాం. మీలాంటి సంస్కారవంతుడు నాగరికతను పంచిపెడుతూ, చిరునవ్వులతో వారిని ఆనందపరచడానికి అక్కడికి ఎందుకు వెళ్ళలేదు! అపొస్తులుడయిన జాన్ మామూలు మనిషేగదా! పీటర్ గూడా మొరటు జాలరివాడే! మరి వారిని పునీతులు గానే అనుకుంటున్నామే.

''డామియన్ మురికి మనిషి''.

అవును. ఆ మురికి మనిషి వల్లనే రోగుల బాధలు ఎన్ని తగ్గాయో ఆలోచించండి. కాని పరిశుభ్రమైన డాక్టర్ హైడ్ మాత్రం తన సువిశాల సౌధం లో విందులారగిస్తున్నాడు.

''డామియన్ తలబిరుసువాడు.''

ఇదీ నిజమే. అందుకు భగవంతునికి మనం కృతజ్ఞతలు చెప్పుకోవాలి - ఆయన తలే కాదు హృదయం కూడా బిరుసైనదే అయినందుకు.

'గ్రుడ్డి నమ్మకస్తుడు'

అవును ఆయన తన మతాన్ని త్రకిరణ శుద్ధిగా నమ్మి, చెప్పి, ఆచరించినవాడు. పసిపాపలా నిష్కల్మషంగా నమ్మాడు. ఆ విశిష్ట వ్యక్తి త్వ లక్షణం వలననే ఆయన జీవితం ఆఖరుకు మీ కలానికి, నా కలానికి వ్రాయడానికి విషయమై పని కల్పించినది. ఆతని ప్రగాఢ విశ్వాసం మానవ సేవకు ఉపయోగించబడింది. ప్రపంచంలోని అగ్రగామి కథానాయకులలో మార్గదర్శకులలో ఒకనిగా చేసింది.

''ఆయన కాలనీలో ఉండలేదు.''

మీ ఇంట్లో వుండి మీరు చెప్పిన ఈ మాటలను సమర్థించే వారు. నమ్మేవారు ఏ ఒక్కరు ఉండరు!

''అక్కడి సంస్కరణలలో ఆయన పాత్ర ఏమీ లేదు''

ఆ దీవిలో అభివృద్ధి అంతా డామియన్ కృషివలననే జరిగింది. ఆయన త్యాగం వలననే ప్రపంచం దృష్టిఅటు మళ్లింది. ఒక్క వేటుతో, అతని జీవిత త్యాగంతో ఈ ప్రాంతాన్ని సుందరంగా చేసి బహిరంగపరిచారు. ఎవరయినా సంఘసంస్కర్తలుంటే, సంస్కరణ కొరకే వారు మరణిస్తే ఆ మహా సంస్కర్త డామియన్ ఒక్కడే.

''స్త్రీల విషయంలో ఆయన పరిశుద్ధుడు కాడు''

మీ కెట్లా తెలుసు ఆ విషయం! మీ ఇంట్లో ఇటువంటి సంగతులే మాట్లాడుకుంటారా ! గుర్రపుబండి వాడు చెప్పింది నిజమే నన్నమాట.

నాకు ముందు కూడా చాలా మంది ఆ దీవికి వెళ్ళారు. ఈ వదంతిని ఎవరూ విన్నట్లులేదు. నేను అక్కడ చాలా ఘాటైనా కథలు విన్నాను. నాకు సమాచారం తెలిపిన వాళ్ళు కూడా కల్లా, కపటం తెలియని సాధారణ వ్యక్తులు. వారెవరూ నాకు చెప్పలేదు. మరి పడకగదిలో పొర్లాడుతున్న మీకెలా తెలిసింది!

ఈ నింద ఒక్కసారి విన్నాను. 'హోనొలూలు' నుంచి 'సమొవా'కు ఒక మనిషి వచ్చాడు. ఒక బహిరంగ ప్రదేశంలో తనకు తానుగా అన్నాడు. డామియన్ కు ఆగరోగులతో సంబంధాలున్నాయి. అందుకే ఆయనకా జబ్బు వచ్చింది. అని. అది విన్నమరొకతను ఎగిరిపడ్డాడు. ''అరే నీచమయిన పిల్ల....'' (ఇక్కడ నేను వ్రాయలేను. వింటే అదిరిపోతారు) అరే, నీచమైన పిల్ల..... అని మళ్ళీ అరుస్తూ కోపంతో పళ్ళు నూరుతూ 'నీవు అన్నది వెయ్యిసార్లు నిజమే అయినా అది చెప్పే సాహసం చేసినందుకు నువ్వు ఆయన కంటే పదిలక్షల సార్లు అధముడివిరా' 'పిల్ల...' అని పొట్లాడాడు. ఆనాడు నిందించింది ఒక అల్పుడు, తాగివున్నప్పుడు తన స్థాయివాడికో, ఇంకా అధముడికో చెప్పివుంటాడు. చిక్కుముడిలా అలా అలా శుష్కించిపోతూ మీకు తెలిసిన కథను మీరు హెచ్.బి.గేజి గార్కి తెలియజేశారు. మీ ప్రియమైన సోదరుడు గేజి-నిజంగా మీ సోదరుడే-మీ పట్ల దయతో మీ లేఖను మత పత్రికకు పంపాడు. చాల నెలల తరువాత నేను చూసి ఆశ్చర్యపోయాను.

ఒక వేళ మీ కట్టుకథ నిజమే అనుకుందాం. (అలా అనవలసి వచ్చినందుకు భగవంతుడు నన్ను క్షమించుగాక) డామియన్ పొరపాటు చేశాడు ఆయన విధి నిర్వహణలో లోట్లున్నాయి. వెలివేయబడిన వాతావరణంలో, భీభత్సపరిస్థితుల్లో, పీల్చి పిప్పిచేసే వ్యాధి భయంతో అతను మతబోధకుడిగా ప్రమాణం చేసిన దాని కంటె తక్కువగా సేవచేసి మాట నిలుపుకోలేక పోయినప్పటికి ఆయన మీకంటె, నాకంటె మహోన్నటుడు. ఆయన చేసిన పనులు మనం కలలో గూడా ఊహించనివి. ఒకవేళ ఆయన మన బలహీనతను రుచి చూసాడేమో! పాపము శమించుగాక! ఆయన త్యాగం గుర్తు వస్తే, ఏ మారుమూలలోనైనా కాస్త మృదుత్వం ఉంటే హృదయం ద్రవించి కన్నీరు కారుస్తుంది. నాస్తికుడైనా ప్రార్థన చేస్తాడు. అలాటి వ్యక్తిని మీరు నిందించారు. అంటే మీ హృదయం ఎలాంటిదో, స్పష్టపడిందనుకుంటాను.

మీ కొకనాన్న ఉంటే, ఆయన గురించి ఇలాంటి కథ ఎవరయినా చెప్తే ఏమనుకుంటారు! ఆ పరిస్థితి రాకూడదనుకుంటారు. పత్రికకు అచ్చుకు ఇవ్వరు. మంచిది. డామియన్ మా తండ్రి మంచిని ప్రేమించే వారందరికి తండ్రి. భగవంతుడు కరుణించి చూడగల శక్తి అనుగ్రహించివుంటే డామియన్ మీకు గూడా తండ్రి.

ఇట్లు
ఆర్.యల్. స్టీవెన్ సన్

ఫాదర్ డామియన్ మరణంతో లెప్రసీరోగుల సంక్షేమకార్యక్రమాలు ఆగిపోలేదు. ఆ బెల్జియన్ మతబోధకుని కృషివల్ల పరోక్షంగా ఉత్తేజితులై ప్రపంచమంతమ పలువురు కృషిచేయసాగారు. పదహారు ఏండ్లపాటు ఆయన జీవితాన్ని సమిధగా వెలిగిస్తూ మొలకాయ్ దీవులలో ఆయన చేసిన త్యాగాలవలన ప్రపంచ ప్రజలకే కనువిప్పు కలిగింది. దేశ దేశాలలోని లక్షలాది రోగుల దయనీయస్థితిగతులు దాతల హృదయాలను కలచివేశాయి. రోగుల కొరకు ప్రార్థనలు చేయసాగారు. ధన, వస్తు రూపాలలో సహాయం అందించసాగారు.

డామియన్ నడచిన దారిలో నడవడానికి వందలాది కేథలిక్ ప్రొటెస్టెంటు యువతీ, యువకులు నిర్ణయించుకున్నారు. 16,17శతాబ్దాలలో కొద్దిమంది సిస్టర్సు, ఫాదర్లు ఈరోగుల సేవలో జీవితాలను అంకితం చేసినా 18,19 శతాబ్దాలలో మాత్రము వీరినిగురించి పట్టించుకున్న వారే లేరనే చెప్పవచ్చు. డామియన్ కృషి కొత్తతరం కార్యకర్తలకు స్ఫూర్తిని కలిగించింది. మిషనరీ శాఖలు ఆసుపత్రులను ప్రారంభించసాగాయి. మదర్ మేరీ అనే ఆమె (1839-1904) ఫ్రాన్సిస్కన్ మత శాఖను ప్రారంభించి, దక్షిణ భారతదేశంలో లెప్రసీ రోగులకు సేవచేయసాగింది. ఆరుగురు కార్యకర్తలు కావాలని సిస్టర్సుకు అభ్యర్ధన పంపితే వెయ్యిమంది తమ ఆసక్తిని తెలుపుతూ ముందుకు వచ్చారు. వీరిలో ఆరుగురిని ఎన్నుకున్నారు. బర్మా జపాన్, మడగాస్కర్, శ్రీలంకలలో వేలాదిరోగులకు, సంరక్షణ ఏర్పాటు చేశారు. దాదాపు రెండేళ్ళ కొకటి చొప్పున డామియన్ మరణించిన తరువాత 16 ఏండ్లలో 7,8 ప్రముఖ ఆసుపత్రులు కాథొలిక్కులచే ప్రారంభించబడ్డాయి. డామియన్ సహచరుడు అయిన ఫాదర్ యల్.యల్. కాన్రార్డి మొలకాయ్ వదలి ఒరేగాన్ విశ్వవిద్యాలయంలో వైద్యశస్త్రపట్టా పుచ్చుకొన్నాడు. యూరప్, అమెరికాలలో విస్తృతంగా పర్యటించి, హృదయాలను కదలించేలాగా విజ్ఞప్తులుచేస్తు, విరాళాలు సేకరించి దక్షిణ చైనాలో ప్రపంచంలోనే అతి పెద్దదైన ఆసుపత్రిని ప్రారంభించాడు.

డామియన్ చనిపోయినా ఆయనను మరువలేము. కాలం గడిచేకొలది ఆయన కృషి ఫలితాలు దిగంతాలకు వ్యాపించసాగాయి.

ప్రపంచంలోని ప్రతిమారుమూల ప్రదేశంలో కూడా ఆయన పేరు తెలిసింది.

ఆయన గూర్చి వెలువడ్డాయి. స్మారక చిహ్నాలు నెలకొల్పబడ్డాయి. కవులు కవితారచనలు చేశారు. ఆయనను ప్రస్తుతిస్తూ గాయకులు గానం చేశారు. వీధులకు ఆయన పేరు పెట్టారు, అంతేకాడు 'డామియన్' పేరు ప్రముఖుల జాబితాలలో, నిఘంటువులలో చేర్చారు. మానవాళిలో మణిపూసవంటి వాడుగా ఆయన కీర్తి చిరస్మరణీయమైంది.

1935లో హవాయి గవర్నర్ జనరల్ ఏటా మూడువేల డాలర్లు మంజూరు చేసి, మొలకాయ్ లోని డామియన్, డట్టన్, మరి కొందరి సమాధులను జాతీయసంపదగా పరిరక్షించడానికి ఏర్పాట్లు చేశాడు.

* * * * * *

మొలకాయ్ దీవులలో సిస్టర్సు అతి మృదువుగా శవపేటికలో పట్టుబట్టను అమర్చి డామియన్ దేహాన్ని పదిలపరచి 46 ఏండ్లు గడచిపోయాయి.

బెల్జియన్ రాజు మూడవ లియోపాల్డ్ అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్షుడు రూజ్ వెల్టుకు 1934లో 'మా ప్రజలు వారి సోదరుడైన ఫాదర్ డామియన్ శరీర అవశేషాలను మాదేశానికి తెప్పించాలని అమిత ఆసక్తి చూపుతున్నారు' అని వ్రాశాడు.

రోమన్ మతపెద్దలు, దీర్ఘకాల చర్చల అనంతరం అంగీకారం తెలిపారు.

27-1-1936న రంగురంగుల పూలచెట్లు మధ్య ఉన్న కలావో శ్మశానంలో పలుగు, పార మోత వినిపించింది. అంతేకాదు వారి మతబోధకుడిని అక్కడినుండి తీసుకువెడుతున్నందుకు బాధతో ఏడ్చిన ఏడ్పులు కూడా వినిపిస్తున్నాయి.

పీఠాధిపతి వారిని ఓదారుస్తూ, ''మీ నిరసనలను విన్నాము ఆయనను ఇక్కడినుంచి తొలగించరాదనే మీ అభిప్రాయానికి మా సానుభూతికూడా ఉంది. కానీ, ఏ దేశమైతే ఆయనను మనకు ఇచ్చిందో, ఆ స్వదేశమే ఈనాడు ఆయనను కావాలని అడుగుతుంది. వారు ఆయనను కీర్తించాలని, అందుకు ఈమారుమూలలో వీలుకాదని వారి బెల్జియం దేశానికి తీసుకువెళ్ళవలసి వచ్చింది అని '' ఓదార్చాడు.

శవపేటికను తెరిచారు. తమకొరకు ప్రాణాలు వదలిన ఆ మహానీయుని శరీరంలో ఏమి మిగిలిందో చూడాలని లెప్రసీ రోగులు బారులు తీరి ఉన్నారు. డామియన్ బంధువులు ముగ్గురు (ఒక సన్యాసిని, ఇద్దరు మతబోధకులు) అక్కడేవుండి పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వ, మిలటరీ, పౌర, నౌకాళాధికారులు, దౌత్యవేత్తలు, అన్ని మతాల ప్రతినిధులు, అన్ని జాతుల, శాఖల ప్రజానీకం సమావేశమయ్యారు. రాజవంశపు వారికే నిర్దేశించబడిన 'కోవా' అనే విలువయిన చెక్క పేటిక నిర్మించబడింది.

''అలోహాబి'' అనే విషాద వీడ్కోలు గీతంతో దీవి మార్మోగింది. అక్కడ ఎత్తైన చెట్లలో ఆ పాట ప్రతిధ్వనించింది. నలుపు, బంగారు వస్త్రాలను చుట్టి ఆయన భౌతికావశేషాలను అమెరికా మిలటరీ విమానంలో ''హోనొలూలు''కు కు తీసుకువెళ్ళారు. ఉషోదయ కాంతిలో యూనిఫారం ధరించిన సాయుధులయిన సైనికులు ఫిరంగి వందనం చేశారు. సైనిక శకటంపై డామియన్ అవశేషాలు పురవీధులలో ఊరేగింపుగా వెడుతున్నాయి. ప్రజలు గౌరవ ప్రపత్తులతో వినమ్రులై ఆ అరుదైన దృశ్యాన్ని అవలోకిస్తున్నారు. మిలటరీ వాద్యాల వేగం తగ్గింది. తెల్లదుస్తులు ధరించిన మతబోధకులు శ్రద్ధాంజలి ఘటిస్తూవరుసగా నిలుచున్నారు.

అది ప్రార్థనాలయం. ఆయన ఎక్కడ మతబోధకుడిగా ప్రమాణం చేశాడో అదే ప్రార్థనాలయం. అగరువత్తుల ధూపం ఆ ప్రాంతమంతా మేఘం లాగా

వ్యాపించింది. వేదిక పైని క్రొవ్వు వత్తులు నక్షత్రాలలాగా మినుకుమినుకుమంటూ మెరుస్తూన్నాయి. అక్కడ ఫాదర్ కు సామూహిక శ్రద్ధాంజలి ఘటించారు.

''డామియన్ కు జోహార్లు
ధైర్యశాలి, క్రీస్తు సైనికుడు
మొలకాయ్ విమోచనాకారుడూ,
బెల్జియం దేశానికి గర్వకారకుడు
మతానికి, శాఖకూ తేజస్సు,
ప్రభువు కాంతీ అయిన
డామియన్ కు జోహార్లు''

అనే మాటల మార్మోతతో సమావేశం ముగిసింది.

దీవులను వదలి డామియన్ తన ఇంటికి తిరిగి వస్తున్నాడు. జాతీయ పతాకాలను అవనతం చేశారు. హోనొలూలు హార్బరుకు దూరంగా అమెరికన్ నౌక వేచివుంది. దాని మీదుగా ఎనిమిది బాంబరు విమానాలు ఎగిరాయి. విశిష్ట సేవలు చేసిన మిలటరీ ఉన్నత అధికారులకు యిచ్చే గౌరవ వందనాన్ని ఆయనకు యిచ్చారు.

నౌక బయలుదేరింది. శాన్ ఫ్రాన్సిస్ కో చేరింది. ఆ మహానగరం కూడా శ్రద్ధాంజలి ఘటించింది. ఇక్కడా సైనికవందనం చేశారు. మతబోధకులు ప్రార్ధనలు చేశారు. ప్రజలు గౌరవంగా మౌనంగా చూశారు. ఒక సాధారణ ఫాదర్ అయిన డామియన్ గూర్చి అగ్రపీఠాధిపతి ప్రార్ధనలు చేశాడు.

ఆకాశం మేఘావృతమై, వర్షం పడసాగింది, పనామాకాలువ గుండా దక్షిణానికి తిరిగి అక్కడ బెల్జియం దేశపు శిక్షణ నౌకలోనికి మార్చారు. నౌకాదళం వందనం చేసింది సైనిక లాంఛనాలతో. 'మెర్కెటర్' అనే ఆ నౌక ప్రయాణం సాగించి బెల్జియం చేరింది. ట్రెమెలూ ప్రాంతపు ఒక సాధారణ రైతుబిడ్డ శరీర అవశేషాలకు ఆ దేశపు రాజు స్వయంగా వచ్చి వినమ్రుడై అసాధారణ రీతిలో వందనం చేశాడు. ఒక మామూలు ఫాదర్ కు అగ్రపీఠాధిపతి

దిగివచ్చి తలవంచి ప్రణామం చేశాడు. ఇక సైనిక వందనాలు ప్రజలు జోహారులు సరేసరి.

సాయంత్రం ఆరు తెల్ల గుర్రాలు లాగే శకటం పేటికను తీసుకుని నిదానంగా సాగి లోవైనుకు బయలుదేరింది. 73సంవత్సరాల క్రితం అతను వదలి వెళ్ళిన చోటు అది. బాలునిగా తిరిగి ఆటలాడిన ఆ ప్రదేశానికి అమర వీరునిగా ప్రపంచ ప్రజల జోహారులు అందుకుంటూ తిరిగివెళ్ళాడు. డామియన్ విద్యార్థిగా ఉన్నప్పుడు చురుకుగా పనిచేసి ఏ చర్చినయితే పునరుద్ధరించాడో ఆ చర్చిలోనే ఆయన అవశేషాలను భద్రపరచి, అభిమానులు దర్శించుకునే వీలు కలిగించారు.

ఆ పేటికలో ఉన్న సెయింట్ జోసెపు ప్రార్ధనాలయం నేటికి బెల్జియం దేశపు పవిత్ర ప్రదేశాలలో ఒకటి.

ప్రస్తుత పరిస్థితి :

ఈ వ్యాధి ఇప్పటికి భారతదేశంలో చాలా ఎక్కువగానే వుంది. దేశంలో 35లక్షలమందికి పైగా రోగులున్నారని అంచనా. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు వంటి కొన్ని రాష్ట్రాలలో ఈ జబ్బు మరీ ఎక్కువగా వుంది. ఆంధ్రప్రదేశ్ లో ప్రతి వెయ్యి మందిలో 15మంది, తమిళనాడులో 19మంది రోగులున్నారు. ఉన్నరోగులలో నాలుగోవంతు మాత్రమే అంటురోగులు.

ఈ వ్యాధి ఎవరికైనా రావచ్చు. పేద, ధనిక, వయోబేధం లేదు. మొదట్లో ఈ వ్యాధి చర్మముపై మచ్చలుగా వస్తుంది. ఈ మచ్చలలో మొద్దుబారి స్పర్శజ్ఞానము తెలియదు. కొన్నాళ్ళకు నరాలకు కూడా సోకితే వ్రేళ్ళు వంకరలు పోయి అవయవ లోపాలు వస్తాయి. అంటువ్యాధిలో శరీరమంతా మచ్చలు వచ్చి, చమట ఎక్కువగా పోస్తుంది, తరువాత చెవులు లావవుతాయి. శరీరంపై కణుతులు వస్తాయి. ముక్కు చొట్టపడవచ్చు.

ఈ వ్యాధిని నిర్మూలించడానికై ప్రభుత్వమూ, స్వచ్ఛంద సేవాసంస్థలు కృషిచేస్తున్నాయి. దేశమంతటా లెప్రసీ నిర్మూలన కేంద్రాలను స్థాపించారు. ప్రతి

25వేల జనాభాకు ఒక శిక్షణ పొందిన కార్యకర్తను నియమించారు. వీరు రోగులను ప్రారంభ దశలోనే కనుగొని, చికిత్స చేయడానికి, ప్రజానీకాన్ని పరీక్షచేయడానికి ఏర్పాట్లున్నాయి. వ్యాధిని ఏ దశలోనయినా తగ్గించగల మందులు ఇప్పుడు వున్నాయి.

ఎంత త్వరగా వ్యాధిని గుర్తించి చికిత్స చేస్తే అంత త్వరగా తగ్గించవచ్చును.

డా॥హేన్సన్ పరిశోధనలవలన ఈ వ్యాధికి కారణం తెలిసి 110 ఏళ్లయింది. దీనికి మంచి మందులున్నాయి. అపోహలను వదలి రోగులు ముందుకువచ్చి సక్రమంగా మందులువాడితే ఈ వ్యాధిని నిర్మూలించడం కష్టంకాదు.

ఇవాళటి విజ్ఞానాన్ని బట్టి లెప్రసీ వ్యాధి మిగతా ఎన్నో జబ్బులలాగ ఒక జబ్బు. దీన్ని నివారించవచ్చు. మందుల ద్వారా తగ్గించవచ్చు.

వ్యాధిని గూర్చి శాస్త్రీయ దృష్టితో అవగాహన చేసుకొని, రోగులను మానవతా దృష్టితో చూడటం ప్రజల కర్తవ్యం.

* *